ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ  మాతృదేవోభవ ! పితృదేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !  సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 20 - సంచిక 02
జులై 2015

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
99491 11175
94407 69798


## అజ్ఞానమే శూద్రత్వము - సుజ్ఞానమే బ్రాహ్మణత్వము

శృతి-ప్రమాణము ప్రకారం బ్రహ్మ వతుఖము నుండి పుట్టిన బ్రాహ్మణునకు మాత్రమే వేదపారాయణ చేసే అధికారము ఉన్నది కాని వేరెవ్వరికి లేదన్నది. దీనికి జవాబు - వృత్తి భేదముల చేత ఎక్కువ తక్కువలేగాని అందరూ పృథ్వీతత్త్వంతో కూడిన అన్నరసము వలన కామముతో సతీపతులు రతిసల్పగా శుక్లశోణితములతో కూడిన కులమేగాని ఘనమైన కులము లేదు. సర్వజాతులు యోని ప్రజాపతులచే పుట్టినవారే గాని అకస్మాత్తుగా ఆకాశము నుండి ఊడిపడిన గొప్పవారెవ్వరూ లేరు. అజ్ఞానమే శూద్రత్వము సుజ్ఞానమే బ్రాహ్మణత్వము.

మాదిగవానిని యాచించువాడు డొక్కలవాడు, డొక్కలవాడిని యాచించువాడు మూగలవాడు, వీనిని యాచించువాడు చపలమూగలవాడు, వీనిని యాచించువాడు కులస్థుడు, వీనిని యాచించువాడు కులహీనుడు, వీనిని యాచించువాడు మైలపుసొక్కన్న, వీనిని యాచించువాడు సొప్పకంటివాడు, వీనిని యాచించువాడు సింహవిష్ణు, వీనిని యాచించువాడు చపలచోరకుడు, వీనిని యాచించునది అతని చెల్లెలు ఊర్వశి, ఊర్వశిని పొందినవాడు బ్రహ్మ, బ్రహ్మకు పుట్టినవాడు వశిష్టుడు. ఆ వశిష్టుడు కృతయుగములో హరిశ్చంద్రునికి గురువు, త్రేతాయుగములో శ్రీరామునికి గురువు అయినాడు.

వశిష్టుని భార్య ఛండాలి. ఈమె కొడుకు శక్తి - ఇతని భార్య చపలాత్మ - ఈమె కొడుకు పరాశరుడు - ఇతని భార్య కైవర్తి. ఈమె కుమారుడు వ్యాసుడు. ఈయన కుమారులు ధృతరాష్ట్ర-పాండురాజులు. శుకమహర్షి నిమ్నజాతిలో పుట్టి మంత్రసాధనతో దురితహరుడైనాడు. భక్తిజ్ఞానంతో బ్రాహ్మణత్వం సిద్ధిస్తుంది. కాని జన్మతో కాదనెడిది యథార్థము.

జాతి బ్రాహ్మణుని కన్నా ఆచారబ్రాహ్మణుడు మిన్న, ఆచారబ్రాహ్మణుని కన్నా జ్ఞానబ్రాహ్మణుడు మిన్నయని శాస్త్రాలు వచిస్తున్నాయి. దృఢాభ్యాసముతో భగవన్నిష్ఠ చేసినట్లయిన బ్రాహ్మణాది ఛండాలాంతమెవ్వరైనాగాని జన్మరాహిత్యాన్ని పొందవచ్చునని శృతులు చెప్పుచున్నాయి.

*- వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర ఆధారంగా*

**జీవితాన్ని ప్రతి వ్యక్తి తన ఇచ్ఛానుసారమే గడుపుతాడు**

# విషయసూచిక


1. **సంపాదకీయం :** అజ్ఞానమే శూద్రత్వము – సుజ్ఞానమే బ్రాహ్మణత్వము 3
2. **విషయసూచిక-సద్గురువాణి :** పాత్రతను పెంచుకో 4
3. **వేదమంత్రం:** గ్రామసీమలు-గాయత్రీసీమలు కావాలి 5
4. **యుగనిర్మాణ చిత్రావళి–4 :** 'సంఘశక్తి'కి ప్రతీక 'దుర్గావతరణ' 6
5. **అశ్వమేధం–5 :** యజ్ఞము – మహాయజ్ఞము – అశ్వమేధయజ్ఞము 8
6. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర – 37 :** ఆశీస్సులు, వాగ్దానాలు 10
7. **వ్యక్తి నిర్మాణం:** ఆత్మవిశ్వాసము యొక్క మహత్తరమైన శక్తి సామర్థ్యములు 13
8. **ప్రకృతితో ఆటలాడవద్దు** 15
9. **పంచతత్త్వాల పిలుపు వినండి** 17
10. **సూర్యవిజ్ఞానం:** సూర్యచక్ర జాగరణ 18
11. **గురుపూర్ణిమ ప్రత్యేకం:** మనలోని అకుంఠిత శ్రద్ధా విశ్వాసాలు సద్గురువును మనవద్దకు రప్పిస్తాయి 20
12. **గురుపూర్ణిమ ప్రత్యేకం:** పండిత శ్రీరామశర్మ ఆచార్య సందేశం 23
13. **బోధ కథ :** గాయత్రి కురిపించిన కరుణ 24
14. **వజ్రోత్సవ జయంతిపై యుగఋషి యొక్క మనోభావాలు** 28
15. **బ్రహ్మముహూర్త వేళ ప్రకృతి ధనాగారం గుబాళిస్తుంది** 32
16. **మనం – మన ఆరోగ్యం :** చికిత్స యంత్రాలతో కాక ప్రాణశక్తితో జరుగుతుంది 34
17. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** మానవ శరీరము యొక్క అసలైన సంపదలు–3 35
18. **నా వారితో నా మాట:** మహామానవులను తయారు చేసే ముద్రణా స్థలం-దేవసంస్కృతి విశ్వవిద్యాలయం 38
19. **ఆయుర్వేదవైద్యం–3 :** చేదు వేపతో అనేక లాభాలు 42
20. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు–14** 44
21. **9 రోజుల సంజీవిని సాధనా శిబిరముపై నివేదిక మరియు ప్రవచనముల పాఠము–2** 46
22. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48




## సద్గురు వాణి

### పాత్రతను పెంచుకో

నీవు ఒంటరిగానైనా గురువుల పని చేయి–వజ్రంలా రూపొందుతావు. ఇతర కార్యకర్తలపై నీ దృష్టి నిలపకు. నన్ను చూస్తూ నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు. నీవు ధైర్యంగా ముందుకు సాగు. నిన్ను తీర్చిదిద్దుతా! పరిరక్షిస్తా! సదా నా గుండెలకు హత్తుకొని ఉంటావు. నీ హృదయంలో నీ స్థానం పదిలంగా ఉంటుంది.


## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ|| 15/-** **సం|| చందా రూ|| 150/-**
**3 సం|| చందా రూ|| 420/-** **10 సం|| చందా రూ|| 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.



**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు – 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**బంధనాన్ని వీడితే జీవునికి ముక్తి**

మన కర్తవ్యం

# గ్రామసీమలు - గాయత్రీసీమలు కావాలి

భారతదేశానికి పట్టుగొమ్మలు గ్రామసీమలు. అలనాటి గ్రామసీమలు జాతి సంస్కృతికి, సంస్కారాలకు నిలయాలుగా భాసిల్లాయి. సుజలాలు, సుమధుర ఫలాలు, జుంటితేనెలను, మీగడ పెరుగులనందించి జాతిని సుదృఢం గావించాయి. జాతిలో తేజస్సును నింపాయి. సంక్రాంతిపండుగవేళ ముంగిళ్ళలో రంగవల్లుల తీర్చిదిద్ది, సంబరాలు జరుపుకుంటూ, ఆనందాన్ని పంచుకుంటూ, అన్నార్తులకు, ఆపన్నులకు ఆపన్నహస్తాన్నందిస్తూ పరస్పర ప్రేమను చాటుకొనేవారు. అట్లే హరిదాసుల ప్రోత్సహిస్తూ హరికథను వీధి వీధిలో ఇంటింటా వినిపింపజేసేవారు. గంగిరెద్దుల మేళాలతో పామరులకు సీతారాముల కళ్యాణగాథను వీనులవిందుగా వినిపిస్తూ, రసభరితంగా కనువిందు గావించేవారు. గ్రామసీమల్లో తమ జీవితాల్లో అంతర్భాగమై పెనవేసుకుని జీవించెడి పశువుల పట్ల తమ ప్రేమానురాగాలు చాటుతూ వానికి తమ ప్రేమను పంచుటలో పోటీపడేవారు. ఎద్దులతో బరువుల లాగించుటలో పోటీలు, పరుగు పందేల పోటీలు నిర్వహించి సామూహిక ఆనందాన్ని పిల్లాపాపల దగ్గర నుండి, ముదుసలుల వరకూ పొందుట పరిపాటి. వీనిని ఆసరాగా చేసికొని పెద్దఎత్తున పశుపోషణ, పాల ఉత్పత్తిని పెంచేవారు. తద్వారా జాతికి జవజీవాలనందించేవారు. దసరాపండుగ రోజుల్లో జాతికి జ్ఞానాన్నందించెడి జ్ఞానదాతలైన అధ్యాపకులను (గురువులను) సత్కరించి, వారికి వారి కుటుంబ జీవనోపాధికి కావలసిన వార్షిక ఆదాయాన్ని ఆనాటి సమాజం ఏర్పాటు చేసెడిది. ఇంటింటి నుండి అయ్యవారికి ఐదువరహాలు, పిల్లలకు పప్పుబెల్లాలు సమకూర్చేవి ఆనాటి గ్రామసీమలు.

అట్లతద్దె, ఉండ్రాళ్ళతద్దె పండుగల వేళ ఊయలలూగెడి కార్యక్రమాన్ని సామూహికంగా చేపట్టి స్త్రీల ఆనందంలో తమ ఆనందాన్ని చూచెడిది పురుషలోకం. ముత్తైదువులు, బాలికలు, నవవధువులు రంగురంగుల నూతన వస్త్రాల ధరించి సీతాకోక చిలుకల్లా చూపరులకు కనువిందుగావిస్తూ ధనిక పేద తేడా లేకుండా ఆనందాన్ని పంచుకుంటూ ఒకే కుటుంబంలా మసలుకొనుట మరపురాని మధురానుభూతుల పంచెడిది. స్త్రీ పురుషులు సమానమే, ఒకరి పట్ల ఒకరు పవిత్రభావంతో మసలుకొనేవారు. అలనాడు గ్రామాలలో వివాహవేడుకల వేళ, వివాహానికి ముందు ఆయా గ్రామదేవతలైన నాంచారమ్మ, పోతురాజు, సమ్మక్క-సారక్క, ఎల్లమ్మ, పోలేరమ్మ, ఈశ్వరమ్మ లకు పూజలు చేసి వారి ఆశీస్సుల పొంది తదుపరి మనువాడే వారు. ఆ గ్రామదేవతలకు ఆచ్ఛాదనగా రావిచెట్లు, వేపచెట్లు నాటి వానిని పూజించేవారు. ఈరీతిగా ప్రాణశక్తిని అందించెడి వృక్షాలను పెంచిపోషించి, పూజిస్తూ వానిని చిరకాలము రక్షిస్తూ తమ జీవితాలలో ఒక భాగంగా చూసుకొనేవారు. పర్యావరణాన్ని సామూహికంగా కాపాడేవారు.

నేడు సాంకేతిక పరిజ్ఞానం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుచున్నది. దీన్ని పరిగణలోనికి తీసికొని అలనాటి మేటి సామాజిక విలువలను, కుటుంబ-మానవీయ విలువలను కాపాడుకొంటూ, పర్యావరణాన్ని పరిరక్షించుకొంటూ, సకల జీవరాశుల మధ్య సమతుల్యతను పాటిస్తూ పూజ్యగురుదేవుల అష్టాదశ (18) సత్సంకల్పాలను మన జీవితాలలో భాగంగా చేసికొంటూ గ్రామవికాసాలకై పాటుపడదాం.

*- పూ.గు. యుగనిర్మాణ సత్సంకల్పాల ప్రేరణతో*

## పండుగలు

**జులై 2015**

| | |
|---|---|
| 14-07-2015 | గోదావరిపుష్కర ప్రారంభం |
| 18-07-2015 | పూరి జగన్నాథస్వామి రథయాత్ర / రంజాన్ |
| 27-07-2015 | శయన (తొలి) ఏకాదశి |
| 31-07-2015 | వ్యాసపూర్ణిమ / గురుపూర్ణిమ |

**ఆగస్టు 2015**

| | |
|---|---|
| 15-08-2015 | స్వాతంత్ర్యదినోత్సవం |
| 22-08-2015 | సంత్ తులసీదాస్ జయంతి |
| 28-08-2015 | వరలక్ష్మీవ్రతం |
| 29-08-2015 | రాఖీపూర్ణిమ |

**స్థూల శరీరానికి ఇంద్రియ భోగాలు తృప్తినిస్తే సూక్ష్మశరీరానికి సుగంధ రసాస్వాదన తృప్తినిస్తుంది**

యుగనిర్మాణ చిత్రావళి-4

# 'సంఘశక్తి'కి ప్రతీక 'దుర్గావతరణ'

అనేక సమయాలలో అన్ని ప్రదేశాలలో దేవతలు అపజయాన్ని పొందారు. దేవతలను విడదీసి, ఒక్కొక్కరిని ఓడిస్తూ రాక్షసులు విజయపరంపరను చేపడుతూ ముందుకు సాగుచున్నారు. చిట్టచివరకు దేవతల ఉనికి సంకటంలో పడింది.



చిత్తరువులో చూపిన రీతిలో ఓటమి పొందిన దేవతలంతా గుమిగూడి బ్రహ్మదేవుని చెంతకు చేరారు. దేవతలు తాము ఓడిపోవుటకు కారణాన్ని మరియు రాక్షసుల జయించే ఉపాయాన్ని తెలుపమని బ్రహ్మను అర్థించారు. దేవతల ఓటమికి కారణాన్ని మరియు రాక్షసులపై విజయాన్ని పొందుటకు గల నూతన ప్రణాళికలపై కొంత తడవు యోచించి బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు – "దేవతలారా" మీరంతా దివ్యగుణశక్తులు కలిగి ఉన్నారు. మీలో త్యాగభావం మరియు తపశ్శక్తికి కొదువలేదు. అట్లే శక్తి సాహసాల్లో కూడా మీకు కొదువ లేదు. కాని మీలో కొట్టవచ్చినట్లు కన్పించే లోపం "మీరు సంఘటితం కాలేకపోవుట." మీ యొక్క శక్తులు ఏకం కాకపోవుట కారణంగా కావలసినంత ప్రభావాన్ని అవి ఉత్పన్నం చేయలేకపోయాయి. పాపులు దుర్గుణాలతో నిండి ఉన్నా కూడా వారు కేవలం తాము సంఘటితమై ఉండుట వలన కొద్దిపాటి సంఖ్యలో ఉండి కూడా పాపులైన రాక్షసులు వారి శక్తిని ఇనుమడింపజేయగలిగారు. అలాగే దేవతలంతా నిజంగా కోరుకున్నచో సంఘటితమై రాక్షసశక్తిని సునాయాసంగా అంతమొందించగలరు.

చిత్తరువులో బ్రహ్మదేవుని ప్రేరణతో దేవతల అందరి నుండి శక్తి యొక్క కొద్దిపాటి అంశను తీసికొని దుర్గ అవతరణను చూపించుట జరిగింది. ఈ రహస్యాన్ని వెల్లడించినంతనే దేవతలంతా కలసి వారి వారి శక్తులలోని ఒక అంశాన్ని ఇచ్చి ఒక గొప్ప సంఘశక్తిని నిర్మించారు. దీని ప్రతిరూపమే దుర్గ. ఈ దుర్గాశక్తి ద్వారా శ్రేష్ఠ పురుషుల యొక్క శక్తులు కూడా ఏకత్రితమై పనిచేస్తాయి.

ఈ సంఘశక్తి అవతరించి, సింహాన్ని తన వాహనంగా చేసికొన్నది. సింహము సాహసానికి మరియు స్ఫూర్తికి ప్రతీక. అనగా దీనిలోని భావార్థము – దేవతలు తమ సామూహిక శక్తిని సాహసపూర్వకంగా తేజోవంతంగా ప్రయోగించిన ఫలితంగా గొప్ప గొప్ప భయంకర దిగ్గజాలవంటి రాక్షసుల అందరిని సంహరించింది దుర్గామాత. ఈ ప్రక్క ఉదహరించిన మరోచిత్తరువులో దుర్గాదేవి రాక్షసుల సంహరించుట చూపించబడింది. ఆమె తన వాహనమైన సింహంతో కూడి రాక్షసుల సంహరించుట చూడగలం. ఇప్పుడు రాక్షసులు ఆమె ఎదుటపడుటకు కూడా సాహసింపజాలకున్నారు.

పురాణాలలో దుర్గావతరణ కథ ద్వారా సంఘశక్తి యొక్క గొప్పతనము అలంకారికంగా చిత్రించబడింది. ఇది యుగ యుగాలుగా తన ప్రేరణ ద్వారా సమాజానికి ఉపకరించింది. రావణుని వంటి శక్తివంతమైన రాక్షసుని ఎదుట నిలచి పోరాడే శక్తి ఏ వానరానికి లేదు. కాని వానరుల సామూహికశక్తి ఫలితము వలననే ఒక లక్షమంది కుమారులను, లక్షా ఇరువది

**శ్రద్ధతో చేసెడి కర్మను శ్రాద్ధకర్మ అంటారు**

వేలమంది స్త్రీల మధ్య కులికెడి మాయావి రావణుడు సైతం నేలకొరిగిపోయాడు. అట్లే ద్వాపరయుగంలో ఇంద్రుని కోపానికి ఎదురొడ్డి నిలచుట కష్టసాధ్యము. ఐనప్పటికి కృష్ణుని దైవీశక్తి ప్రేరణతో యాదవులంతా ఏకమై గోవర్ధనగిరిని ఎత్తగలిగారు. ఇంద్రుని గర్వమణచారు. అదేవిధంగా భగవాన్ బుద్ధుని కాలంలో "బుద్ధం శరణం గచ్ఛామి" "ధర్మం శరణం గచ్ఛామి" లతోపాటు "సంఘం శరణం గచ్ఛామి" ని సాధనగా చేసికొని, ఆనాడు ధర్మం పేరిట చలామణి అగుచున్న అజ్ఞానాన్ని, అనాచారాలను, ఆడంబరాలను, మతాంతరాల దురాగతాలను ప్రతిఘటించి నిలువరించారు. ఇదేమార్గాన్ని కొలది కాలం క్రితం గాంధీ కూడా అనుసరించారు. గాంధీ రూపంలో దుర్గాశక్తి అవతార మెత్తి రవి అస్తమించని శక్తిశాలురైన ఆంగ్లేయుల అధికారాన్ని అహింసామార్గంలో ఎదిరించి, భారతీయులకు విజయాన్ని, దేశానికి స్వేచ్ఛను అందించింది.

నేడు సమాజంలో మంచి భావనలున్న వ్యక్తులకు లోటు లేదు. ప్రజలు ఆస్తికులై పూజలు, ఉపాసనలు చేస్తున్నారు. దానాలు, పుణ్యకార్యాలు చేస్తున్నారు. వారిలో ధైర్యసాహస లక్షణాలు ఉన్నాయి. కాని అసంఘటితంగా ఉన్నారు. కోరినంతనే రాక్షసులు మనుష్యరూపంలో పుట్టుకువస్తున్నారు, దుష్ప్రవృత్తుల రూపములో సంచరిస్తూ వున్నారు. మంచి మనుష్యులు రానున్న కాలంలో కష్టాలపాలు కానున్నారు. దీనికంతటికి కారణం మనుష్యుల మధ్య సంఘటితశక్తి కొరవడుటయే. కావున నేటి ప్రజలు సంఘటితులై ఈ యుగం యొక్క రాక్షస ప్రవృత్తులను, అత్యాచారాలను దుర్గాశక్తి ప్రేరణతో పారద్రోలవచ్చును. ఇదే దుర్గావతరణ స్ఫూర్తి.

*హిందీమూలం: యుగనిర్మాణ చిత్రావళి మొదటి భాగము*

*అనువాదం: శ్రీమతి ఎ. శారద*

## భగవంతుని ముందు స్వార్థం పనికిరాదు

*సంపన్నుడైన ఒక పెద్దమనిషి సముద్రంపైన షికారు కోసం తన పడవ మీద బయలుదేరాడు. పడవ నడుపుతూ నడుపుతూ సముద్రంపై ఎంతదూరం వచ్చేశాడో అతడు గమనించుకొనలేదు. ఫలితంగా దారి తప్పాడు. తాను ఒంటరిగా ఉన్నానన్న విషయం తెలుసుకొని అతడు మరింతగా గాబరాపడి భగవంతుడిని ప్రార్థించటం మొదలుపెట్టాడు. ఎంత సమయం గడచినా అతడికి ఎవ్వరి సహాయము లభించకపోవటంతో భగవంతుడిని నిందించసాగాడు. "భగవంతుడా! నీవెంతటి కఠినహృదయుడివి. నేను ఇంత ఆపదలో ఉన్నప్పటికీ నాకు ఎలాంటి సహాయమూ నీవు అందించటం లేదు" అని ఆ పరమాత్మనే నిష్ఠూరాలాడసాగాడు.*

*కొద్దిసేపటిలోనే చీకటిపడింది. పడవ ముందుకు సాగుతూ సాగుతూ ఒక ఒడ్డుకు చేరుకుంది. అక్కడ గాలి విపరీతమైన వేగంతో వీస్తున్నది. అందుచేత పడవ చెక్కలు ఇరుసుకు రాసుకొని నిప్పు ప్రజ్వరిల్లింది. ఇక ఆ సంపన్నుడు జీవితంపైన ఆశ వదులుకున్నాడు. మనస్సులోని కోరికలన్నీ నశించినాయి. నిష్కామహృదయంతో "ఓ ప్రభూ! స్వార్థంతోటి, నా అహంకారాన్ని తృప్తిచెందించుకోవటానికి మాత్రమే నేను నిన్ను గుర్తుచేసుకున్నాను. నా కోరికలన్నీ నెరవేరుతున్నన్నాళ్ళు నేను నిన్ను పూజిస్తూ వచ్చాను. నా ప్రార్థన ఫలించని క్షణంలో, నేను నిన్ను దుర్భాషలాడాను. నేను తిరిగి ఇంటికి చేరుకొనటానికి ఉన్న ఒకే ఒక్క ఆసరా నా పడవ. ఇప్పుడు అది కూడా కాలిపోతున్నది. నా జీవితం సమాప్తం కాబోయే ముందు నా తప్పులను క్షమించమని వేడుకుంటున్నాను" – అని మనస్ఫూర్తిగా భగవంతుడిని ప్రార్థించాడు. అతడు తన ప్రార్థన ముగిస్తూ ఉండగానే అపరిచితమైన నావ ఒకటి అతని ముందు వచ్చి ఆగింది. అందులో నుండి ఒక వ్యక్తి దిగి "ఇక్కడ నిప్పు (అగ్ని) చెలరేగటం చూసి సహాయం చెయ్యాలనే ఉద్దేశ్యంతో వచ్చాను. మీరు చాలా అశాంతిలో ఉన్నట్లున్నారు" – అని పలుకుతూ సంపన్నుడిని సమీపించాడు. స్వార్థంతో చేసే కర్మకాండలను గాక, నిష్కామంగా చేసే ప్రార్థనను మాత్రమే భగవంతుడు ప్రేమిస్తాడని, స్వీకరిస్తాడని సంపన్నుడికి వెంటనే బోధపడింది.*

*– అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**జనన మరణాల వ్యవస్థీకరించే శక్తిని 'యమ' అనెదరు**

అశ్వమేధం - 5

# యజ్ఞము - మహాయజ్ఞము - అశ్వమేధయజ్ఞము

యజ్ఞాలను మూడు రకాలుగా విభజించవచ్చును. వ్యక్తిగత జీవితములో ఉన్నతి కొరకు యజ్ఞములు; సామాజిక జీవితములోని సమస్యల పరిష్కారం కొరకు మహాయజ్ఞములు; పూర్తి దేశ వాతావరణములోనే మూలభూతమైన పెను మార్పు తీసుకురావటానికి సార్వభౌమస్థాయిలో అశ్వమేధయజ్ఞములు జరుపబడుతూవుండేవి. బ్రహ్మపురాణలో కల్పారంభకాలంలో వెయ్యి సంవత్సరాల పాటు జరిగే మహాయజ్ఞ అనుష్ఠానము గురించి వర్ణన ఉన్నది.

దక్షుడు తన యజ్ఞము ధ్వంసమైన తరువాత, సతీదేవి మరణానంతరం శివుడిని క్షమాపణకోరి తన తప్పుకు ప్రాయశ్చిత్తముగా మహాయజ్ఞము చేశాడు.

వృషభదేవుడు సాక్షాత్ భగవంతుని యొక్క అవతారముగా గుర్తించబడ్డాడు. ఆయన పుత్రుడయిన భరతుని పేరు మీదే ఈ దేశము ఆవిర్భవించింది. భరతుడు మహాయజ్ఞాల ద్వారానే ఈ దేశాన్ని తపోభూమిగా మార్చాడు.

ఎక్కడెక్కడ మహాయజ్ఞములు జరిగాయో అక్కడ తీర్థములు స్థాపించబడ్డాయి. "ప్రయాగ" శబ్దములోని 'ప్ర' ఉపసర్గను తీసివేస్తే "యాగ" శబ్దము మిగిలిపోతుంది. యాగములు, యజ్ఞాలు ఎక్కువగా జరుగుటవల్లనే ఈ స్థానము తీర్థరాజముగా భాసిల్లుతున్నది. కాశీలోని దశాశ్వమేధఘాట్ అక్కడ పెద్ద యజ్ఞాలు జరిగాయనే దానికి సాక్షి.

భాగవతంలోని శౌనకాదిమునులు కలిసి నైమిశారణ్యంలో 10 వేల సంవత్సరాల వరకు నిరంతరము దీర్ఘ మహాయజ్ఞము చేసే సంకల్పము తీసుకున్నారు. ఈ మహాయజ్ఞాల పవిత్ర ప్రభావం వల్లనే నైమిశారణ్యానికి ఈ పేరు వచ్చింది.

అయోధ్యలో సూర్యవంశపు రాజైన వైవశ్వతమనువు నిరంతరమూ మహాయజ్ఞములు చేసి దానము చేయుట వలన ఆయన శాసన కాలములో అయోధ్యలో రోగము, వృద్ధావస్థ యొక్క కష్టము ఎవరికీ ఉండేది కాదు.

అశ్వమేధయజ్ఞముల ఫలశృతులు ఇంతకంటే విశదముగా ఉన్నాయి. మధ్యయుగములో భ్రాంతివశమున అశ్వమేధము పేరు ఎత్తినంతనే యుద్ధమని భయపడేవారు. కాని నిజానికి అవి లోకకల్యాణాన్ని దృష్టిలో పెట్టుకొని చేయబడిన విశిష్ట మహాయజ్ఞములు. ప్రాచీనకాలములో ప్రాకృతిక సంతులన, దైవానుగ్రహము మరియు దేశసమైక్యతల కొరకు అశ్వమేధాలు చేయబడేవి. అశ్వమేధయజ్ఞములో పాలుపంచుకొనుట వల్ల గయ, గంగ, యమునలలో తీర్థస్నానము చేసిన పుణ్యముతో పాటు కోటి యజ్ఞములు చేసిన పుణ్యఫలము లభిస్తుంది అని నమ్మేవారు.

మహీధరభాష్యములో అశ్వమేధయజ్ఞము వలన సంపూర్ణ విశ్వానికి సుఖము లభిస్తుందని ఇంద్రుడితో సహా సమస్త దేవతలు, ద్వాదశాదిత్యులు, 49 మరుద్గణములు ఔషధీ శక్తులకు మేలు చేసెదరని, పర్యావరణ సంతులన అమితముగా జరుగుతుందని ఉన్నది.

**"యజ్ఞే నాశ్వమేధే ఆయుః... కల్పతాం"**

– *మహీధరభాష్యము 22-23*

అనగా అశ్వమేధయజ్ఞము వల్ల ఆయుర్వృద్ధి జరుగుతుంది.

భాగవత మహాపురాణంలో వేన అనే రాజు తన రాజ్యములో యజ్ఞములు చేయటానికి వీలులేదని ప్రకటించాడు. ఋషులు ఎంత చెప్పినా వినకపోతే వారి శాపము వల్ల అతడు మరణించాడు. అతని భుజముల మంథనము వలన రాజా పృథు జన్మించాడు.

**"అథా దీక్షత రాజా తు హయమేధశతేన సహ ।**
**బ్రహ్మావర్త మనః క్షేత్రే యత్ర ప్రాచి సరస్వతి ॥"**

అనగా పృథుమహారాజు వంద అశ్వమేధయజ్ఞములు చేయ సంకల్పించాడు. పశ్చిమవాహిని సరస్వతి, బ్రహ్మ మనువులు ఉండే బ్రహ్మావర్తక్షేత్రములో ఈ అశ్వమేధములు చేయబడినవి.

మహాపండితుడు సాత్వలేకర్ తన పుస్తకములో ఇలా వ్రాశారు. "మనుష్య శరీరములో సత్ చింతనము అనే దేవతలు–

**దానమనగా లోకకళ్యాణం కొరకు, ఉన్నతాదర్శాల పూర్తి కొరకు సత్పాత్రులకిచ్చేడిది**

దుష్ప్రవృత్తులు అనే దానవ పశువులు ఉంటాయి. మనుష్య శరీరంలో ఇవి నిరాకారంగా ఉన్నప్పటికి, సాకారమయినప్పుడు ఇవి బయట కనిపించే జంతువులుగా రూపొందుతాయి. దీని అర్థము లోపల ఉన్న పశుభావాలే జీవిని సాకార పశుయోని లోనికి తీసుకువెళ్తాయి. డేగ అహంకార స్వరూపమయితే, గద్ద లోభానికి ప్రతినిధి. కాకాపట్టేవారు కుక్కలుగా, అజ్ఞానముతో ఉన్న జీవులు గుడ్లగూబలు లేక గాడిద యోనిలోనికి వెళ్తాయి. పశుప్రవృత్తులు అశ్వముల వలె శక్తివంతాలై సర్వవ్యాపకత్వము పొందినపుడు అశ్వమేధయజ్ఞాలు చేయబడతాయి. ఈ పశు-ప్రవృత్తులను బలి ఇవ్వటమే అశ్వమేధము.

అశ్వమేధయజ్ఞములు చేయుటకు ముందు చేసుకునే ఏర్పాట్లు, దానికి కావలసిన పవిత్రతను గురించి వివరించే ఆర్షగ్రంథాలు ఈ యజ్ఞములో ఏవిధమైన జీవహింస జరుగ కూడదని చెప్పాయి. అశ్వమేధము యొక్క గుఱ్ఱము నలువైపులా భ్రమణము కొరకు వదలినపుడు ఆరోజు నుంచి ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రము సవిత ఆరాధన కొరకు మూడు "ఇష్టులు" తీసుకువెళ్ళబడుతూ ఉండేవి. సవితను- ప్రాతఃకాలము సత్యప్రసవ పేరుతోనూ; మధ్యాహ్నం -ప్రసవిత అనే పేరుతోనూ; సాయంకాలము- అసవిత అనే పేరుతోనూ పూజించేవారు. అశ్వలాయనశ్రౌతసూత్రము, లాట్సాయనశ్రౌతసూత్రము, కాత్యాయనశ్రౌతసూత్రములలో ఈ వివరములు వర్ణింపబడినవి. ఒక ఏడాది పాటు గాయత్రీ ఉపాసన జరిగిన పిదప మూడు రోజుల అశ్వమేధయజ్ఞం జరిగేది.

**గన్ధర్వో అస్య రశనా మగృభ్ణాత్ ।**
**సూరాదశ్వం వసవో నిరతష్ట ॥**

– ఋగ్వేదము 1-163-2

వసువులు యజ్ఞీయ అశ్వమును సూర్యుడు నుంచి తయారు చేశారు. (అనగా అశ్వమేధయజ్ఞ సాఫల్యము కొరకు గాయత్రీ ఉపాసన అనివార్యము)

★★★

## అవసరాలకు మించిన వస్తు సంగ్రహణ అనర్థదాయకము

*బుద్ధభగవానుడు సన్యాసాశ్రమ ధర్మానుసారం శిష్యులతో దేశపర్యటనకై బయలుదేరాడు. ప్రయాణ బడలికను తీర్చుకొనుటకై ఒక ప్రదేశంలో విశ్రమిస్తూ తనతో వచ్చుచున్న భిక్షువుల చూచి ఆలోచనలో పడ్డారు. బుద్ధుని మజిలీ రాజప్రసాదంలో ఏర్పాటు చేయబడింది. ఆ రాజుగారు బుద్ధుని వెంట వచ్చిన భిక్షువులందరికి అనేక విధాలైన వస్త్రాలను బహుకరించగా, వానినన్నింటిని మూటకట్టుకొని భిక్షువులు మరల బయలుదేరారు. ఈరీతిగా వస్తువుల సంగ్రహించెడి మనఃప్రవృత్తితోనున్న భిక్షువుల చూచి బుద్ధభగవానుడు అత్యంత చింతాక్రాంతుడయ్యాడు.*

*అప్పుడు బుద్ధుడు భిక్షువుల నిట్లు ప్రశ్నించాడు.*

*బుద్ధుడు: వేసవికాలంలో ఒక్క మనిషికి కప్పుకొనుటకు ఎన్ని దుప్పట్లు కావాలి?*

*భిక్షువులు: వేసవిలో ఒక్కటి సరిపోతుంది ప్రభూ!*

*బుద్ధుడు: వర్షాకాలంలో అవసరాలు తీర్చుకొనుటకు మనిషికి ఎన్ని దుప్పట్లు సరిపోతాయి?*

*భిక్షువులు: వర్షాకాలంలో మనిషి అవసరాలకై రెండు దుప్పట్లు సరిపోతాయి*

*బుద్ధుడు: చలికాలంలో ఎన్ని కావల్సి ఉంటాయి?*

*భిక్షువులు: భగవాన్ మూడింటితో అవసరాలు తీర్చుకోవచ్చు అంతకు మించి అవసరం లేదు.*

*అప్పుడు బుద్ధభగవానుడు భిక్షువుల నుద్దేశించి "ఇన్ని వస్త్రాలు మాత్రమే మీవద్ద ఉంచుకోండి, ఇంతకు మించి మీరు మీ వద్ద ప్రోగుచేసికొన్నచో అవి మీకు కష్టకారణమవుతాయి. కావున ఇట్టి ప్రోగుచేసికొనెడి ప్రవృత్తి నుండి మిమ్ముల మీరు రక్షించుకొనుట మిగుల శ్రేయస్కరం" అన్నారు.*

*– అనువాదం: ఎ. శారద*

**అపాత్రులకిచ్చిన దానం యొక్క చెడు ఫలితాలు దానమిచ్చిన వారు కూడా అనుభవింపక తప్పదు**

### పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-37

# ఆశీస్సులు, వాగ్దానాలు

## పరిక్రమమార్గంలో

శ్రీరామ్‌ను నడిపించెడి శక్తి (ఆయన గురుదేవులు) నిబంధనలను సడలించి, జపాన్ని ఎంత ఎక్కువగా ఉదయం పూట చేయగలిగితే అంత చేయమని శ్రీరామ్‌ను ఆదేశించారు. అట్లే సాయంత్రాలు సంధ్యావందనం చేయమన్నారు. దీనితో స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొనుటకు శ్రీరామ్‌కు సమయం లభించింది. ఈ రీతిగా శ్రీరామ్ తన నిత్య జపాన్ని మరియు సంధ్యావందన కార్యక్రమాలను ఉదయం మరియు సాయంత్రపు వేళల్లో పూర్తిచేయసాగారు. ఎప్పుడైనా మిగిలిపోతే దానిని పగటి సమయంలో పూర్తిచేసేవాడు. అట్లే అనివార్య కారణాల వలన జపసంఖ్య ఆరోజు పూర్తి కానిచో మరుసటి రోజున దానిని పూర్తిచేయ సాగాడు. దీనికి తోడుగా శ్రీరామ్ మార్గదర్శి "ఏవైనా పొరపాట్లు జరిగితే వానిని తాను సరిచేసెదనని" శ్రీరామ్‌కు అభయమిచ్చాడు. బరోడానగరములో జరిగిన యజ్ఞ ఫలితములు వెనువెంటనే కనిపించసాగాయి. ప్రభుత్వానికి పన్నులను చెల్లించరాదనెడి ప్రజల నిర్ణయంలో ఎట్టి సడలింపు లేకుండా అమలుకాసాగింది. దీనికి బలాన్ని చేకూర్చుతూ శ్రీరామ్ ప్రజలకు ఇలా ఉద్బోధించారు. "సర్వసాధారణవేళలలో తీసికొనెడి నిర్ణయాలను ఒకవేళ మరచిపోవచ్చు కాని, ఇటువంటి లక్ష్య సాధన మార్గంలో తీసికొన్న నిర్ణయాలకు అందరూ తూ.చా. తప్పక కట్టుబడి ఉండాలి" అని నొక్కి వక్కాణించారు.



## "గోవర్ధన్" ను దర్శించమని అంతర్వాణి పిలుపు

యజ్ఞం పూర్తి అయిన రెండవరోజు అది. శ్రీరామ్ ఆగ్రాలో ఉన్నాడు. శ్రీరామ్ తన ప్రాతఃకాల జపాన్ని మరియు ధ్యానాన్ని పూర్తిచేసుకున్నాడు. ఆ సమయంలో ఆయనలోని అంతర్వాణి ఆయనను "గోవర్ధన్" ను దర్శించమనెడి ప్రేరణనందించింది. ఎవరో తనను అచ్చటి నుండి పిలుస్తున్నట్లుగా అనుభూతి చెందాడు. తన ప్రక్కనున్న సహచరుడైన మహావీర్‌సహాయ్"తో "నేను వెళ్ళుచున్నాను. కొన్ని రోజుల వరకు రాను. ఎప్పుడు తిరిగి వచ్చేది కచ్చితంగా చెప్పలేను. కనీసం 5 నుండి 7 రోజులు పడుతుంది. నేను వచ్చినపిమ్మట తదుపరి కార్యక్రమాన్ని రూపొందించుకుందాం అన్నాడు." మహావీర్‌సహాయ్ ఎక్కడికి వెళ్ళుచున్నావని శ్రీరామ్‌ను ప్రశ్నించలేదు. అడగాలని అనిపించినా అడగలేకపోయాడు. శ్రీరామ్ మోము బంగారు కాంతులీనుతున్నది. సాధనా సమయంలో కూడా శ్రీరామ్ మోములో ఇదే కాంతి కనిపిస్తుంది. దీనితో మహావీర్‌సహాయ్ మారుమాట్లాడలేదు. శ్రీరామ్ తన ప్రయాణ ఏర్పాట్లలో మునిగిపోయాడు. తన ప్రయాణానికి కావలసిన రెండు జతల బట్టలను, పూజాక్రమానికి సంబంధించిన కొన్ని వ్యాసాలను రెండు సంచులలో సర్దుకొని తన రెండు భుజాలకు తగిలించుకొని ప్రయాణానికి సిద్ధమైనాడు. శ్రీరామ్‌కు వీడ్కోలు పలుకుటకై మహావీర్ కొంత దూరము శ్రీరామ్‌ను అనుసరించగా, "ఇక నిలిచిపో, నేను ఒంటరిగా వెళతాను. నీ పనిలో నీవు నిమగ్నమవ్వు. ఒక్కవారం రోజులు మాత్రమే ఉంటాను. తిరిగి వచ్చిన తదుపరి నేను చాలా పని చెయ్యాలి" అన్నాడు శ్రీరామ్. శ్రీరామ్ కొంతసేపు మౌనము వహించగా, మహావీర్‌సహాయ్ ధైర్యం కూడదీసికొని "గోవర్ధన్" ను సందర్శించుటకు ఇంత తొందరగా నిర్ణయం ఎందుకు తీసుకున్నావు" అని శ్రీరామ్‌ను ప్రశ్నించాడు.

## ప్రత్యేక ఆకర్షణ

శ్రీరామ్ ఇలా బదులిచ్చాడు–"నీ ప్రశ్నకు నా వద్ద సమాధానం లేదు. ఎవరో నన్ను "గోవర్ధన్" వైపు లాగుచున్నట్లు నేను అనుభూతి చెందుచున్నాను. నేను తిరిగి వచ్చిన తరువాత నీ ప్రశ్నకు సమాధానం చెప్పగలను" అన్నాడు మహావీర్‌తో. ఇలా బదులిచ్చి, మహావీర్ వంక చూడకుండా శ్రీరామ్ తన గమ్యం వైపు నడచిపోయాడు.

గోవర్ధన్‌కు శ్రీరామ్ చేసెడి యాత్ర ఒక విలక్షణమైనది. శ్రీరామ్ అంతర్వాణి పిలుపు మేరకు ఎవ్వరో తనను

**దేవతల అనుగ్రహం ధనసంపత్తుల రూపంలోకాక ఉచ్చస్థరీయ భావనల రూపంలో ఉంటుంది**

పిలుస్తున్నట్లుగా శ్రీరామ్ వెళ్ళుచున్నాడు. మార్గమధ్యంలో మథురలోగాని, మథుర తోటలోని గాయత్రీమాత విగ్రహం వద్ద కాని ఆగి దర్శించలేదు. అందుబాటులోనున్న ప్రయాణ సాధనల ఉపయోగించుకొని గోవర్ధన్‌ను చేరుకున్నాడు. మార్గ మధ్యంలో కనీసం జలాన్ని కూడా త్రాగలేదు. అప్పటివరకు తాను గోవర్ధన్‌ను చూడకపోయినప్పటికి తనకంతా చిరపరిచితం అన్నట్లుగా గోచరించింది. గోవర్ధన్‌ను సమీపించుచున్న కొలది శ్రీరామ్ తన మనస్సులో ఎట్టి ఉత్సుకతకు లోనుకాలేదు. పైపెచ్చు అదంతా తాను ఇంతకు పూర్వమే చూచాననెడి భావనకు లోనయ్యాడు. గోవర్ధన్‌పర్వతము $7^{1}/_{2}$ మైళ్ళ విస్తీర్ణం కలిగి ఉంది. ఇది ఒక తీర్థస్థలంగా గుర్తింపు పొందింది. వ్రజ స్థలంలోని ప్రజల సంరక్షించుటకై కృష్ణభగవానుడు గోవర్ధనగిరిని ఎత్తి తన చిటికెనవ్రేలిపై నిలిపి, ఇంద్రుని కోపాగ్ని నుండి రక్షించినాడు అనెడిది పురాణగాథ. ప్రత్యేక పండుగ వేళలందు వేలకొలది ప్రజలు గోవర్ధనగిరి 21 కిలోమీటర్ల పరిక్రమాన్ని చుట్టి వస్తూ ఉంటారు. అట్లే మామూలు దినాలలో కూడా 5 నుండి 6 వందలమంది గిరిప్రదక్షిణ చేస్తూ ఉండుటను చూడవచ్చు.

గిరిపరిక్రమ మార్గానికి చేరుకోగానే ఒక దృశ్యం శ్రీరామ్ కంటపడింది. ఒక యువ సాధకుడు 'గయప్రసాద్' గుంజీలు తీస్తూ గిరిప్రదక్షిణ చేయుట చూచాడు. ఇతని ప్రదక్షిణ విలక్షణంగా ఉంది. అడుగడుగుకు గయప్రసాద్ 108 గుంజీలు తీస్తున్నాడు. అతనిని అనుసరించి 4-5 గురు నడుచుచున్నారు. గయప్రసాద్- రాసభావ్ ఉపాసకుడని అతని అనుచరులలో ఒకరు తెలిపారు. ఈరీతిగా చేస్తూ గయప్రసాద్ 21 దినాలలో గిరిప్రదక్షిణ పూర్తిచేస్తాడని తెలిపాడు.

## 'దండవత' తో గిరి పరిక్రమాన్ని సాధించుచున్న పండిట్

ప్రజలు గయప్రసాద్‌ను 'పండిట్‌జీ' అని కూడా పిలచుట పరిపాటి. కాలక్రమంలో ఆయన వ్రజలోని సుప్రసిద్ధ పండిట్‌జీగా గుర్తింపు పొందారు. పరిక్రమమార్గానికి సమీపంలో తన ఆశ్రమాన్ని నిర్మించుకున్నాడు. తన జీవితాన్నంతా అచ్చటనే గడిపాడు. గోవర్ధన్‌పర్వతాన్ని వీడి ఎన్నడూ పోలేదు. గ్రామ పొలిమేర్లను కూడా దాటి ఎరుగడు. గోవర్ధనానికి తన వెన్ను చూపి ఎరుగడు. శ్రీరామ్ అచ్చటికి చేరుకున్న రోజు గయప్రసాద్ తన పరిక్రమను చేస్తున్నాడు. అది చిట్టచివరి పరిక్రమగా మారింది. గోవిందకుండ్ వద్ద యజ్ఞము చెయ్యబడింది ఆరోజు. శ్రీరామ్ కూడా దీనిలో పాలుపంచుకున్నాడు. కాంతులీనుచున్న పండిట్‌జీ వ్యక్తిత్వం శ్రీరామ్‌ను ఉత్తేజపరిచింది. ఆయనను కలిసికొనుటకై శ్రీరామ్ వేచి ఉన్నాడు. బహుశ ఈ పండిట్‌జీనే తనను గోవర్ధనం వైపు లాగుకొనివచ్చినట్లు శ్రీరామ్ మనస్సులో తలంచసాగాడు.

యజ్ఞము పూర్తికాగానే పండిట్‌జీ శ్రీరామ్‌ను పేరుతో పిలిచాడు. తన అనుచరులతో శ్రీరామ్ మాట్లాడుచుండుటను పరిక్రమవేళ పండిట్‌జీ చూచాడు. శ్రీరామ్ మాటలు ఆయనను మంత్రముగ్ధునిగావించాయి. తన అనుచరుల ద్వారా శ్రీరామ్‌ను గురించి తెలిసికొన్నాడు. శ్రీరామ్ తన వద్దకు రాగానే, పండిట్‌జీ శ్రీరామ్‌ను వేదికపై తన సరసన కూర్చుండపెట్టుకొని కుశల ప్రశ్నల అనంతరము "మీరు మొదటిసారి గోవర్ధనాన్ని చూస్తున్నారనుకుంటాను" అన్నాడు.

శ్రీరామ్ జవాబిస్తూ "అవును! ఇప్పుడు కూడా నేను వచ్చే వాడినికాను. కాని నాలో నాకు తెలియని ఒక బలమైన కోర్కె నన్ను ఇచ్చటికి తీసికొని వచ్చింది. ఎవరో బలవంతం చేసి నన్ను ఇచ్చటికి తీసికొనివచ్చినట్లనిపిస్తున్నది" అన్నాడు శ్రీరామ్.

"ఎవ్వరు బలాత్కరింపగలరు? భగవంతుడే బహుశ నిన్ను బలవంతం చేసి ఉండవచ్చు. నీలోని సుసంస్కారమే బహుశ నిన్ను ఉత్తేజపరచి ఇచ్చటికి రప్పించి ఉండవచ్చు" అన్నారు పండిట్‌జీ. తదుపరి వారిరువురు గోవర్ధనపర్వతాన్ని గురించి కొంత తడవు ముచ్చటించుకున్నారు. "మీరు ఇంతదూరం వచ్చారు కాబట్టి గోవర్ధనపర్వత పరిక్రమాన్ని పూర్తిచేయుట ఉత్తమం" అని సెలవిచ్చారు. అదే సమయంలో శ్రీరామ్ మదిలో అనేకానేక ఆలోచనల వెల్లువ వచ్చుచున్నది. "నిజంగా కృష్ణ భగవానుడు తన చిటికెనవ్రేలిపై పర్వతాన్ని ఎత్తి నిలబెట్టాడా? ఇంద్రుని కోపానికి నిజంగా వరద వచ్చిందా? వ్రజలోని ప్రజలంతా ఈ పర్వత నీడలో రక్షణ పొందారా?

## కలలో భగవాన్ శ్రీకృష్ణుని పనులను దర్శించుట

రోజంతా ప్రయాణము చేయుటచే అలసిపోయిన శ్రీరామ్ విశ్రమించగనే నిద్రలోనికి జారుకున్నాడు. నిద్రలో శ్రీరామ్ మరో విభిన్నమైన ప్రపంచంలోనికి తీసికొనిపోబడ్డాడు. దీనిని

శాంతగుణం క్రూరత్వాన్ని, దురుసుతనాన్ని నివారిస్తుంది

అతిమానస చేతనత్వ ప్రపంచము లేక అంతర్జగత్తు లేక కలల ప్రపంచము అని పిలచెదరు. ఈ విభిన్న ప్రపంచ అనుభవాన్ని స్వప్నము అని పిలచుట సరియైనది కాదు. ఇది ఎక్కువగా భావసమాధిస్థితి. దీనిలో పూర్వపు సంఘటనలు ఒక్కొక్కటి నెమ్మదిగా దర్శించెడివానికి దృగ్గోచరమవుతూ ఉంటాయి. అది భగవాన్ శ్రీకృష్ణుడు ప్రజలలో (గోపాలుర) తన లీలలను క్రియాత్మకంగా చూపిన యుగము. బహుశ శ్రీరామ్ చేతనత్వము కూడా ఆ సమయమందు అచ్చట ఉండివుంటుంది. గడచిన ద్వాపరయుగ చరిత్ర పుటలలో లిఖించబడిన సంఘటనలు తెరపైన విచ్చుకోసాగాయి.

"బృందావనములో ఇంద్రోత్సవానికి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో జరుగుచున్నాయి. యజ్ఞానికి కృష్ణుడిని (యజ్‌మన్) ఆతిథ్యమిచ్చెడివానిగా చేయమని గార్గాచార్యులు నందునికి చెప్పాడు. ఈ సూచనను కృష్ణుని ఎదుట చేయమని నందుడు గార్గాచార్యునితో చెప్పాడు. గార్గాచార్యుని నోటి నుండి వచ్చిన మాటను విన్న కృష్ణుడు వెంటనే గార్గాచార్యుడు ఊహించని రీతిగా "మీరు ఆజ్ఞాపిస్తే వింటాను, కాని నాకు ఇంద్రోత్సవము జరుపుట ఇష్టము లేదు" అని జవాబిచ్చాడు. గార్గాచార్యుడు ఎంతో ఆశ్చర్యానికి లోనై "ప్రాచీనకాలంనుండి జరుపుకొనుచున్న ఈ ఉత్సవము పట్ల నీవు అయిష్టతను ప్రదర్శించుటకు కారణమేమి? పండుగల పట్ల నీకు వ్యతిరేకత ఎందుకు?" అని కృష్ణుడిని ప్రశ్నించగా శ్రీకృష్ణుడు ఈరీతిగా జవాబిచ్చాడు "యజ్ఞములో అనేక పదార్థాలను త్యాగభావనతో అగ్నిదేవునికి మనము సమర్పిస్తున్నాం. పెద్ద పరిమాణంలో నెయ్యి, పాలు, తేనె మరియు అన్నాన్ని ఆహుతులుగా ఇచ్చుటకు గల కారణమేమి? దీనికి కారణము మనకు ఇంద్రుడంటే భయం! ఆయనను పూజించనిచో ఆయన మనపై ఆగ్రహిస్తాడు. భయంతో మనం చేసెడిది పండుగ కానేరదని నా అంతరాత్మ చెప్పుచున్నది. దీనిని నేను భయంతో చేసెడి పని అంటాను. చేసెడి వేడుకలు మనకు ఆనందాన్ని ఇవ్వాలి. భయంతో చేసెడివి ఆనందాన్ని అందించవు. భయంతో నిండినవాడు పిరికివాడు."

మరి ఇప్పుడు ఏమి కోరుచున్నావు అని కృష్ణుని ప్రశ్నించాడు గార్గవాచార్య. ఇట్టి ప్రశ్న గార్గవాచార్యుని నుండి వచ్చునని ముందునుండే ఊహించుచున్న కృష్ణుడు తగిన జవాబుతో సిద్ధముగా ఉండి ఇలా అన్నాడు–'బృందావనంలోని నివాసితుల మధ్య ఉత్సాహాన్ని మరియు ప్రేమను జాగృతిపరచెడి పనికి నేను ప్రాధాన్యతనిస్తాను. మన గోపిక–గోపాలురను సత్కరించెడి వేడుకలు నిర్వహించుట చాలా మంచిది. మనకు పాలు, వెన్న, నెయ్యి నిచ్చెడి గోవులను సత్కరిద్దాం. మనకు నీడనిచ్చి, పూవులు, పండ్లు మరియు వంటచెరకు నిచ్చెడి వృక్షాలను పూజిద్దాం."

## ఇంద్రోత్సవానికి ప్రత్యామ్నాయము

కృష్ణుని మనోభావాలను అర్థము చేసికొన్న ఆచార్య గార్గీ చిఱునవ్వు నవ్వి, ఇంద్రుడిని పూజించనిచో ఇంద్రుని కోపానికి గురికావలసి ఉంటుంది అన్నారు. దీనికి జవాబిస్తూ "మనం ఇంద్రుడిని గురించి భయపడవలసిన పనిలేదు. మీరు అనుమతిస్తే గోపోత్సవాన్ని నిర్వహిస్తాము" అన్నాడు కృష్ణుడు. కృష్ణుని సూచనను బలపరుస్తూ సాందీపమహాముని ఇలా అన్నారు. "గోపోత్సవాన్ని నిర్వహిద్దాం. గోవర్ధనపర్వతాన్ని పూజిద్దాం! యజ్ఞాన్ని కూడా చేద్దాం కాని ఆహుతుల పరిమాణాన్ని తగ్గించాలి. ఇంద్రోత్సవ నిమిత్తమై ప్రోగుచేసిన నెయ్యి, పాలు మరియు బియ్యాలను బృందావనం బాలురకై భద్రపరుద్దాం. యజ్ఞములో ఆహుతులు గుర్తుగా ఇద్దాం!"

గోవర్ధనపూజ యనెడి కొంగ్రొత్త పూజా ఒరవడి ప్రారంభింపబడింది. బృందావనంలో కొందరు దీనిని వ్యతిరేకించగా, అత్యధికులు శ్రీకృష్ణుడిని బలపరిచారు. గోపోత్సవం ప్రారంభమైన రోజు అర్ధరాత్రి వేళకి కారుమేఘాలు ఆకాశాన్ని క్రమ్మివేయగా ఉఱుములు మెఱుపులతో పెద్ద వర్షం ప్రారంభమైంది. "కృష్ణుడు జన్మించిన రోజు కూడా ఇంతటి పెద్ద వర్షము కురియలేదు" అని నందబాబా తన అనుభవాన్ని తెలిపాడు.

– *అనువాదం:* ఎ. వేణుగోపాలరెడ్డి


**యుగశక్తి గాయత్రి**

**మాసపత్రిక చదవండి !**

**చదివించండి !!**


**శాంతంతో సమానమైన తపస్సు లేదు**

వ్యక్తి నిర్మాణం

# ఆత్మవిశ్వాసము యొక్క మహత్తరమైన శక్తి సామర్థ్యములు

మానసికంగా ఓడిపోయిన మనిషి మొత్తం ఓడిపోతాడు. ఎవరికి గెలుపుమీద విశ్వాసముంటుందో వారు తమలో ఎంత సామర్థ్యము ఉన్నదో అనే దానిని గురించి ఆలోచించే అవసరం కూడా రాదు. నిజానికి మనోబలమే మనిషికి ఉన్నతమైన వైభవం. దాని సహాయంతోనే ప్రజలు అసాధారణంగా మారిపోతారు. వారికి యోగ్యత తక్కువైనప్పటికీ సమర్థులైనవారిని కూడా ఎదిరించి నిలబడగలుగుతారు. ఆత్మవిశ్వాసము ఉన్న తాబేలు, చంచల స్వభావము కలిగిన కుందేలుల మధ్య పోటీ అందరికీ తెలిసిందే.

తనను తాను బలహీనునిగా తలచేవారి ఆత్మబలం సన్నగిల్లుతుంది. అతడు ఈరోజుకంటే రేపు ఇంకా బాగా ఉండాలనే ఆలోచన కూడా చేయలేడు. ఎవడు తనకు తాను సహాయము చేసుకోలేడో అతనికి సహాయం చేసేందుకు ఈశ్వరుడు కూడా ముందుకురాడు. భ్రూణము అవసరమైన శక్తిని సంపాదించుకోగానే బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుంది. సమస్యలనుండి బయటపడే విధానాన్నే "ప్రసవపీడ" అంటారు. ఆ తరువాతే బాలకుడు జన్మించడం జరుగుతుంది. బాలకుడు బలహీనంగా ఉంటే బయటకు వచ్చే అవకాశం ఉండదు. గ్రుడ్డు ఒడిలోపల పొదగబడితే బయటకు రావాలనే అవసరం తెలుస్తుంది. గ్రుడ్డు లోపల గందరగోళం చేసి పగలగొట్టుకొని పిల్ల బయటకు వస్తుంది. ఆత్మవిశ్వాసము మరియు పరాక్రమమునకు సంబంధించిన ఈ విద్య జన్మకు ముందే ఉంటుంది. ఈ ఆధారంతోనే జీవితమంతా గడపాలి. ఉన్నతి మార్గంలో ముందుకుపోయేందుకు ప్రతిక్షణం అప్రమత్తుడై ఉండాలి. ఇట్టి మానసికస్థితి స్వతంత్రంగా నిర్ణయించుకోవడం సాధ్యమే. తన స్థితికి అనుగుణంగా అవసరమైన పనులు చేసుకోగలిగే సాహసం, ముందడుగు వేసేందుకు కావలసిన మౌలికసామర్థ్యము లేనివాళ్ళు ఇతరుల ముఖం చూస్తూ కూర్చుంటారు. అవకాశము దానంతటదే ముందుకు వచ్చి తనని ఒడిలోకి తీసుకొని విజయాన్ని చేతికందించాలి అని ఎదురుచూస్తూ ఉంటారు. ఇటువంటి మానసికస్థితి ఉన్నవాళ్ళు గొప్పలు చాటుకుంటూ, పగటికలలు కంటూ ఉంటారు. ఇట్టివారికి వాస్తవములను అర్థం చేసుకునే అవకాశం ఉండదు. తీగలో విద్యుత్తు ఉంటేనే పంకా తిరుగుతుంది, బల్బు వెలుగుతుంది. ఆత్మవిశ్వాసము అనేది ఒకరకమైన విద్యుత్తు. దీనివల్ల నిద్రాణమై ఉన్న అనేక సామర్థ్యాలు, విశేషతలు మనిషిలో జాగృతమవడానికి అవకాశం ఉంటుంది. అప్పుడే ఒక వ్యక్తి కొన్ని మహత్త్వపూర్ణ కార్యములు చేయగలిగి తన క్రియాకలాపాల ద్వారా అనేకులను ప్రభావితము చేసి ప్రతిభావంతులను చేయగలిగే సామర్థ్యమును పొందుతాడు. మానవునిలో సగం సామర్థ్యం శరీరం మరియు తెలివితేటలపై ఆధారపడివుంటుంది, మిగిలిన సగము సామర్థ్యము ఆత్మవిశ్వాసముపై ఆధారపడి ఉంటుంది.

ఆత్మవిశ్వాసము ఆత్మగౌరవమును వికసింపచేస్తుంది. తదనురూపమైన పరిస్థితులను కూడా సృష్టించుకుంటుంది. భూమిలోని సారము, బీజములోని శక్తి కలిసి విత్తనమును మొలకెత్తింపజేస్తాయి. అందులోనే శక్తి దాగి ఉంటుంది. దాని సహాయంతోనే మొక్క వృక్షంగా మారుతుంది. ఈ వికాసక్రమం ఆత్మవిశ్వాసము కలిగిన వ్యక్తులలో బాగా కనిపిస్తుంది. వారు అటు సామాన్యులవలె సంపాదనకు, నిర్వహణకు కట్టుబడరు, ఇటు నీచమైన స్థితిలోను పడి ఉండరు. ఇది ఆత్మవిశ్వాసము యొక్క చమత్కారములతో కూడిన అపూర్వ సామర్థ్యము.

### ఆత్మవిశ్వాసం ఉన్నవారినే విజయం వరిస్తుంది

ఒక సామాన్య కుటుంబములో పుట్టిన బెంజమిన్ డిజరాయలీ ఇంగ్లండ్ పార్లమెంట్ సభ్యత్వం స్వీకరించాక తోటివారు అతనిని చాలా ఉపేక్షించేవారు, పట్టించుకునేవారు కాదు. అతను ఎప్పుడైనా మాట్లాడాలని ప్రయత్నించినా అతనిని మాట్లాడనిచ్చేవారు కాదు.

ఇటువంటి పరిస్థితులలో కూడా డిజరాయలీ తన లక్ష్యమును మర్చిపోయేవాడు కాదు. ఈ స్థితిలో కూడా అతడు తన నిష్ఠను వ్యక్తపరుస్తూ సభ్యులందరికీ ఇలా చెప్పేవాడు–"ఏదో ఒకరోజు మీరందరు నా మాటలు తప్పక వినవలసివస్తుంది." ఈ మాటలు చెప్పింది అతను కాదు, అతని ఆత్మవిశ్వాసం. అతని

**శాంతగుణమున్న మనిషి రుషితుల్యుడు**

అంతరంగశక్తిపై అతనికి అంతటి విశ్వాసం ఉండేది. అతనికి తనను తాను సరిగ్గానే అంచనా వేసుకోవడం బాగా తెలుసు. అందువల్లనే అతను తన ప్రయత్నం, పురుషార్థముల బలంతో ఒకనాటికి ఇంగ్లండు ప్రధాని పదవిని చేపట్టగలిగాడు. అతనని వెక్కిరించినవారే అతని కీర్తిని, గుణగణాలను పొగిడేటట్లు చేశాడు.

పరమాత్మ మానవశరీరధారిగా పుట్టించి ఆ మానవీయ చేతనత్వంలోనే అన్నిరకాల సామర్థ్య బీజాలను నింపి వాటిని చిగురింపచేసుకునే సామర్థ్యాన్ని కూడా ఇచ్చాడు. ఈ విషయం ప్రతిఒక్కరు నమ్మితీరాలి. కానీ మనలో చాలామంది తమలో దాగి ఉన్న సామర్థ్యాలను, బీజాలను వికసింపచేసుకొని మొలకెత్తింపచేసుకోగలిగే సామర్థ్యాలను పెంచుకోకపోగా అందుకు సంబంధించిన ఆలోచననైనా చేయలేని స్థితిలో ఉంటారు.

ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తి అదృష్టమును తన దాసిగా భావిస్తాడు. న్యూ హైంప్‌షయర్‌లో డానియల్ వెబ్‌స్టర్‌కు 15 డాలర్ల జీతంతో అతి కష్టంమ్మీద ఒక ఉద్యోగం దొరికింది. ఆ ఉద్యోగం ఇప్పించేందుకు అతని తండ్రి చాలా తిప్పలు పడవలసి వచ్చింది. తన కుమారునికి శుభాకాంక్షలు చెప్పిన తరువాత ఆయనకు ప్రశాంతత లభించింది. కానీ కుమారుడు ఆ శుభాకాంక్షలను ఉదాసీనంగానే అందుకున్నాడు. ఆ ఉద్యోగం తన లక్ష్యం కాదని, అందులో తాను కొంతకాలమే పనిచేస్తానని చెప్పాడు. తండ్రికి చాలా కోపం వచ్చింది. 'నిన్ను గవర్నర్‌ని ఎవరు చేస్తార్రా?' అని కేకలేశాడు. పేదింట్లో పుట్టినవాడివి, మనకు జీవించేందుకు లభించిన దానితో సంతృప్తిపడాలి అని నచ్చచెప్పాడు. అందుకు డానియల్ – 'నన్ను నేను పేదవానిగా అనుకోవడం లేదు. నాకు ఇంతకంటే మంచిపని చేయగలననే నమ్మకం ఉన్నది. నేను న్యాయస్థానంలో నా మాటలను, నా వాణిని వినిపించాలనుకుంటున్నాను. అది కుదరకపోతే పెన్నుతోనైనా సరే వినిపిస్తాను. నేను స్వతంత్రంగా పనిచేసే వ్యక్తిగా మారాలనుకుంటున్నాను ఇతరుల క్రింద పనిచేసే వ్యక్తిగా బ్రతకాలనుకోవడంలేదు' అని సమాధానం చెప్పాడు. ఆ ఆత్మవిశ్వాసంతోనే డానియల్ తన కలలను సాకారం చేసుకున్నాడు.

నెపోలియన్ తన విజయయాత్రలో ఆల్ప్స్‌పర్వతాలను దాటవలసి వచ్చింది. అప్పుడు అతని చుట్టూ ఉన్న వారందరు దానిని అంతవరకు ఎవరూ దాటలేదని, ఆ ప్రయత్నం ప్రాణాంతకమని హెచ్చరించారు. కానీ నెపోలియన్ ఇలా అన్నాడు – 'నాకు మృత్యుముఖంలోనికి వెళ్ళడం ఇష్టమే. కానీ ఆల్ప్స్‌పర్వతంతో ఓడిపోవడం ఇష్టంలేదు. ఈరోజు ఆ పర్వతమైనా ఉండదు లేదా నెపోలియనైనా ఉండడు'. ఈ నిశ్చయమునకు ముందు ఆల్ప్స్‌పర్వతం ఓడిపోయింది.

ఈ ప్రపంచంలో అయోగ్యమైన వస్తువు ఏదీ లేదు. అయోగ్యుడైన వ్యక్తీ లేడు. అతను దేనికి తాను యోగ్యుడను కాను అనుకుంటాడో అంతవరకే అయోగ్యుడు. తన సామర్థ్యాన్ని గుర్తించి పెంచుకొని ఆత్మబలమనే సంజీవని ద్వారా జీవితమును తయారుచేసుకుంటేనే పరమాత్మ యొక్క రాకుమారుని పదవిని చేపట్టగలుగుతాడు.

*– అఖండజ్యోతి, నవంబరు 1988*

*అనువాదం: శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

## స్కౌట్స్

*రాబర్ట్ బ్యాడెన్ పావెల్ అనే ఆయన విద్యార్థులలోని వినోద ప్రియత్వాన్ని, సాహసాన్ని సమన్వయపరచి, దానికి ఒక రూపకల్పన చేశాడు. దీని పేరు "బాయ్‌స్కౌట్స్." మొదట్లో దీనిని సమీప ప్రాంతాలలో ఆరంభం చేసి దీని యొక్క సత్పరిణామాలను గుర్తించి దూరదూరాలకు వ్యాపింపచేయసాగాడు. అనేక దేశాలలోని ఉపాధ్యాయులు దీనిని వ్యక్తిగత ప్రేమతో నడిపేవారు. క్రమంగా అనేక ప్రభుత్వాలు ఈ ప్రక్రియను పాఠ్యక్రమాలలో ఒక భాగంగా ప్రవేశపెట్టాయి. స్కౌట్స్ పేరుపెట్టుకొని స్వయంసేవకదళాలు ఇప్పుడు అనేక దేశాలలో దీనినే అమలుపరుస్తున్నాయి. కేవలం 70 సంవత్సరాల కాలంలోనే ఇది విశ్వ ఉద్యమంగా రూపుదిద్దుకొంది. దీని సిద్ధాంతాలు, క్రియాకలాపాలు సర్వత్రా ఉపయోగకరంగా భావించబడటం వల్ల ఇది ఈనాడు విశ్వమంతటా అమలుపరచబడుతోంది.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**శాంతియుతంగా సాగిన ఉద్యమము సుస్థిర విజయాన్ని సాధిస్తుంది**

# ప్రకృతితో ఆటలాడవద్దు

వైజ్ఞానికులు జ్యోతిష్యశాస్త్రమును 'సైన్స్ ఆఫ్ రేడియేషన్' అంటారు. జ్యోతిష్యశాస్త్ర ప్రభావము యావత్ బ్రహ్మాండము, అంతర్ బ్రహ్మాండము, చరాచరసృష్టి, మానవుని జీవితములోని ప్రతి ఒక్క అంశం పైనా ఉంటుంది. జీవకోశములోని పిండము మొదలుకొని గ్రహనక్షత్రములతో కూడిన బ్రహ్మాండము వరకూ వ్యాపించి ఉన్న ఈ విశాలవిశ్వములో జరిగే సహాయ సహకారములు, ఇచ్చిపుచ్చుకోవడములు మొదలైనవాటి గురించి అర్థము చేసుకొనటానికి జ్యోతిష్యశాస్త్రము ఎంతో సహాయపడుతుంది.

ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రజ్ఞుడు కార్ల్‌జుంగ్ తన అనుభవాలను గురించి చర్చిస్తూ 'విప్పటానికి సాధ్యము కానట్టి ఎన్నెన్నో చిక్కుముడులను ఎస్ట్రాలాజికల్ డేటా సహాయముతో తాను విప్పగలిగాననీ, ఆ చిక్కుముడులు ఇంక ఏవిధముగానూ పరిష్కరించటానికి సాధ్యముకాని పని' అని వ్రాశాడు.

సైబీరియాలోని తుగుస్కా ప్రాంతములో క్రీ.శ 1908 లో ఏదో ఒక పదార్థము భూమిని ఢీకొట్టడము వల్ల చుట్టుప్రక్కల 500 మైళ్ళ దూరము వరకూ భారీ వినాశనము సంభవించింది. సంఘటన జరిగిననాటినుండి ఇప్పటిదాకా కూడా ఎంతోమంది నిపుణులు బృందాలుగా ఏర్పడి అక్కడికి వెళ్ళి వస్తున్నారుకానీ, ఆ ప్రదేశములో ఉల్కాపాతము జరిగిన చిహ్నాలేవీ ఉన్నట్టు కనిపెట్టలేకపోయారు. సాధారణముగా ఉల్కాపాతము జరిగినప్పుడు కుప్పలకొద్దీ ఉల్కల అవశేషములు సంఘటనా స్థలములో లభిస్తుంటాయి. ఐతే తుగుస్కాలో మాత్రము సంఘటన జరిగిన ఇన్ని సంవత్సరముల తదుపరి కూడా 'రహస్యము' అలానే ఉన్నది. అన్వేషణకర్తలు ఎంతో శ్రద్ధతో ఆ రహస్యమును తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు.

ఈ సందర్భముగా ప్రతివొక్క పదార్థములోని ఏదో ఒక కణమునకు భూమి పొరను చీల్చుకొని లోపలికి వెళ్ళాలనే తపన ఉంటుందని ఊహిస్తున్నారు. ఈ విరాట్‌విశ్వము యొక్క గర్భములోపల యాంటీ-ఆటమ్, యాంటీ-మేటర్, యాంటీ-యూనివర్స్‌ల ఉనికి ఉన్నట్లు, అవి దూరముగా ఉన్నప్పటికి కూడా దగ్గరగా ఉన్నాయి అనే ఒక అభిప్రాయము ఏర్పడింది. ఈ రెంటి మధ్యా సంతులన ఉన్నంతవరకూ అంతా బాగానే ఉంటుంది. అలాకాక, ఆక్రమణ జరగటానికి ఒక చిన్న రంధ్రము చేయబడినా 'మహావినాశనము' కళ్ళెదుట నిలుస్తుంది. అప్పుడు యావత్ ప్రపంచమూ ఇప్పుడున్నవిధముగా ఉండదు. తుగుస్కా ప్రమాదమునకు సంబంధించి ప్రతి ఒక్క పదార్థంలోని ఏదో ఒక భాగము భూమితో ఢీకొనాలనే తపన ఉన్నట్లు చేయబడుతున్న ఊహగనుక నిజమే ఐతే, చాలా విపత్కర పరిస్థితుల నెదుర్కొనవలసివస్తుంది.

పృథ్వి యొక్క కవచము ఉల్కాపిండములనుండి మాత్రమే కాదు, ఇతర గ్రహాలనుండి కురిసే రేడియో కిరణముల బారి నుండి కూడా కాపాడుతుంటుంది. ఈ పృథ్వి యొక్క కవచంలో ఒక చిన్న రంధ్రం ఏర్పడ్డా ప్రమాదకరమైన తత్త్వము భూమి లోనికి ప్రవేశించి, ప్రస్తుతమున్న వాతావరణంలో భయంకరమైన మార్పులను తీసుకువస్తుందేమో' అన్న అనుమానము లేకపోలేదు.

ఉల్కాపాతములు, అంతర్గతమైన ప్రభావాలు భూమిపై చెడు ప్రభావములు చూపవచ్చు. సూర్యుని పైన మచ్చలు, అందులో ఎగసిపడే మంటలయొక్క అయస్కాంత ప్రభావము, సౌరమండలములోని గ్రహగోళముల మధ్య పదేపదే చెడిపోతున్న సంతులనము, ఇవన్నీ కలిసి భూమియొక్క రక్షాకవచమునకు ఎక్కడ హాని కలుగజేస్తాయో అన్న అనుమానముకూడా ఉన్నది.

ప్రస్తుతకాలములో ధ్రువప్రాంతములోని మంచు బాగా కరుగుతున్నది. అందుచేత ఆ ప్రాంతంలో గాలి విపరీతమైన చల్లగా ఉంటూ, ఆ గాలులు దక్షిణదిశగా వెళ్ళినపుడు అక్కడ ఉష్ణోగ్రతలు కూడా పడిపోవటానికి కారణభూతమౌతాయి.

ఇప్పుడు ఋతువులు-ప్రాకృతికచక్రము మీద సంపూర్ణంగా ఆధారపడి ఉండుట లేదు. మానవులు అందులో అసాధారణమైన రీతిలో అలజడిని సృష్టిస్తున్నారు. ఇంధనములను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. పెరిగిపోతున్న కాలుష్యము, వికిరణము వల్లకూడా ఎన్నో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఫలితముగా వాయుమండలములో కార్బన్-డై-ఆక్సైడ్ యొక్క పరిమాణము అసాధారణ రీతిలో పెరిగిపోతున్నది. ఈవిధముగా పెరుగుతున్న వేడిమి ధ్రువాల వద్ద మంచు కరిగే వేగము మరింతగా వృద్ధి చెందటము వల్ల గాలిలో చల్లదనము యొక్క అనుపాతము కూడా పెరిగిపోతున్నది.

**ప్రతిచిన్న పొరపాటు ఊహించని మంచికి దారితీస్తుంది**

ఈ కారణములన్నీ కలిసి మనకు చక్కని వసంతఋతువు లాంటి కాలము ఒక వృత్తము పూర్తయ్యిందనీ, అధికమైన చల్లదనముండే ఋతువుదిశగా అడుగులు కదుపుతున్నామనీ తెలియజేస్తున్నాయి. గడచిన 5 లక్షల సంవత్సరముల స్థితిని పరిశీలించిన నిపుణులు, ఇలాంటి సంతులితమైన చక్కని వాతావరణముతో కూడిన ఋతువు పదివేల సంవత్సరముల కాలము మాత్రమే ఉన్నదని చెప్తున్నారు. దీనికి ముందైతే విపరీతమైన మార్పులు చాలా తరచుగా సంభవించేవి. చక్కని పదివేల సంవత్సరముల కాలము పూర్తయిన పిదప, తిరిగి భూలోకము అసంతులనమైన పరిస్థితుల నెదుర్కొనవలసి వస్తుంది. ఆ పరిస్థితులు కొంచెము అటూఇటూగా హిమయుగంలాంటి భయావహమైన, కష్టకారకమైనవిగా ఉండే అవకాశము కూడా ఉండవచ్చు.

వర్తమానకాలములో భూమిపైన బృహస్పతి ప్రభావము కూడా అధికముగానే ఉన్నది. ఈ ప్రభావము యొక్క స్వరూప, ప్రభావాల గురించి 'జ్యూపిటర్ ఎఫెక్ట్' అనే పుస్తకములో వివరముగా వ్రాయబడియున్నది. రెండు సంవత్సరముల క్రితమే జరిగిన ఒక సంఘటన తరువాత డాక్టర్ జాన్‌రివిన్, డాక్టర్ స్టీఫెట్ ఇద్దరూ కలిసి 'జ్యూపిటర్ ఎఫెక్ట్ ప్రమాదకరమైన నీటియావిరి రూపములో కన్పట్టుతున్నది. శీతోష్ణముల సంతులనం దెబ్బతింటుంది, అధికజనసాంద్రత కలిగిన ప్రదేశములలో భూకంపములు రావచ్చు' అని వ్రాశారు. ఈ పుస్తకమును వివాదాస్పదముగా భావించి చాలామంది భయాందోళనలకు గురికావటముచేత, దానిపైన సమీక్ష జరిపారు. ఐతే పరిస్థితులన్నీ పుస్తకంలో వివరించినట్లుగానే నిరూపితమైనాయి.

బృహస్పతి పృథ్వి కన్నా 300 రెట్లు ఎక్కువ బరువుంటాడు. ఈ గ్రహము వ్యాసము పృథ్వి కంటే 11 రెట్లు, గురుత్వాకర్షణ శక్తి రెండున్నర రెట్లు అధికం. ఆంగ్ల సాహిత్యములో ఈయనను 'ఆకాశమునకు రాజు'గా వర్ణించారు. సౌరమండలములో ఆయన ఉనికి ప్రత్యేకత కలిగి ఉంటుంది. తోకచుక్కలని పట్టి లాగుకొనివచ్చి బంధించి తన ఆధీనములో ఉంచుకుంటాడు.

గురువు, శని ఒకే వరుసలోకి వచ్చినపుడు వారి మధ్య అయస్కాంత ఆదాన ప్రదానములు పెరుగుతాయి. బృహస్పతి సూర్యుని కక్ష్యలో ఉన్నప్పుడు ఆయన పైని ధూళికణములు ఎక్కువ సంఖ్యలో భూమిమీదకు ప్రవేశిస్తాయి. ఫలితముగా అలవాటు లేని ఆ ధూళికణములు తన లోపలికి వచ్చి చేరుతున్నప్పుడు భూమికి వికారం లాంటిది రావటమే కాక, మరికొన్నిరకములైన ప్రతికూల పరిస్థితులు ఏర్పడవచ్చును.

క్రీ.శ 1678 సెప్టెంబర్ 16 న రష్యా హైడ్రోజన్‌బాంబును భూమిలోపలే ఉంచి పరీక్షించినది. తదుపరి 36 గంటల లోపల ఇరాన్‌దేశములో ఎంత పెద్ద భూకంపము వచ్చిందంటే– అందులో 25,000 మంది వ్యక్తులు చనిపోగా, అపారధన నష్టము సంభవించినది. సారూప్యతను ప్రదర్శిస్తున్న ఈ రెండు సంఘటనలు చూస్తే ఆ రెండు ప్రదేశముల మధ్య మైళ్ళ దూరము ఎక్కువగా ఉన్నప్పటికీ, భూమి లోపలి పొరలలో ఏదో ఒక చిన్న కాలువ వంటిది ఉండి ఉండవచ్చు, అందువల్లనే ఒక ప్రదేశము తాలూకూ ప్రభావము రెండవ స్థానముపై పడ్డది.

ఈనాటి మానవుడు ప్రకృతిపైన చేస్తున్న అలజడి ఎంత ఎక్కువగా ఉన్నదంటే ఋతువులు మొదలుకొని వాతావరణము దాకా, అన్నింటిలోనూ ప్రమాదకరమైన భారీ విపత్తులేర్పడు తున్నాయి. ఇలాంటి సందర్భములలో ప్రకృతిలో ఏర్పడే ప్రమాదములను నివారించే ప్రయత్నాలను చెయ్యవలసిన అవసరమున్నది.

కాలుష్యముతోపాటు వాతావరణములోని ఉష్ణోగ్రతలు కూడా పెరిగిపోతున్నవి. ధ్రువప్రాంతముల్లో మేటవేసిన మంచు కరగటము వల్ల సముద్రపు ఉపరితలము మరింత ఎత్తుకు పెరగటముతో జలప్రళయము సంభవించే అవకాశము కూడా లేకపోలేదు. హిమయుగము తిరిగి ఆవృత్తమౌతుందనే భయం కూడా ఉన్నది.

పైన చెప్పినటువంటి అనేక కారణములు ఒకేసారి కలిసి ఏర్పడుతున్నాయి. వానిలో ఏ ఒక్క కారణమైనా ప్రభావ వంతముగా పనిచేస్తే, ప్రాచీనకాలపు భవిష్యత్ వక్తలు చెప్పినటువంటి కష్టకాలము మానవుని ఎదుట వచ్చి నిలబడితే అందులో ఆశ్చర్యము లేదు.

పరిస్థితుల తీవ్రతను చూస్తూ మనము 'ప్రకృతితో ఎక్కువగా ఆటలాడుకోవటము మానేస్తే మంచిది' అని గ్రహించడము చాలా అవసరము. భూమిని ఎక్కువగా త్రవ్వరాదు. ఆకాశము లోకి అసహ్యకరమైన పనికిరాని చెత్తను విసిరేయవద్దు. మీవంతు జాగ్రత్తలను మీరు చక్కగా పాటిస్తే, ఏదైనా కష్టమొచ్చినపుడు దానిని ఎదుర్కొనటానికి ప్రకృతినుండి మీకు తగిన సహాయము లభిస్తుంది.

– *అఖండజ్యోతి, మార్చి 1984*

శ్రీమతి లక్ష్మీరాజగోపాలు

**అన్నీ ప్రయత్నంతోనే జరుగుతూ ఉంటాయి**

# పంచతత్త్వాల పిలుపు వినండి

సృష్టి రచనలో కంటే పరమాత్మ మానవాళిని సృష్టించిన వేళ అత్యధిక ఆనందాన్ని పొందాడు. సృష్టికి రాజకుమారుడైన మనిషి తాను తయారుచేసిన ఈ ప్రపంచాన్ని సుందరంగా, పరిశుభ్రంగా, చక్కగా చేయగలడని ఈశ్వరుడు భావించాడు. ఏలనన మానవుడు వివేకంతో, ఆలోచనతో పనిచేస్తాడు. ప్రతి ఒక్కరు సాధనామార్గంలో పయనిస్తూ ఉంటారు. జరగవలసిన రీతిలో అది జరుగనిచో, వారు అపజయాన్ని పొందుతారు. ఎక్కడ లోపం జరిగింది అనెడి ప్రశ్న అప్పుడు ఉదయిస్తుంది. శాస్త్ర పురాణాలననుసరించి మనుష్యుడు 84 లక్షల యోనులలో జనన మరణాల అనంతరం మనుష్య జన్మ అతనికి ప్రాప్తించింది. దీనిని గుర్తెరిగిన తదనంతరము మాత్రమే అతడు పరమాత్మను గురించి తెలిసికొంటాడు. సాధకునిలా వ్యక్తి పరమాత్మను తెలిసికొనుటకై ప్రయత్నిస్తుంటాడు. ఏలనన, అర్థం తెలియనప్పటికి పూజ, పునస్కారాలను నిరంతరం, నియమానుసారం చేస్తూ, భావావేశానికి లోనై వంచితుడవుతూ ఉంటాడు. తనకు గల అధికారాన్ని గుర్తెఱగకున్నాడు. అతని మనస్సులో క్షణక్షణం భగవంతుడెవ్వరు? ఎచ్చట ఉంటాడు? ఎలా ఉంటాడు? అనెడి ప్రశ్నలు ఉదయిస్తూ ఉంటాయి. మానవ శరీరం పంచతత్త్వాలతో తయారుచేయబడింది. మరణానంతరం శరీరం పంచతత్త్వాలలో విలీనమైపోతుంది. ఆత్మ అనెడి పేరుగల చిలుక మానవ శరీరంలో ఉన్నంతవరకు మనిషి జీవించి ఉంటాడు, అట్లే చిలుక శరీరంలో నుండి వెలికి రాగానే శరీరం కళేబరంగా మారిపోతుంది. భూమి, వాయువు, ఆకాశం, అగ్ని మరియు జలం కలయికతో సృష్టించబడినది మానవ శరీరం. ఈ పంచతత్త్వాల గుణాల గురించి మానవుడు తప్పక తెలిసికొనవలసి ఉన్నది. వీని గుణాలను తనలో వికసింపజేసికొనుటకై ప్రయత్నించాలి. పూజాసాధనతో పాటుగా సాధకుడు ఈ పంచతత్త్వాల గుణాలను వికసింపజేసికొన్నచో అవి కాంతిపుంజ రూపములో అతనిలో వికసితమై, సాధకునికి అనుభవపూర్వకం అవుతాయి.

పృథ్వీతత్త్వంతో కూడి సాధనాపథంలో పయనించే వ్యక్తి ధైర్యాన్ని కలిగి, ఓర్మితో, దృఢమైన మనస్సును కలిగి ఉంటాడు. నేల పైన వృక్షాలు ఎల్లప్పుడు ఇతరుల కొరకై జీవిస్తు ఉంటాయి. వీని నుండి పరోపకార శిక్షణను, ప్రేరణను పొందుతాడు మనిషి.

శరీరంలో ఉండెడి వాయువు-ప్రాణవాయువు. వాయువు ఏ రీతిగా మనిషి జీవనానికి ఆధారమై ఉంటుందో; అదేవిధంగా సాధకుడు స్వయంగా తోటివారికి సమర్పణతో సేవా సహకారాలనందిస్తూ వారికి ఆధారంగా నిలవాలి. శరీరానికి వెలుపల ఉండెడి వాయువు అన్ని దిశలలో పరిభ్రమిస్తూ ఉంటున్నప్పటికి అది శక్తిహీనంగా ఉండదు. ఎవరి గుణ దోషాలను తనవిగా చేసికొనదు. ఇదే రీతిలో సాధకుడు కూడా వివిధ ధర్మాల నడుమ మరియు వివిధ స్వభావాలున్న వారి నడుమ తిరుగాడుతూ కూడా తన లక్ష్యం పట్ల నిరంతర చింతన కలిగి ఉండాలి.

ఆకాశం అనంతమైనది. చరించెడి మరియు చరించని, సూక్ష్మ మరియు స్థూలశరీరాలు, వానిలో ఉండెడి ఆత్మ విశాల ఆకాశం ఉన్నట్లుగానే స్థిరంగా ఉంటుంది. ఇది బ్రహ్మస్వరూపంతో కూడినదై ప్రాణులన్నింటిలో సాక్షిభూతంగా ఉంటుంది. హారాలలో ఏ రీతిగా దారం దాగి ఉంటుందో అట్లే జీవులలో ఆత్మ ఉంటుంది. ఆకాశాన్ని మేఘాలు కమ్మి వైచి వర్షిస్తున్నప్పటికి, ఉల్కాపాతం జరుగుచున్నప్పటికి, నక్షత్రాలు మెఱుస్తూ ఉన్నప్పటికి, గ్రహ నక్షత్రాలు తిరుగుతూ ఉన్నా ఆకాశం వీటిని పట్టించుకొనక తాను గంభీరంగా ఉంటుంది. ఇదే రీతిలో సాధకుడు కూడా భౌతికమైన, అభౌతికమైన వస్తువుల ప్రభావానికి లోనుకాక, స్థితప్రజ్ఞునిలా ఉండాలి.

జలము స్వభావరీత్యా స్వచ్ఛంగా, నిర్మలంగా, మధురంగా మరియు పవిత్రంగా ఉంటుంది. ఇదే రీతిగా సాధకుడు కూడా స్వభావ రీత్యా శుద్ధంగా, స్నిగ్ధ, మధురభాషణతో పరోపకారిగా మెలగాలి.

అగ్ని తేజస్సుతో ప్రకాశవంతంగా ఉంటుంది. ఎవ్వరు అగ్ని యొక్క తేజస్సును తమ తేజస్సుతో నిలువరింపజాలరు. కేవలం జలం మాత్రమే అగ్ని తేజస్సును నిలువరించగలదు. అగ్ని ఏ రీతిగా తన సంపర్కంలోనికి వచ్చిన వానిని దగ్ధం చేస్తుందో, సాధకుడు కూడా తన తేజస్సుతో మరియు తపస్సుతో తన వెలుపలనున్న మరియు అంతర్గతంగా ఉన్న అన్ని దోషాలను దహించివేయాలి.

పైనుదహరించిన పంచతత్త్వాల పిలుపును విని సాధకుడు తనలోని సహజ, స్వాభావిక సద్గుణాలను వికసింపజేసికోవాలి, పరమాత్మపై అచంచల విశ్వాసముంచి, ఉపాసన యొక్క మర్మాన్ని తెలిసికొంటూ సార్థకం చేసుకొంటూ తన జీవనయాత్రను కొనసాగించాలి. ఇట్లు జరిగిన వేళ నిశ్చయంగా సాధకుడు ఆ పరమాత్ముని యొక్క కృపను చవిచూస్తూ, అనుభవిస్తూ తన మనస్సులో ఆనంద తరంగాలను నింపుకొంటూ, సుఖదుఃఖాల పట్ల సమభావం కలిగి, సన్మార్గంలో పయనిస్తూ ఉంటాడు. ఇదే నిజమైన మానవజీవన లక్ష్యం-పంచతత్త్వాల గుణాల సమతుల్యతను తనలో సృష్టించుకొంటూ సాధకుడు తన జీవన యాత్రను మానవ జీవన లక్ష్యసాధన దిశగా నడిపించుకొంటూ పరమాత్మకై నిరంతరం కృషి చేస్తూ ఉండాలి.

*- హిందీమూలం: యుగనిర్మాణయోజన జనవరి 2014*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**పడితే లేవడం, పడి లేస్తే నేర్చుకోవడం అదే జీవితం**

సూర్యవిజ్ఞానం

# సూర్యచక్ర జాగరణ

ఉపనిషత్తులను దర్శించగల్గినవానిని ఋషి అనెదరు. భూః, భువః, స్వః అనగా భూలోకం, భువర్లోకం మరియు స్వర్గలోకము అనెడి ఈ మూడు లోకాలకు అధిష్ఠానదేవత మరియు శ్రేష్ఠ కళ్యాణకారియైన సూర్యభగవానుని (భర్గ) తేజస్సును మనము ధ్యానం చేస్తాం. మన బుద్ధిని సన్మార్గం వైపు ప్రేరేపించుగాక! సూర్యోపనిషత్ అనుసారం -

**నమో మిత్రాయ భానవే మృత్యోర్మాపాహి**
**భ్రాజిష్ణవే విశ్వహేతవే నమః ।**
**సూర్యాద్ భవంతి భూతాని సూర్యేణ పాలితా ని తు**
**సూర్యేలయం ప్రాప్నువన్తి యః సూర్యః సోఽహమేవ చ ॥**
**(సూర్యోపనిషత్ 6)**

**భావార్థం :** సూర్యుడు సంపూర్ణ విశ్వానికి ఆత్మయైయున్నాడు. మృత్యువు నుండి రక్షణ కోరుచూ ఆయనకు ప్రణామం చేస్తాం. సూర్యోపనిషత్ ప్రకారము సూర్యుని నుండి సమస్త ప్రాణికోటి ఉత్పన్నమై, పోషింపబడుతూ అంతిమంగా సూర్యునిలో లయమైపోతుంది. కావున నేనే ఆ సూర్యుణ్ణి !

ప్రశ్నోపనిషత్ ప్రకారము -

**యతు సర్వ ప్రకాశయతి తేన సర్వాను**
**ప్రాణాను రశ్మిమషు సంనిధత్తే ।** **(ప్రశ్నోపనిషత్ 1/6)**

**భావార్థం :** సూర్యుని కిరణాల ద్వారా సంపూర్ణ విశ్వంలో ప్రాణతత్త్వ సంచారము జరుగుచున్నది. ఎక్కడైతే ప్రాణ సంచారమున్నదో అచ్చట జీవము ఉన్నది. కావున గృహాల నిర్మాణము అధికాధికంగా సూర్యరశ్మి ప్రసరించి ఇంటిని పరిశుద్ధి గావించెడి విధంగా చేపట్టుట జరుగుచున్నది. రోగాలను ఉత్పత్తి చేసే క్రిమి కీటకాలను ఈ సూర్యరశ్మి నాశనం గావిస్తుంది. ప్రాతఃకాలములో సూర్యోదయ వేళ సూర్యకాంతిలో పరిపూర్ణంగా ప్రాణశక్తి ఉంటుంది. సూర్యోదయమైన పిదప ప్రాణశక్తితో నిండియున్న సూర్యకిరణాలు అన్ని దిశలలోను, ఉపదిశలలోను వ్యాప్తిజెంది తదుపరి అన్నింటా ప్రవేశించి తన అద్భుత ప్రాణశక్తితో నూతన జీవనీశక్తిని ప్రసాదిస్తాయి.

సూర్యయజ్ఞములో ఉత్పన్నమయ్యెడిది సూర్యుని ముఖము. ఉత్తమ సంకల్పం చేసెడివారు సూర్యదేవుడిని ప్రాప్తించుకుంటారు. (అథర్వణవేదము-13/1/13-14). సూర్యశక్తి ప్రేరణతోనే వాయు మరియు జలముల ప్రవాహం సాగుతూ ఉంటుంది. అన్నింటిని ధ్వంసం చేయగల సత్తా ఉన్నది. అన్నింటిని జీవంతో ఉంచుతాయి. ప్రాణశక్తితో పృథ్విని తృప్తిపరుస్తూ మరియు అపానశక్తితో సముద్రానికి పరిపూర్ణతను చేకూర్చుతుంది. దీనిలో అగ్ని మున్నగు సర్వ దేవతాశక్తులు ఒకే వరుసలో ఆశ్రయాన్ని పొందుతాయి. ఈ స్థితిలోనే సూర్యభగవానుడు గాయత్రి యొక్క అమృతమయ కేంద్రంగా భాసిల్లుచుండును. (అథర్వణవేదం 13/3/2-5)

సూర్యుడిని కాలస్వరూపంగా కూడా వర్ణించెదరు. ఆకాశంలో సూర్యుడు పయనించెడి మార్గాన్ని రవిపథమని పిలచెదరు. ఈ మార్గాన్ని 27 భాగాలుగా విభజించి వానికి నక్షత్రాల పేర్లు ఇచ్చారు. ఈ సువిశాల ఆకాశాన్ని సౌరజగత్తుగా పిలుస్తున్నారు. ఈ గమనంలో సూర్యునితోపాటు, సూర్యునికి దగ్గరగా నవగ్రహాలు పరిభ్రమిస్తూ ఉంటాయి. వీనిలో భూమి కూడా కూడియున్నది.

ఈ 27 నక్షత్రాలకు అధిష్ఠానదేవత రూపములో ఒక సూర్యుడున్నాడు. అట్లే 12 నెలలు మరియు 12 రాశులను లెక్క వేయుటలో సూర్యునికి 12 నామములు ఇవ్వబడ్డాయి. సంవత్సరములో సూర్యుడు రెండు ఆయనములలో పయనిస్తాడు. వానినే ఉత్తరాయణం మరియు దక్షిణాయనమని పిలచెదరు. సూర్యుడు ఉత్తరాయణంలో పయనించెడి సమయంలో పగటి కాలము ఎక్కువ మరియు తేజస్సులో వేడిమి ఎక్కువగా ఉంటుంది. దక్షిణాయనంలో సూర్యుడు పయనించు సమయంలో రాత్రి కాలము ఎక్కువగా ఉండి తేజోబలం తక్కువగా ఉంటుంది.

ప్రశ్నోపనిషత్‌లో సూర్యునితత్త్వాన్ని గురించి జ్ఞానులు ఇలా చెప్పారు.

**విశ్వరూపం హరిణం జాతవేదసం**
**పరాయణం జ్యోతిరేకం తపన్తమ్ ।**
**సహస్రరశ్మిః శతథా వర్తమానః**
**ప్రాణః ప్రజానాముదయత్యేష సూర్యః ॥**
**- (ప్రశ్నోపనిషత్ 1/8)**

**భావార్థం :** ప్రకాశమాన కిరణముల వేడి, వెలుగులతో కూడిన సూర్యుడు విశ్వంలోని సమస్తరూపాలకు కేంద్ర బిందువైనాడు. అన్ని రూపాలు (రంగులు మరియు ఆకృతులు) సూర్యుని నుండి ఉత్పత్తి జెంది ప్రకాశమానమగుచున్నవి. ఈ సవితయే అన్నింటి

**తప్పులు చేయకుండా ఎవరూ ఏది నేర్చుకోలేరు**

ఉత్పత్తి స్థానమైయున్నది మరియు అన్నింటికి జీవన జ్యోతి ఆధారం. ఇదే సర్వజ్ఞుడు, సర్వాధార, వైశ్వానర (అగ్ని) మరియు ప్రాణశక్తి రూపంలో సర్వత్రా వ్యాపించి, అందరిలో ధారణ జెందియున్నది. సమస్త విశ్వానికి ప్రాణస్వరూపుడు సూర్యుడు. ఇది ఒక అద్వితీయశక్తి.

దీనికి సమానమైన జీవనశక్తి ఈ విశ్వంలో ఇంకొకటి లేదు. ప్రాతఃకాలమందు సూర్యోదయానికి పూర్వం, సాయంకాలమందు సూర్యాస్తమయానికి పూర్వం ఏదైన పవిత్రమైన ఏకాంతస్థాన మందు, లేనిపక్షంలో తాను నిత్యం సాధన చేసెడి స్థలంలో కాని, నిటారుగా కూర్చుని 10-20 సార్లు దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీసుకోవాలి లేదా నాడీశోధనప్రాణాయామం మూడు నిమిషాల పాటు చేయాలి. దీనివల్ల ఆ వ్యక్తిలోని సుషుమ్నానాడిలో ప్రాణశక్తి సంచరించుట ప్రారంభిస్తుంది. మేరుదండాన్ని (వెన్నెముకను) నిటారుగా ఉంచుతూ "ప్రణవాన్ని (ఓంకారాన్ని లేక "సోఽహం" మంత్రాన్ని శ్వాసతోపాటు చేస్తూ ఐదు నిమిషాలు మౌనజపం చేయాలి. అటుపిమ్మట తమ నాభికేంద్రం వెనుక భాగంలో దండంలోని సూర్యచక్రంలో మెఱుస్తున్న పసుపువర్ణం లాగా కమలం రూపంలో మానసిక ధ్యానం చెయ్యాలి. ఎల్లప్పుడూ జాగృతంగా ఉండాలి. అంటూ మనలోని సూర్యచక్రాన్ని స్వయం సంకేతం (auto suggestion) ద్వారా మనలోని చేతనత్వాన్ని సూర్యచక్రంలో కేంద్రీకరించాలి. తదుపరి భావనలను మననం చేసుకుంటూ మనలోని శ్వాసను బహు నెమ్మదినెమ్మదిగా హృదయంలోనికి, ఊపిరితిత్తులలోనికి చేర్చుతూ శ్వాసతో పొట్టను నింపాలి!

ఓంకారం ద్వారా నేను ఆరోగ్యం, సుఖశాంతులు, ప్రాణశక్తి, స్ఫూర్తి, సఫలత మున్నగు సిద్ధుల యొక్క పరమాణువులను సమస్త ప్రకృతి భాండాగారము నుండి శక్తికొలది ఆకర్షించుకుంటున్నాను. సూర్యచక్రంలో వాటిని సంగ్రహిస్తున్నాను. తదుపరి నా ప్రాణశక్తి ఊర్ధ్వముఖమై శరీరంలోని అంగప్రత్యంగాలలో వ్యాప్తిజెందుచున్నది అనెడి భావనతోపాటు శ్వాసను అతి నెమ్మది నెమ్మదిగా వెలుపలికి విడుస్తూ ఇట్టి స్వయంసంకేతంతో సూర్యచక్రం నుండి ప్రాణముల స్పందన మేరుదండంలో ఊర్ధ్వముఖమై పయనించుచున్న భావన చేసుకోవాలి. ఒకటి-రెండు నిముషాలు విశ్రాంతి నొందిన పిదప పై ప్రక్రియను తిరిగి చేయండి. దీనినే 5-10 సార్లు చేయండి. శ్వాసను లోనికి తీసుకుంటూ తిరిగి బయటకు వదలుట అనెడి ప్రక్రియను దాని శబ్దం వెలుపలికి వినపడనంత నెమ్మదిగా చేయాలి. సుఖకరమైన విశ్రాంతితోపాటు ఈ ప్రక్రియను మరల మరల చేయాలి. ఒక మాసముపాటు ఈ సాధనను నియమ బద్ధంగా అభ్యాసము చేసినచో వ్యక్తి యొక్క శరీరము, మనస్సు మరియు మస్తిష్కములలో అద్భుతమైన పరివర్తన కలుగుతుంది. ఈ సాధనను భావనాత్మకంగా చేసిన వ్యక్తి మనస్సు, బుద్ధి వికసితమవుతాయి. కానీ దీనికై పూర్తి శ్రద్ధా విశ్వాసాలతో మనస్సును స్వసంకేత భావనలలో (auto suggestion) నింపు కొనుట తప్పనిసరి. దీనిద్వారా వ్యక్తిలో ఆత్మవిశ్వాసం, సకారాత్మక ఆలోచనలు, శారీరిక - మానసిక స్వస్థత, దృఢ సంకల్పం మొదలైన గుణములు వికసిస్తాయి.

మానవశరీరంలో ఆధ్యాత్మికశక్తిని జాగృతం చేయగలిగెడి 8 కేంద్రాలు ఉన్నాయి. యోగశాస్త్రంలో వీనిని చక్రములని అంటారు. యోగసాధనలో ఈ 8 చక్రాలపై ధ్యానం చేస్తూ వీనిని విడివిడిగా జాగృతం గావించుకొనే దాని మహత్త్వపూర్ణ వర్ణన ఉన్నది. ఈ చక్రముల పేర్లు 1) మూలాధారం 2) స్వాధిష్ఠానం 3) మణి పూరకం (సూర్యచక్రం) 4) అనాహతం 5) విశుద్ధం 6) ఆజ్ఞా 7) బిందుచక్రం 8) సహస్రారం. ఈ చక్రాలలో నాభికేంద్రము (సూర్యచక్రం) ప్రాణశక్తికి పుట్టుక స్థానమే కాక అచేతనమనస్సు యొక్క సంస్కార చేతనత్వం కేంద్రం కూడా అయి ఉన్నది. ఏలనన సాధారణ మనుష్యులలో ఈ మహత్త్వపూర్ణ కేంద్రము నిద్రావస్థలో ఉంటుంది. దీని శక్తి లేకపోతే ఎట్టి జ్ఞానం ఉండదు మరియు ఎటువంటి లాభాన్ని కూడా వారి జీవితాల నుండి పొందజాలరు. కాని ఒక అత్యంత సరళ ధ్యానసాధన ద్వారా సాధారణ మానవులు నాభిచక్రాన్ని జాగృతి గావించుకొని లాభాన్వితులు కాగలరు. దీనితో ఆత్మవిశ్వాసము, చక్కని ఆలోచనలు, శారీరక, మానసిక స్వస్థత, దృఢ సంకల్పం మున్నగు గుణాలు వికసితమవుతాయి.

కావున ఈ సూర్యసాధనా సంవత్సరములో సూర్యభగవానుని ధ్యానం ద్వారా సర్వదేవతల అనంత గుణాలను ధారణ చేసుకొనుటకు ప్రయత్నిద్దాం.

*- అఖండజ్యోతి, డిసెంబర్ 2012*

*అనువాదం: మురళీధర్*

## అశ్వమేధయజ్ఞం

*రాష్ట్రం వ అశ్వమేధః । పరావ ఏష సిచ్యతే ॥*

*- తైత్తిరీయబ్రాహ్మణము 3/8/9*

*అశ్వమేధమే రాష్ట్రము*

*సార్వభౌమ సామర్థ్యము కలవాడే అశ్వమేధము చేయవలెను. నిర్వీర్య వ్యక్తులు చేయరాదు.*

**మంచిని ఎంపిక చేసుకునే విషయంలో ఎంత స్వేచ్ఛ ఉందో తప్పులు చేయుటలో కూడా అంతే స్వేచ్ఛ ఉంది**

గురుపూర్ణిమ ప్రత్యేకం

# మనలోని అకుంఠిత శ్రద్ధా విశ్వాసాలు సద్గురువును మనవద్దకు రప్పిస్తాయి

సోదర సోదరీమణులారా! "గురువు" అనెడి పదానికి మన శాస్త్రాలు ఈ రీతిగా అర్థాన్ని తెలిపాయి. "గు" అనగా చీకటిని లేక అజ్ఞానాన్ని "రు" అనగా తొలగించెడిది.

ఇంతటి గొప్ప విశిష్టతతో కూడి ఉన్నది గురుపూర్ణిమ. గురువు-బ్రహ్మ, గురువు-విష్ణువు, గురువు-మహేశ్వరుడు, గురువు సాక్షాత్తుత-పరబ్రహ్మ. ఇంతటి మహిమతో కూడి ఉన్న గురువు కృపను పొందవలయునన్నచో ఆయన పట్ల అత్యంత శ్రద్ధ, విశ్వాసం మరియు సమర్పణలు అవసరము. ఈ మూడు లక్షణాలు ఎవ్వరిలో వికసితమై ఉంటాయో వారు సాక్షాత్తు దేవతలుగా మారుట తథ్యం. పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ జీవితము దీనికి నిలువెత్తు ఉదాహరణగా మన ముందు నిలుస్తుంది. అనుక్షణము మనకు కావలసిన ప్రేరణను అందిస్తూ మనలను మనీషులనుగా, మహా మనీషులనుగా చివరకు దేవతా స్వరూపులనుగా మార్చివేస్తుంది.




పై మూడు లక్షణాలను పుణికిపుచ్చుకున్న భక్త మీరా ఒక రాయిలో కృష్ణుడిని దర్శించింది. అట్లే రామకృష్ణపరమహంస మరో రాయిలో కాళిమాతను దర్శించాడు. అట్లే పరిపూర్ణంగా విశ్వసించిన వివేకానందునికి కాళికాదేవి భక్తిని, శక్తిని ప్రసాదించింది. ఏకలవ్యుని శ్రద్ధ, విశ్వాసాలు మట్టిబొమ్మలో గురువును గాంచినంతనే అతనిని సాటిలేని మేటి విలుకానిగా తీర్చిదిద్దాయి. (అర్జునుని కన్న మిన్నగా మార్చింది.) చివరకు స్థూలశరీరంలో నున్న ద్రోణుడు తన మట్టిబొమ్మ ముందు, ఏకలవ్యుని కోరిక మేరకు శిరస్సు వంచి నమస్కరించేలా చేసింది. ఇదే భక్తి శ్రద్ధలు చేసెడి చమత్కారాలు. ఇదే శ్రద్ధ ఇనుమడించిన వేళ మట్టిబొమ్మలో వినాయకుడు సాక్షాత్కరిస్తాడు. ఇదే శ్రద్ధ ఇనుమడించగా పూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య తన గురువు నుండి అమిత లాభాలను పొందారు, శ్రద్ధనే భగవంతునిగా చూచారు. భగవంతుడిని వ్యక్తిరూపంలో దర్శించుట దుర్లభం. భగవంతుడు ఒక సిద్ధాంతం యొక్క పేరు, ఆదర్శం యొక్క పేరు. వ్యక్తి శ్రద్ధయే - భవాని, వ్యక్తి విశ్వాసమే - శంకరుడు.

శ్రద్ధయే వ్యక్తికి ప్రాణం. శ్రద్ధయే ఆస్తికతకు ప్రాణం.. ఆధ్యాత్మికతకు, చమత్కారానికి, ఆత్మసాక్షాత్కారానికి ప్రాణం శ్రద్ధ. ఈ శ్రద్ధతోనే పూజ్య గురుదేవులు తన పరమ గురువర్యులను 15 వ యేటనే సాక్షాత్కరింపజేసికొన్నారు.

పూజ్యగురుదేవులు తన గురువైన శ్రీ సర్వేశ్వరానందుల వారిని ఇలా ప్రశ్నించారు. "గురుదేవ్! మీరు నా వద్దకు ఎందుకు వచ్చారు?" దీనికి సమాధానంగా ఆయన ఇలా జవాబిచ్చారు. "నేను ఒక వేటకుక్కలా చాలా రోజుల నుండి తిరుగుతూవున్నాను. నీ కొరకు అన్వేషిస్తూ ఉన్నాను. నువ్వు కనిపించగనే పట్టుకున్నాను. ఏవిధంగా వేటకుక్క వాసన చూసుకుంటూ ఆ ప్రదేశమంతా తిరిగి హంతకులను, దొంగలను పట్టుకొనుటలో రక్షకభటులకు సహకరిస్తుందో; అట్లే నీలోనున్న శ్రద్ధ, విశ్వాసాలు నిన్ను పట్టుకునేలా నన్ను ప్రేరేపించాయి". శ్రద్ధ, విశ్వాసాలు లేనివాని వద్దకు భగవంతుడు రానేరడు. శ్రద్ధ, విశ్వాసం లోపించిన కర్మకాండలు అన్నీ ప్రాణరహితమైనవి. నిష్ఫలంతో కూడినవి. శ్రద్ధ ఉన్నవానికి అన్నీ అందుబాటులో ఉంటాయి. ఇదే శ్రద్ధ

**తప్పును అంగీకరించుట గొప్ప సంస్కారం**

పూజ్యగురుదేవుల వద్దకు శ్రీసర్వేశ్వరానందులవారిని రప్పించింది. పరమపూజ్య గురుదేవులకు ఆయన గురువు చక్కని మార్గదర్శనం చేశారు. సాధనలు నేర్పారు. దీనితోపాటు 6 గంటలు నిత్యము గాయత్రీజపం చేయించారు. మజ్జిగ, జొన్నరొట్టెలు మాత్రమే తినుటకు అనుమతించారు. తనను తాను మలచుకొనుటకై శ్రీసర్వేశ్వరానందులవారు పూజ్య గురుదేవులకు ఇలా ఉద్బోధించారు. "ప్రజలంతా దేనికయితే సంతోషపడతారో దానినుండి నిన్ను నీవు మళ్ళించుకో. ఏలనన చాలామంది రుచులతోనే తమ జీవితాన్ని ప్రారంభిస్తారు. కామోద్రేకాలతో వారి జీవితాలను ముగిస్తారు. వీని నుండి నిన్ను నీవు మళ్ళించుకోవాలి. మంచి పనులపై నీ దృష్టిని నిలుపు. నీ అభిరుచుని నియంత్రించుకొనుటకై నీకు కర్మకాండ బోధించాను. ఈ రుచులే లోభం, మోహం, వాసన, తృష్ణ అవుతాయి. వీనిలో మునిగిపోయిన వ్యక్తి అల్పుడు. అతని శక్తి అంతరిస్తుంది. అందుకే నీచేత కర్మకాండ జరిపిస్తున్నాను. నిన్ను దేవతగా తయారుచేస్తాను. దీనికై సాధనలు చెయ్యాలి నీవు. వాల్మీకి మట్టి తిన్నాడు. నీవు జొన్న రొట్టెలు తినాలి. ఆధ్యాత్మికజీవనం వలన మనిషిలో ఉండే సంతోషం, ఆలోచనలు అన్నీ మనిషిని నడిపిస్తాయి. ఇతరుల మార్గాన్ని అనుసరించకు!"

ఎవరైతే తమలోనున్న చెడును తొలగించుకొనెదరో వారే నిజమైన ఆధ్యాత్మికవాదులు. వీరు నిరంతరం చెడుతో పోరు సల్పుతూ ఉండక తప్పదు.

మిత్రులారా! మన గురుదేవులు 15 సంవత్సరాల వయస్సు నుండి సుమారు 24 సంవత్సరాలు ఒంటరిగా నిలిచారు. బంధువులు విరోధులైనారు. తదుపరి స్త్రీలు గాయత్రీ చేయుట విషయమై సనాతనవాదులు విరోధులైనారు.

గురుదేవులు తన గురువుగారు చెప్పినదానినే ఆచరించారు. తన నాలుకను (జిహ్వను) నియంత్రించుటకై 24 సంవత్సరాలు జొన్నరొట్టె తిని గడిపారు. ఉప్పు, పంచదార మొదలుకొని అన్ని రుచులను వదలుకున్నారు. ఈ మార్గంలో పయనించుటచే దైవీశక్తులు ఆయనతో సహకరించుటకై ఆత్రపడ్డాయి.

గురువు ఒక శక్తి - ఒక సిద్ధాంతం - ఒక ఆదర్శం. గురుతత్వాన్ని అర్థం చేసికొనుటకై ప్రయత్నించాలి మనమంతా. సర్వేశ్వరానందుల మార్గదర్శనముతోనే పూజ్యగురుదేవుల సామర్థ్యం పలువిధాలా పెరిగింది.

పూజ్యగురుదేవులకు దీపం ఎన్నడూ అగ్నిలా కనిపించ లేదు. అది జ్యోతిలా కనిపించింది. ఇదే శ్రద్ధ - ఇదే ప్రకాశం వలె, జ్యోతివలె కనిపిస్తుంది.

మిత్రులారా! గురుపూర్ణిమ పర్వదినం శ్రద్ధకు ప్రతీక. పూజ్యగురుదేవులిట్లు చెప్పారు. "నా శరీరాన్ని విడచిన పిదప నేను ఏమిచ్చానో మీరందరూ గుర్తుకుతెచ్చుకుంటారు. ఒక వ్యక్తి వచ్చి అందరికి ప్రేమను, అభిమానాన్ని, ప్రేరణను పంచి ఇచ్చాడని తలుస్తారు. దీనికి ఋజువు మీ ప్రేమంతా మరల నా దగ్గరకు తిరిగి వస్తుంది! నా ప్రేమ వేల, లక్షలమంది వ్యక్తులపై ప్రసరించి తిరిగి నన్ను చేరుతుంది. ఇట్టి అవకాశం అందరికీ లభించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను."

పైనుండి క్రిందికి పడవేయుట ప్రకృతి లక్షణం. నేడు మనుష్యులు ఇలాగే క్రిందికి పడిపోతున్నారు. కాని గురుదేవులు ప్రతి వ్యక్తిని క్రింది నుండి పైకి తీసుకుని వెళ్ళారు. ఈ శక్తిని కేవలం గురువు మాత్రమే ఇవ్వగలడు. మనుష్యుల కష్టాలను గురువు దూరం చెయ్యగలడు. మనుష్యులు నేడు అలసిసొలసి ఓడిపోయి మూర్ఛితులై ఉన్నారు. వారికిప్పుడు ప్రేమ కావాలి. అభిమానం కావాలి.

మిత్రులారా! గురుదేవులు ఎల్లప్పుడూ ఇతరుల కొరకు తన జేబును ఖాళీ చేసుకునేవారు. తన వద్దనున్న ధనాన్ని, జ్ఞానాన్ని ఇతరులకు పంచారు. తన జీవితాన్నంతా తన గురుదేవులకు అప్పగించారు. అందువల్లనే ఆయన నిశ్చింతగా నిద్రపోయేవారు. గాఢంగా నిద్రించేవారు. ఆయన శక్తి, జేబు ఖాళీ కాగానే మరల నిండుతూ ఉంటాయి. ఈ రీతిగా ఆయన ఆపన్నులకు సహాయం చేస్తూ, దుఃఖితుల కన్నీరు తుడుస్తూ ఉండేవారు. ఎవ్వరైతే ఇవ్వటంలో సమర్థులో వారు దేవతలు కాగలుగుతారు. పూజ్యగురుదేవులు తాను భగవంతుడిని చూచానన్నారు.

యుగం మారుట భగవంతుని ద్వారానే జరుగుతుంది. ప్రజ్ఞావతారం కూడా ఇతనివలననే జరుగుతుంది. వ్యక్తి నెరవేర్చలేని పనులను భగవంతుడు తన భుజస్కంధాలపై వేసుకుంటాడు. భగవంతుని ద్వారా అందెడి అంతఃప్రేరణ

**సుఖదుఃఖాలు కేవలం మనస్సుకే పరిమితం**

ప్రకాశముతో నిండిన సువ్యవస్థ, ప్రేరణ మరియు ప్రకాశం వలన భగవంతుని పనులు జరుగుతాయి.

ఒక షరతుపై అందరికీ ఇట్టి గురువు లభిస్తాడు. అదే- శ్రద్ధ. శ్రద్ధపై విశ్వాసం ఉండాలి.

గురుపూర్ణిమ సందర్భముగా మనమందరము సదాసర్వదా గుర్తుంచుకొనవలసింది ఏమనగా "శ్రద్ధ ఉన్నంతవరకూ గురువు సహకారం మనకు ఉంటుంది. శ్రద్ధ మినహా మరి దేనివలన ఆధ్యాత్మిక ఉన్నతి లభించదు. గురువు పట్ల, ఆచార్యుని పట్ల, భగవంతుని పట్ల, ఆస్తికత పట్ల అఖండితమైన శ్రద్ధ ఉండుట తప్పనిసరి. ఒంటరిగా ఉన్నప్పటికి మనస్సులో మెండైన శ్రద్ధ విశ్వాసాలు ఉంటే మనిషి విజయం సాధించుట తథ్యం.'

పూజ్య గురుదేవులిట్లు సెలవిచ్చారు. "నేడు సాధువులు లేరు. వీరే ఉన్నచో శక్తిపీఠముల నిర్మించవలసిన అవసరం లేదు. వీరు గ్రామాలలో ఉన్న నిరక్షరాస్యతను నిర్మూలించుటలోను, సామాజిక దుర్నీతిని అంతమొందించుటలోను సాఫల్యం పొందుతారు. మీరు నన్నొక వ్యక్తిగా కాక శక్తిగా వ్యవహరించండి. ప్రతి పని సమయానుకూలంగా జరుగుతుంది. నా ఐదు శక్తులు పనిచేస్తున్నాయి. రాబోయే రోజులలో నా ఈ చమత్కారాన్ని చూస్తారు. నేను దేశంలో అందరినీ అక్షరాస్యుల చేస్తాను"

"నాయనలారా! పై సమస్యలకు పరిష్కారం కేవలం మనిషి మనస్సును మార్చడం వల్ల మాత్రమే సంభవిస్తుంది. ఒకరితో ఒకరు అనే ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించుటకు ఇదే సరియైన పద్ధతి. మీ శ్రద్ధను వికసింపజేసుకోండి. గురుతత్వాన్ని శ్రద్ధాతత్వమంటారు. దీని ద్వారా మీ జీవితం కూడా సిద్ధులను పొందుతుంది. వీని ద్వారా మీరు ఆత్మ గౌరవాన్ని ఆత్మశాంతిని పొందుతారు. సౌభాగ్యవంతులు అవుతారు.

*- సంకలనం:*

పూజ్యగురుదేవుల అమృతవాణి నుండి

---

## మనిషి మనస్సు- ఏనుగు గుణం ఒక్కటే, భగవంతుడిని మాటిమాటికి స్ఫురణకు తెచ్చుకోండి

*ఒక ఏనుగు ఉన్నది. దానిని నీటిలో కడిగి విడిచిపెట్టినచో అది తిరిగి ఏమి చేస్తుంది? అది మట్టిలో పొర్లాడుతుంది. తన శరీరానికి తిరిగి మట్టిని పులుముకుంటుంది. దానిపైన ఎవరైనా ఇట్టి స్థితిలో కూర్చుంటే వారికి కూడా మురికి అంటి తీరుతుంది. కాని స్నానానంతరం వెంటనే ఈ ఏనుగును ఒక కొయ్యకు గట్టిగా గొలుసుతో బంధించినచో తన శరీరానికి మట్టి పూసుకొనజాలదు.*

*మనుష్యుల మనస్సు కూడా ఏనుగు బుద్ధితో సమానమైనది. ఒక్కపరి మనస్సు ధ్యాన సాధన మరియు భగవంతునిలో సంలీనమై పరిశుద్ధము గావింపబడినచో, అట్టి మనస్సుకు తిరిగి స్వేచ్ఛనివ్వక భగవంతునిపైనే ధ్యాస ఉంచేలా దానిని పట్టి ఉంచాలి. ఈ విశ్వంలో పవిత్రతతోపాటు, అపవిత్రత కూడా వెన్నంటి ఉంది. మనస్సు యొక్క స్వభావము అపవిత్రతను వరించుట. తదుపరి మనిషి శరీరాన్ని కలుషితం గావించి తీరుతుంది. దీని నుండి తప్పించుకొనుటకై మనస్సును ఎల్లవేళలా అపవిత్రత నుండి రక్షించుటకై ఒకచోట బంధించుట తప్పనిసరి. మనస్సుకు అపవిత్రత అంటకుండా చూచుకోవాలి.*

*ఈశ్వరుని భజన, ఆయనను ధ్యానించుట ఒక బంధము వంటిది, దీనితో మనస్సును బంధించివేయాలి. అప్పుడు సమాజ సంపర్కము వలన అంటెడి దోషాలు, మలినాల నుండి దీనిని రక్షించవచ్చును. భగవంతుడిని మాటి-మాటికి స్ఫురణకు తెచ్చుకొనెడి మనస్సు అశాశ్వత సుఖాల పట్ల ఆకర్షింపబడక, పాపం నుండి రక్షింపబడుతుంది. తద్వారా మానవజీవన లక్ష్యసాధన దిశగా పయనిస్తుంది. అప్పుడు భయంతో అపవిత్ర పనుల జోలికిపోక, మనుష్యుడు పాపకర్మల నుండి రక్షింపబడతాడు.*

*అఖండజ్యోతి- మే 1971*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**త్యాగంలేని జీవితానికి శాంతి ఉండదు**

## గురుపౌర్ణమి ప్రత్యేకం

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం । భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ ॥

మానవ కళ్యాణానికి తద్వారా విశ్వకళ్యాణానికై కంకణధారియై, యుగపరివర్తనకై అవిరళకృషి చేయుచున్న

### వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట **పండిత శ్రీరామశర్మ ఆచార్య**
### మనకందించిన ఆశ్వాసన, సదా అనుసరణీయం



❀ నా మార్గంలో అడుగుపెట్టి చూడు -
అన్ని ఉన్నత మార్గాలు నీకై తెరచుకొంటాయి

❀ నా ప్రణాళికకై ఖర్చుచేసి చూడు -
కుబేరుని కోశాగారం నీకు అందుబాటులోనికి వస్తుంది

❀ నా పనిలోనున్న వేళ కటువైన మాటలు వినవలసి వస్తే -
అవి నీకు ఆశీస్సులుగా మారతాయి

❀ నా వాణిని ప్రజలకు వినిపించేవారు,
నారద తుంబురుల తలపించెదరు

❀ నా సాహిత్యాన్ని మథించేవారు -
జ్ఞాననవనీతాలుగా రూపుదాల్చుతారు

❀ నన్ను మీవానిగా భావించి చూడండి -
మిమ్ముల భవబంధాల నుండి విముక్తులగావించెద

❀ నా పనుల సాఫల్యతకై శ్రమించేవారిని
ఆనంద సాగరంలో తేలియాడించెద

❀ నా ప్రణాళికకై లేశమాత్రంగా కృషి చేసెడివారిని కూడా
కీర్తివంతులను గావించెద

❀ నా మార్గాన చరించెడివారిని
శాంతిదూతలుగా మలచెద

❀ తమను తాము సమాజ సేవకై అర్పించుకొన్నవారిని
ఆణిముత్యాలుగా మలుస్తాను

❀ నా కీర్తనల నాలపించెడివారిని,
గానగంధర్వుల గావించెద

❀ నాకు సమర్పణ గావించుకొన్న ప్రతివానికి
లోకమంతా అతనికి దగ్గరయ్యేలా చూస్తాను

ఆశ వేరు - ఆశయం వేరు



బోధ కథ

# గాయత్రి కురిపించిన కరుణ

"మీ అమ్మ ఇప్పుడు మంచం మీదనుండి లేవడం లేదు."

ఇంటినుంచి కబురు వస్తుందని అతడు ఎంతగానో ఎదురు చూశాడు. ఇప్పుడు వచ్చింది ఈ కబురు.

ఆమె చివరి కోరిక చనిపోయే ముందు బల్వంత్‌ను ఒకసారి చూడాలని. వైద్యులు ఆమె ఆరోగ్యం గురించి చెప్పిన అభిప్రాయం ఏమంత ఆశాజనకంగా లేదు.

ఇదీ ఆ కబురు తెచ్చిన వ్యక్తి ఇచ్చిన వివరం.

తల్లి ఇంకా బ్రతికే ఉన్నదా?

బల్వంత్ కళ్ళ నిండా నీళ్ళు.

బ్రతికే ఉండాలి. నేను అబద్ధం చెప్పను. నేను అక్కడినుండి బయలుదేరేటప్పుడు ఆమెకు జ్వరం తీవ్రంగా ఉంది. అసలే వృద్ధురాలు. ఒకటిన్నర నెలల క్రితం మంచం పట్టింది. నేను కిషన్‌గఢ్ వదిలి చాలాకాలం అయింది.

ఓ ప్రభూ! బల్వంత్‌సింగ్ చేతులు జోడించి ఏదో అదృశ్య శక్తికి తలవంచాడు. తన తల్లికి రెండు నెలలుగా జబ్బుగా ఉన్నది. తనకు ఆ కబురు ఇప్పుడే తెలిసింది. ఇందుకు దోషం ఎవరిది? తాను ఇక్కడ ఉన్నట్లు ఎవరికి తెలుసు? తాను బికనీర్ నుండి తిరునాళ్ళకు ఇక్కడికి వచ్చి ఉండకపోతే ఇప్పటికైనా తనకు ఆ కబురు తెలిసేది కాదు.

ఇళ్ళలో తగాదాలు రాకుండా ఉంటాయా? అన్నగారు ఏదో మందలిస్తే ఏం మునిగిపోయింది. ఆయన కోప్పడింది తన మీద ఉన్న వాత్సల్యం వల్లనే కదా.

నేడు బల్వంత్ సింగ్‌కు రెండున్నర సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు కళ్ళముందు మెదిలాయి. నలుగురు అన్నదమ్ములలో అతడు చివరివాడు. అందరు అతడిని గారాబం చేసేవారు. రాజపుత్ర సర్దారుల వంశం వారిది. ఎంతో పవిత్రమైన కుటుంబం. వారి తండ్రిగారి న్యాయం, సదాచారం, దీనజన సేవ గురించిన గాథలు కిషన్‌గఢ్‌లో ఇప్పటికీ ప్రజల నోళ్ళలో నానుతున్నాయి. ఆయన చనిపోయిన తర్వాత ఆ సద్గుణాల వారసత్వం ఆయన పెద్దకొడుకుకు సంక్రమించింది. గుణదోషాలు సాంగత్యం వల్ల కూడా అబ్బుతాయి. బల్వంత్ ప్రవర్తన విశృంఖలంగా తయారయింది. తమ్ముడు తాను రక్షించవలసిన ప్రజలను వేధిస్తూ ఉంటే, వారి కూతుళ్ళను, కోడళ్ళను ఏడిపిస్తూ ఉంటే ఆయన ఎలా సహించగలడు? "నీవు మన కుటుంబానికి మచ్చతెచ్చావు". అంటూ ఆయన కళ్ళెఱ్ఱ చేశారు. ఆవేశంతో ఊగిపోయారు. ఎవరో ఆయనకు సంగతి చెప్పి ఉంటారు. అది అబద్ధం కాదు కదా. ఆయనకు కోపం రావడం న్యాయమే.

"ఇది ఎవరి ఇల్లో నీవు మరచిపోయావా? తండ్రి పరువుకు మచ్చతెచ్చే పనిని చేయడానికి సిగ్గులేదా?"

అన్నగారు అలా కేకలు వేశారు.

అది పెద్ద విషయమేమీ కాదు. తండ్రి తర్వాత తండ్రి అంతటివాడు ఆయన. క్షమించమని అడిగితే సరిపోయేది. అలా అడగకపోయినా రెండు గంటల్లో ఆయన కోపం చప్పగా చల్లారిపోయి ఉండేది. ఆయన నెమ్మదిగా విషయం నచ్చజెప్పేవారు. కానీ బల్వంత్‌లోని రాజపుత్ర రక్తం బాగా ఉడికిపోయింది.

నేను రావడం వల్ల తండ్రిగారి పరువు పెరుగుతుందని నాకు అనిపించేవరకు నేనీ ఇంటిలో అడుగుపెట్టను అంటూ అతడు వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

కొద్దిసేపటిలో తిరిగి వస్తాడని లేదా తిరిగి తిరిగి తల్లి వద్దకు వెళతాడని అన్నగారు అనుకున్నారు. మధ్యాహ్నానికి అతడు రాకపోయేసరికి అంతా గాబరాపడ్డారు. ఐతే ఇంటిలోని ఒంటెలలోకెల్లా బలమైన ఒంటె కూడా వారికి కనిపించలేదు. సోదరులు, స్నేహితులు అతడి కోసం వెదకసాగారు. వారాలు, నెలలు గడిచిపోయాయి. తల్లి ఏడ్చి ఏడ్చి చూపు కూడా కోల్పోయింది. ఐనా బల్వంత్ ఆచూకీ తెలియనే లేదు.

బల్వంత్‌కు తన అన్నగారి మాట గుండె లోతుల్లోకి దిగిపోయింది. అది జరిగినప్పుడు మనిషి దేవత అవుతాడు. సర్దార్ బల్వంత్‌సింగ్ దేవుడే అని బికనీర్ ప్రజలు చెప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం బల్వంత్ ఒంటరిగా ఒంటెమీద బికనీర్ చేరాడు. అప్పుడు అతని వద్ద ఉన్నది రాజపుత్రునికి

**అనారోగ్యం, అశక్తతల ఆశయజీవికి అవరోధాలు కావు**

విడదీయరాని నేస్తం ఖడ్గం మాత్రమే. ఆనాడు రాజపుత్రులకు సైన్యంలో చేరడం సులభంగా ఉండేది. కేవలము రెండున్నర సంవత్సరాలలో బల్వంత్‌సింగ్ సర్దారు అయ్యాడు. అతడి తత్పరత, పరిశ్రమ, రాజభక్తి అందరి మన్ననలను అందుకున్నాయి. ఏమాత్రం విశ్రాంతి దొరికినా అతడు నగరంలో ఎవరు రోగంతో ఉన్నారో, ఎవరు దుఃఖంలో ఉన్నారో, ఎవరికి ఎలాంటి సేవ అవసరమో కనుక్కునేవాడు. వారికి అండదండలు అందించేవారు. ఇలాంటి సేవాపరాయణులు సైన్యంలో మరొకరు లేరు. ఈ గుణం ప్రజలను మరింత ఆకర్షించింది.

బికనీర్‌లోని గోస్వామి చౌక్-కాంక్రోలీ మహారాజు బల్వంత్‌కు గాయత్రీమాత పట్ల భక్తిని ప్రసాదంగా ఇచ్చాడు. బల్వంత్ గాయత్రీ సాధకుడు అయ్యాడు. గాయత్రీజపం చేయనిదే అతడు మంచినీళ్ళు కూడా ముట్టడు. నేడు కోలాయత్‌లో అతడి తల్లి కబురు అందింది. అతడు ఇక్కడికి రావడం కూడా ఆదిశక్తిగాయత్రి ప్రేరణయే కావచ్చు.

పై అధికారులకు తెలుపకుండా ఇంటికి వెళ్ళడం సముచితం కాదు. మరో విషయం ఉన్నది. ఈ రెండున్నర సంవత్సరాలలో అతడు సంపాదించినదంతా దీనజన సేవకే ఖర్చయింది. చేతిలో డబ్బు లేకుండా ఇంటికి వెళ్ళడం ఎలా? వీటిని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. బికనీర్ మహారాజు ఎంతో ఉదారుడు. అడగకుండానే అన్నీ ఇస్తాడు. ఇలా ఆలోచించి, బల్వంత్ తన ఒంటెను బికనీర్ వైపు నడిపించాడు.

సర్దార్ బల్వంత్‌సింగ్ కిషన్‌గఢ్‌కు చెందినవాడని ఎవరికీ తెలియదు. నేను దుఃఖంలో ఉన్న రాజపుత్రుడిని అని మాత్రమే అతడు మహారాజుకు చెప్పాడు. ఆరోజుల్లో రాజపుత్రుణ్ణి అని పరిచయం చేసుకుంటే చాలు విశ్వాసం కలిగేది. తన యువ సర్దారు జైసల్మేరు మీదుగా కిషన్‌గఢ్ వెళతాడని తెలిస్తే మహారాజు అతడిని ఒంటరిగా వెళ్ళనిచ్చేవాడు కాదు. జైసల్మేరు బందిపోటు దొంగల ప్రాంతం. ఆ ప్రాంతం మధ్య నుంచి ప్రయాణం చేయవలసి వస్తుంది. ఐతే అతడు దగ్గరలోనున్న మరో కిషన్‌గఢ్‌కు వెళుతున్నాడని అంతా అనుకున్నారు.

అసలు విషయము తెలిసినా ఏమి ప్రయోజనము? ఈ జ్యేష్ఠమాసపు మండుటెండల్లో ఎవరైనా అక్కడికి వెళ్ళవలసివస్తే కోలాయత్, మోహన్‌గఢ్, జైసల్మేర్‌ల మీదుగానే వెళతారు. కోలాయత్ నుండి కిషన్‌గఢ్‌కు సరాసరి దూరం 76 క్రోసులు మాత్రమే. 200-225 క్రోసులు చుట్టుతిరిగి వెళ్ళడం ఎందుకు? ప్రయాణం రెండు రోజులు పడుతుంది. తల్లి బ్రతికి ఉందో లేదో... మతిభ్రమించిన వాడే ఇలా ఆలోచిస్తాడు. 76 క్రోసులు. మధ్యలో ఒక్క గ్రామమైనా లేదు. ఒక్క పూరిల్లయినా లేదు.

ఆ మార్గంలో వెళ్ళడానికి బందిపోటుదొంగల కాళ్ళు సైతం వణుకుతాయి.

తల్లి మంచం పట్టింది. ఆమె బ్రతికి ఉందో లేదో. అతడికి మరో ఆలోచన రావడం లేదు. క్షణం ఒక యుగంగా గడిచే పరిస్థితిలో-రెండు రోజుల వ్యవధి చాలా ఎక్కువే. దారి లేని దారి అది. ఒంటె చాలా నెమ్మదిగా నడుస్తోంది. మాటిమాటికీ ఆగిపోతోంది ఒంటెను అదిలిస్తున్నాడు. ఒంటె అతడి ఆలోచనను గ్రహిస్తోంది. అది మృత్యుయాత్ర అని ఒంటె అనుకుంటోందేమో. చావవలసి వస్తే, అతడికి చావడమే ఇష్టమైతే - అలాగే చేద్దాం. అది వేగంగా పరుగుతీస్తోంది.

కోలాయత్ నుండి ముందుకుపోగానే సూర్యోదయం అయింది. పొద్దెక్కుతున్నకొద్దీ గాలి వేగంగా వీస్తోంది. ఒంటె ఒకసారి తల ఎత్తి ఏదో వాసన చూడడానికి ప్రయత్నించింది. నిలబడిపోయింది. వెనుదిరగడానికి తహతహలాడింది, నడవాలి. ఎడారిరాణి ముందుకు నడువు. వెనుదిరగవద్దు. నా శరీరాన్నయినా నీవు నా తల్లి వద్దకు తీసుకువెళితే నా జీవితం ధన్యమవుతుంది" అంటున్నాడు బల్వంత్, ఒంటె దాన్ని అర్థం చేసుకున్నట్లుంది. ముందుకు పోవాలంటే ముందుకే పోతుంది. సైన్యానికి చెందిన ఒంటె పిరికిపంద కాదు. ఐతే, ముందుకు వెళ్ళడమంటే అర్థం ఏమిటో అది తనవైపు నుంచి సూచించింది.

ఎడారిలో ఇసుకతుఫాను చెలరేగినప్పుడు మనిషి కూర్చుంటే అతడి మీద ఇసుకపర్వతం మేటవేస్తుంది. ఇసుక తుఫాను జ్యేష్ఠమాసంలో కాకపోతే మరి ఎప్పుడు వస్తుంది? పెద్ద పెద్ద ఇసుకదిబ్బలు లేస్తాయి. మైలు, రెండు మైళ్ళ వరకు పర్వతం లాంటి ఇసుకదిబ్బ ఏర్పడుతుంది. ఇదంతా క్షణంలో జరిగిపోతుంది. ఎండాకాలపు మధ్యాహ్న సమయాలలో ఇలా జరుగుతూనే ఉంటుంది. అలాంటి వేసవిలో గ్రామం లేని, నీడలేని, దారిలేని ఎడారిలో ముందుకుపోయే వ్యక్తిని ఏమనాలి?

కొద్దిసేపటిలోనే బల్వంత్ తన తలపాగాను మార్చుకోవలసి వచ్చింది. అతడు తలపాగాతో చెవులు రెండూ కప్పుకున్నాడు. పలుమారులు కళ్ళు రెండూ మూసుకోవలసివచ్చింది. ఒంటె ఒక్కసారిగా ఉలికిపడింది. తన వెనుకవైపు నుండి ఇసుక లేస్తూ

**అంగవైకల్యమున్ననూ ఆశయబలంతో విజయాన్ని పొందగలం**

ఉండడం చూసింది. నాలుగయిదు ఒంటెలు దానివెనుక వస్తున్నాయి.

వెనుక నుండి వస్తున్నవారిలో ఒకడు ఎంతో ప్రేమగా దగ్గరికి వచ్చి, మీరే ఊరు వెళుతున్నారు? అని అడిగాడు.

కిషన్‌గఢ్. మరి మీరు?

మేము అక్కడికే వెళ్ళాలి. మా మిత్రుడు జైసల్మేరు నుండి నిన్ననే అక్కడికి చేరి ఉండాలి. మేము అవసరమైన వస్తువులు కొనడానికి జైసల్మేరు వెళ్తున్నాం.

వెనుక వస్తున్నవారిలో మరొకడు విషయాన్ని వివరించాడు. వారి మిత్రబృందం ముందుగా కిషన్‌గఢ్ వెళ్ళింది. వారు వెనుకబడిపోయారు. ఇప్పుడు త్వరగా అక్కడికి చేరుకోవాలి. కనుకనే సరాసరి దారి పట్టుకున్నాడు. మీరు తోడు దొరికారు. సంతోషం.

మీ వద్ద నీళ్ళు లేవా?

అతడి వద్ద నీళ్ళు లేకపోవడం చూసి వారు ఆశ్చర్యపడ్డారు. అతడు ఎలాంటి మానసికస్థితిలో బయలుదేరాడో వారికేమి తెలుసు. అతడు జవాబిచ్చేలోగా వారన్నారు 'ఐనా ఏం కాదులే. దారిలో నీళ్ళు దొరుకుతాయి. దారిలో ఒక దేవస్థలం ఉంది. ఆ దారి మాకు బాగా తెలిసిందే.'

అప్పుడే తుఫాను వేగం పెరిగింది. ఇసుక వచ్చిపడుతూ ఉండడంతో కళ్ళు మూసుకోవలసివస్తోంది. ఒంటెలు తమ అంచనా ప్రకారం ముందుకు పోతున్నాయి. అకస్మాత్తుగా ఒక బల్లెం వచ్చి ఒంటె వెనుక భాగంలోకి దిగింది. మరో బల్లెం సర్రున వచ్చింది. ఐతే అది తల ప్రక్కగా దూసుకుపోయి క్రిందపడింది. బల్వంత్‌సింగ్ తన బల్లాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

మూర్ఖుడా! అని అతిచాడు ఒక బందిపోటుదొంగ. బల్వంత్ సింగ్ వెనుకగా వచ్చినవాళ్ళు నిజానికి బందిపోటుదొంగలు. తుఫానుగాలివల్ల వారి గురి తప్పింది. లేకపోతే ఎంత గొప్ప సైనికుడయినా ఆ దొంగలతో తలపడలేడు.

ఆగు!

బల్వంత్ క్రోధంతో ఒకడి వైపు ఒంటెను త్రిప్పాడు. బల్లెం వదిలాడు. కాని అది కూడా గురి తప్పింది. మనిషి రక్తం కారడానికి బదులు ఒంటెకు కట్టి ఉన్న తోలుసంచిలో నుంచి నీళ్ళు జలజల కారాయి. సంచి ఖాళీ అయిపోయింది.

ఆగు!

దొంగల నాయకుడు చేయి ఎత్తాడు. అతడి సహచరులు కూడా కలతచెందారు. ఆ నీళ్ళు ఎంతో విలువైనవి! ఈ సమయంలో మనిషి రక్తం కన్నా ఆ నీళ్ళు విలువైనవి.

ఇక చావు తప్పదు. నీవు చచ్చిపోతావు. మేము చచ్చిపోతాం. తగవులాడడం వల్ల ప్రయోజనం లేదు. ప్రాణం నిలిచే ఆశ లేనప్పుడు డబ్బుకు విలువేముంది. మనమంతా కలిసి ఉంటే నీకే లాభం అన్నాడు దొంగల నాయకుడు.

నాకు దొంగల దయాదాక్షిణ్యాలు అక్కరలేదు అంటూ బల్వంత్ బల్లెమును ఎత్తి ఉంచాడు.

మీకు అక్కరలేకపోయినా, మాకు కావాలి. మనమంతా కలిసి ఉంటే ఏదోవిధంగా నీటిని వెదకే ప్రయత్నం చేయవచ్చు. నీకు మామీద నమ్మకం లేకపోతే, మేము మా ఆయుధాలను విసరివేస్తాం అన్నాడు దొంగల నాయకుడు. దొంగలు తమ నడుముకు ఉన్న ఖడ్గాలను ఇసుకలో పారవేశారు.

దేవస్థలంలో నీళ్ళు లేవా? అని బల్వంత్ గట్టిగా అడిగాడు. దొంగలు ఇంతలో ఇంతగా జారిపోవడం మామూలు విషయం కాదు. నీళ్ళు దొరకకపోతే ఈ ఎడారి అందరికీ సమాధి కావడం ఖాయం.

ఒంటెలు మరి రెండు గంటలు నడవగలవని మీరు అనుకుంటున్నారా? దేవస్థలం ఎడారి మధ్యలో ఉన్నది. సాయంత్రానికి ముందు మనం అక్కడికి చేరుకోలేము. అక్కడ నీరు ఉన్నదో లేదో తెలియదు. వేసవిలో దేవి ప్రత్యక్షంగా అక్కడ నివసిస్తుందని మీరు వినలేదా? మనిషి అక్కడికి వెళ్ళలేడు. వెళితే తిరిగి రాడు – అన్నాడు దొంగల నాయకుడు.

ఏమి జరుగుతుందో ఆ గాయత్రీమాతకే తెలుసు.

బల్వంత్‌సింగ్‌కు ఆదిశక్తిగాయత్రి కృపపై, సామర్థ్యంపై పూర్తి నమ్మకం ఉంది. అతడికి ఒక్కక్షణం వృథాచేయడం భయంకరంగా కనిపిస్తోంది. కానీ, మహాభయం నోరుతెరచి నిలచి ఉంది. ఆకాశం ధూళితో నిండిపోయింది. పడమటి దిక్కును చిమ్మచీకటి కమ్ముతోంది. తుఫాను వస్తోంది. మరి తుఫాను అంటే అర్థం మరణం.

ఇసుక సలసల కాగిపోతోంది. భానుడు చండప్రచండంగా నిప్పులు చెరుగుతున్నాడు. నలువైపులా ఇసుక తెరలు తెరలుగా

**ఆశను వీడి ఆశయాన్ని తోడుగా చేసికొన్న వారికి ఆనందం తోడుగా నిలుస్తుంది**

వచ్చిపడుతోంది. శరీరం మలమల మాడిపోతోంది. నోరు ఎండిపోతోంది. ఇసుకతుఫాను వచ్చిపడుతోంది. మనిషి కూర్చుంటే ఇసుక అతడి మీద కొండవంటి సమాధి కడుతుంది. ఒంటెలు సైతం నిరాశగా రోదన చేస్తున్నాయి.

మనమంతా ఒకరినొకరు పట్టుకుని కూర్చుందాం - అన్నాడు దొంగల నాయకుడు. మరణంలో సైతం నేను మీతో కలవను. మహాశక్తి ఏది తలచుకుంటే అది జరుగుతుంది.

దొంగలు ఐదుగురు ఒకరిని ఒకరు పట్టుకుని కూర్చున్నారు. తమ ఒంటెలను తమ నలువైపులా నిలబెట్టారు.

బల్వంత్‌సింగ్ ఒంటరిగా నిలబడ్డాడు. ఆ విషమ పరిస్థితిలో మనిషి చేయగలిగేది ఏమీ లేదు. అతడు తన చిత్తవృత్తులను ఏకాగ్రం చేశాడు. అతడి చేతన సూర్యమండలం లోపల ఉన్న గాయత్రీమాత ధ్యానంలో లీనమయ్యింది.

**ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం**
**భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్**

అనే మహామంత్రం అతడి పెదవుల నుండి స్పష్టంగా వెలువడుతోంది. తుఫాను రానే వచ్చింది. ఆ తర్వాత ఏమి జరిగిందో బల్వంత్‌సింగ్‌కు తెలియదు. తుఫాను తనను ఎత్తి విసిరివేసిందని మాత్రం అతడికి గుర్తుంది. ఆతర్వాత స్పృహ తప్పిపోతోంది. అతని నోటి నుండి 'మాతా! రక్షించు' అనే మాటలు వెలువడ్డాయి.

గాయత్రీమాత ప్రకృతిని శాసించే శక్తి. స్వయంగా మూల ప్రకృతి. సమస్త సృష్టికి ఆదికారణం. ఆమె కనుసైగతో బ్రహ్మాండాలు జన్మిస్తాయి. ఆమె కృప కోసం హృదయం నుండి పిలుపు వెలువడితే, కృప అవతరించకుండా ఉండడం ఎలా జరుగుతుంది?

ఆ ఎడారిలో ఒక చిన్న మబ్బుతునక అవతరించింది. మధ్యాహ్నపు మండుటెండలో, భయంకరమైన ఇసుక తుఫాను మధ్య ఎక్కడ ఎప్పుడు మేఘం ఏర్పడుతుందో ఎవరూ చెప్పలేరు. రాజస్థాన్ ప్రజలకు ఆ సంగతి తెలుసు. అది వేసవికాలపు మధ్యాహ్న సమయాలలోనే ఏర్పడడం కద్దు. ఉతంకమహర్షి సమాధి నుండి మేలుకొన్న సమయంలో ఇంద్రుడు ఆయన దాహం తీర్చడానికై వర్షం కురిపిస్తాడని రాజస్థాన్ గాథ చెపుతోంది. నేటి ఈ వర్షం ఆ ఇంద్రుడు కురిపించిందో, మహాశక్తి గాయత్రి కృప కురిపించిందో ఎవరు చెప్పగలరు?

ఏది ఏమయినా పెద్ద పెద్ద చినుకులు పడుతున్నాయి. నేలా నింగీ నలువైపులా నిప్పులు చెరగుతోంది. ఆ అగ్నివర్షం మధ్య కొద్ది గజాల భూమిలో జోరుగా వర్షం కురుస్తోంది.

బల్వంత్‌సింగ్ కళ్ళు తెరుచుకున్నాయి. అతడు నేలమీద పడి ఉన్నాడు. అతడి బట్టలు తడిసిపోయి ఇసుకతో నిండిపోయాయి. అతడు తనను తాను సంబాళించుకున్నాడు. అతడి దృష్టి మొట్టమొదట తన ఒంటెమీద పడింది. అది వర్షంలో తడిసి అతడి ప్రక్కన నిలబడి ఉంది.

బల్వంత్ చేతులు జోడించి తలవంచి గాయత్రీమాతకు ప్రణామం చేశాడు. అతడిలో ఉత్సాహం, స్ఫూర్తి పెల్లుబికాయి. ఒంటె ఎక్కిన తర్వాత తాను ఏవైపు వెళుతున్నాడో అతడికి తెలియడం లేదు. దారి తెలుసుకునే ఉపాయమేదీ లేదు. అయినా సాయంకాలపు ఎఱ్ఱదనం ఆ ఎడారిపై బుక్కా చల్లడం ప్రారంభించేసరికి అతడి ఒంటె దేవస్థలంలోని కుండంలో నీళ్ళు త్రాగుతోంది. అతడు దేవి ఎదుట సాష్టాంగనమస్కారం చేస్తున్నాడు.

మరునాడు అతడు కిషన్‌గఢ్ చేరుకున్నాడు. వచ్చావా బాబూ - అంటూ తల్లి తిరిగివచ్చిన తన కుమారుని వెన్ను చేతితో నిమురుతోంది.

నేను వచ్చేశానమ్మా!

బల్వంత్ గొంతు పూడుకుపోయింది. సరాసరి ఎడారి దారిలో వచ్చాను.

ఎడారి దారిలోనా? వెనుక నిలబడ్డ అన్నగారి స్వరంలో ఆశ్చర్యం మిళితమయింది.

అవునన్నా!

బల్వంత్ ఆయన పాదాలకు ప్రణమిల్లాడు.

గాయత్రీమాత కృప అపారమైనది. 'ఆమె ఎడారిలో సైతం తన సంతానాన్ని రక్షించి తీరుతుంది' అన్నాడు.

ఆ మాటలు విన్న అక్కడి వారందరి మనస్సులు గాయత్రీ మాత పట్ల శ్రద్ధతో ఆర్ద్రం అయినాయి. గాయత్రీ ఉపాసనా మహిమ అందరికీ అవగతమయింది.

★★★

**ఒంటరిగా ఆటను గెలువవచ్చు - బృందంగా టోర్నీనే గెలవవచ్చు**

# వజ్రోత్సవ జయంతిపై యుగఋషి యొక్క మనోభావాలు

భగవంతునికి రెండు రూపాలు, రెండు కేంద్రాలు ఉన్నాయి. ఒక రూపంలోని భగవంతుడు మన వెన్నుతట్టి మార్గనిర్దేశనం చేస్తూ ఉంటాడు. రెండవ రూపంలోని భగవంతుడు మీ రూపంలో మాకు అండగా నిలచి, మాతో భుజం భుజం కలిపి మా అంగ అవయవాలుగా పని చేస్తుంటాడు. ఇద్దరు భగవానులలో ఒకరు నిరాకారుడు కాగా, రెండవవారు సాకారుడు. మీరు మమ్ములను సాకార భగవంతుని రూపంగా దర్శిస్తున్నారు. ఈరోజు మధ్యాహ్నం యాదృచ్ఛికంగా దర్శించిన దానిని మీకు వివరిస్తాం. మేము చాలా పనిని నిర్వర్తించాం. మేము చేసిన మొదటి పనిని ఈ సమయములో ప్రజలు గుర్తింపజాలరు. మేము చేసిన పనిని మొదటి నుండి లెక్క కట్టినచో-ఇంతటి చిన్న మిషన్ ఎటువంటి ప్రకటనలు లేకుండా, వార్తాపత్రికలలో ప్రకటనలు లేకుండా, ప్రచార ఆర్భాటాలు లేకుండా ఇంతటి గొప్ప కార్యాన్ని ఎలా చెయ్యగల్గింది అనెడి సంశయం మా స్థానంలో మరో సంస్థ ఉన్నా తప్పక కలిగి తీరుతుంది.

మేము భారతదేశములోనే కాక, భారతదేశం వెలుపల కూడా చాలా పని చేశాం. ఇంతటి బృహత్ కార్యక్రమాన్ని నిర్వహించుటలో అడుగడుగునా మీ సహాయ సహకారములు మాకు లభించాయి. దీనిలో మీకు కూడా భాగస్వామ్యమున్నది. మీరు లేనిచో మా ఒక్కడి వల్లనే ఇంతటి పని జరిగి ఉండేది కాదు. దేవతలు కూడా చేయజాలరు. అందువలననే మీరు మా సహయోగులు, మిత్రులు కాగలిగారు.

**వజ్రోత్సవ జయంతి :** మా యొక్క వజ్రోత్సవ జయంతి ప్రారంభమైంది. ఇది నా 75 వ సంవత్సరం. మాకు 75 సంవత్సరాల వయస్సా అనెడి సంశయం మీకు కలుగవచ్చు. మేము కోట్ల సంవత్సరాల నుండి ఉంటున్నాం. భగవంతుడు ఈ సృష్టి నిర్మాణం కావించాడు. అప్పుడు జీవాత్మరూపంలో జన్మ తీసికొన్నాం. కోట్ల సంవత్సరాల పూర్వం వచ్చాం మరియు కోట్ల సంవత్సరాలు జీవిస్తాం. మీరు మాకన్న ముందుగనే ముక్తిని పొందుతారు. మా విషయంలో అట్లు కాదు. ఈ ప్రపంచంలో సంసార బంధంలో చిక్కుకొని ఉన్న చిట్టచివరి ప్రాణి విముక్తి పొందే వరకు మేము మా కొరకు ముక్తిని కోరజాలం. ప్రపంచంలోని చిట్టచివరి ప్రాణి ముక్తిని పొందేంత వరకు మేము అనేక పర్యాయములు జన్మిస్తాము. అట్లే ప్రపంచంలో ముక్తిని పొందవలసిన ఆఖరి ప్రాణిగా మేము ఉంటాము, అటు తర్వాతే మా ముక్తి కొరకు ప్రయత్నిస్తాం. మేము భగవంతుని కొరకై ఇక్కడికి, అక్కడికి స్వర్గానికి పోయి ఆనందాన్ని అనుభవించుట మున్నగునవి మాకు కలలో కూడా స్ఫురణకు రానివి. మరి ఏ విషయాన్ని గురించి వజ్రోత్సవం జరుపుచున్నాం?

వజ్రోత్సవం అనేదానిని జరుపుకొనుట ఈ ప్రపంచంలో ఒక ఆనవాయితీ! ఈ ఆనవాయితి ప్రకారం మనిషి భౌతిక శరీర వయస్సును బట్టి 25 పూర్తికాగానే రజతోత్సవాన్ని, 50 పూర్తికాగానే స్వర్ణోత్సవాన్ని మరియు 75 పూర్తికాగానే వజ్రోత్సవాన్ని జరుపుకొనుట జరుగుచున్నది. మాకు-భగవంతునితో వివాహం 15 వ యేట, అటు పిమ్మట 60 వ యేట జరిగింది. మా 15 వ యేటనే మేము అనుష్ఠానం ప్రారంభించాం. ఈవిధంగానే నూరవ యేట శతాబ్ది వేడుకలు జరుగుతాయి. నూరు సంవత్సరాలు జీవించాలని మీకు కోరిక ఉన్నదా? లేదు, ఇప్పుడు లేదు. ఇప్పుడు మేము చెయ్యవలసిన పని చాలా ఉన్నది. దానికి మా ఈ స్థూలశరీరం ఆటంకముగా ఉన్నది. కావున మేము మా ఈ స్థూలశరీరాన్ని విడచి, స్థూల శరీరం చేయలేని పనులను సూక్ష్మశరీరం ద్వారా నెరవేర్చుతాం. ఇందువలన మేము ఎక్కువ రోజులు జీవించజాలం. ఇప్పుడు మేము, మా ఐదు శరీరాలతో పనిచేస్తూ ఐదు ప్రాంతాలలో పోరాటం చేస్తున్నాము. మీపై ఎట్టి భరోసా ఉంచామో, అది కొంచెం తక్కువైనట్లున్నది. మాది ఒకే ఒక్క కోరిక లేదా చింతన లేక బాధ ఏమనగా మీ నుండి కొంచెం ఎక్కువగా ఆశిస్తున్నాం. మీరు ప్రతిగా ఏమి కోరుచున్నారు?

**ఈ కోరికను పూర్తి చేయండి :** మా వజ్రోత్సవ వేళ దీనిలో మీ కృషి లేక మీ భాగస్వామ్యం లేనిచో అది మంచి పని కాదు, మీ భాగస్వామ్యం ఉండాలి మరియు అది ఉండి తీరాలి. ఎటువంటి భాగస్వామ్యం కోరుకొనుచున్నామంటారా? మాకు

**మద్యానికి బానిసైన జీవితం తప్పులు, అప్పులతో నిండి బానిస బ్రతుకుగా మారుతుంది**

ఒక కోరిక ఉన్నది. పూలమాలలను జీవితమంతా ధరించుతూ వచ్చాం. మాకు ఎన్నో పూలమాలలు మీరు ధరింపజేసి ఉంటారు. వాని బరువు సుమారు 100 మణుగులు కానీ అంతకు మించి కూడా ఉండవచ్చు. ఇప్పుడు పూలమాల ధరించవలెననెడి కోరిక ఏమాత్రం లేదు. కాని ఏమి ధరించాలని ఉన్నదంటారా? నాకు ఒక ఆభరణాన్ని ధరించాలని ఉంది. మా కుటుంబ పరివారం చాలా పెద్దది, దీనిలో 24 లక్షలమంది ఉన్నారు. వారిలో కొంతమేర ఉత్సాహవంతులు అప్పుడప్పుడు కొంతచేసి కూర్చుంటారు, కాని వారిలో కొందరు నిరంతరం మాతో భుజం భుజం కలిపి, అడుగులో అడుగు వేస్తూ పనిచేస్తూ ఉంటారు. ఇలాంటివారు మరింతమంది తయారుకావాలి.

ఈ స్థితిలో మాకు ఒక కోరిక ఉద్భవించింది. అదేమిటి అనగా 24 లక్షలమంది లేక 24 వేలమంది మంచివారు లేకపోవచ్చు. కాని 10 వేలమంది మా సహయోగులుగా తయారైనచో మేము సంపూర్ణ ఆనందంతో శ్వాస తీసికొంటాం. ఎలా అంటారా! వారు మా అడుగులో అడుగువేస్తూ నియమిత రూపంలో నడుస్తారు. నియమిత రూపానికి ఒక మహత్తు ఉన్నది. అనుష్ఠానమని దేన్ని పిలుస్తారు? నియమితరూపంతో ఉన్నదానిని పిలుస్తారు. ఇందువలననే ఈ సంవత్సరం మాకు ఈ కోరిక కలిగింది. మా వజ్రోత్సవవేడుక సందర్భంగా పదివేల వజ్రాలతో కూడిన హారాన్ని ధరించాలని ఉన్నది. వజ్రాలను మీరు చూచారా? వజ్రాలను చూచే ఉంటారు కాని ధరించి ఉండరు. ఈసారి ధరించాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. ఇట్టి వజ్రాలహార ధారణతో నా మనస్సులోని కోరిక తీరగలదని మీరు తెలుసుకోండి. మేము 24 లక్షలమంది సాధకులను తయారుచేశాం. ఔనండి తయారుచేశాం! 24 వందల శక్తి పీఠాలను నిర్మించాం. ఔను! నిర్మించాం. మరొక్క కోరిక మాత్రమే పూర్తికాక మిగిలిపోయి ఉన్నది. పదివేల వజ్రాల హారాన్ని ధరించుకొని మేము బజారులోనికి రావాలి. అప్పుడు ఆనందంతో కొందరు తమ భుజాలకెత్తుకొని ఆనందిస్తారు. మరికొందరు గులాం చల్లుతారు. మరికొందరు పూలు వెదజల్లుతారు. అప్పుడు మేము ఏమి ధరించి ఉన్నాం? పదివేల వజ్రాలతో కూడిన హారాన్ని ధరించి ఉన్నాం! అప్పుడు ప్రజలు అనుకుంటారు – సోదరా! ఆయన ఎంతటి ఐశ్వర్యవంతుడో! సేర్ అయి ఉంటాడు. ఇంతకు మించిన సేర్ ఉండడు. ఇతడు చాలా గొప్ప మహనీయుడు. అందువలననే పదివేల వజ్రాల హారాన్ని ధరింపగల్గాడు.

మీకు మా మాట అవగతమైనట్లు లేదు. కుమారులారా! మేము ఇంతకు పూర్వం కూడా ఇలాంటి సూక్తులను చెప్పి ఉన్నాం. కబీరుదాసు కాలంలో కూడా ఇట్టి సూక్తులు చెప్పినట్లు మాకు జ్ఞాపకమున్నది! ఇప్పుడు కూడా ఇదే గుర్తుకువస్తున్నది. నా భావనలో పదివేల వజ్రాలు అనగా పదివేల వజ్రాల వంటి అనుచరులు తయారవ్వాలి అని. వారంతా నియమిత రూపంలో వారి సమయాన్ని ఇవ్వాలి. అట్టి వారి సమయం మాకు అవసరమున్నది. డబ్బుతో పనిలేదు. డబ్బును మేము ఏమి చేసికుంటాం? డబ్బును ప్రోగుచేసికోవాలనెడి కాంక్ష మాలో ఉంటే, మేము ఎంతో కూడబెట్టి ఉండేవారం. కానీ అట్టి కోరిక మాకు లేదు. మా కోరిక కేవలం మా కాళ్ళు చేతులైన మీరు దృఢతరం కావాలన్నదే. కాళ్ళు చేతులు దృఢతరమైనచో మేము బలవంతులమయ్యేదము. అప్పుడు పని జరుగుతుంది. ఇదంతా మిమ్మల్ని మా మనస్సులో పెట్టుకొని చెపుతున్నాం. మీరు ఈ పదివేలమందిలో కలసిపోవాలి. ఈవిధంగా కలిసిమెలిసి మీరు ముందుకు నడుస్తూ శక్తిపీఠాలను తయారుచేస్తూ పోవాలి.

మీ మీ సమయాన్ని దీనికై కేటాయించండి. "కాదండి. మాకు బదులుగా నౌకర్లను ఏర్పాటు చేస్తామంటారా" నాకు నౌకర్లు కాదు కావలసింది, మీ సమయదానం కావాలి. మాకు గాంధీలాంటి వారు కావాలి. కాదండి. గాంధీకి బదులుగా ఒక నౌకర్ని పెడతాం అంటారా! అది కుదరదు. గాంధీగారి పనిని గాంధీ మాత్రమే చేయగలరు. నౌకరు వల్ల కాదు. వినోబాభావే పనిని వినోబా మాత్రమే చేయగలరు. జయప్రకాష్ నారాయణ పనిని జయప్రకాష్‌నారాయణే చేశాడు. లేదు, స్వామి! ఇద్దరు నౌకర్లను పెడతాం, వారు పనంతా చేసుకొంటూ పోతారు. అలా వీలు కాదు నాయనా! పని ఆవిధంగా కాదు! గురువుగారి పనిని నౌకర్ల సహాయంతో చేయవచ్చుననెడి తప్పుడు ప్రచారం ప్రజల మధ్యకు చేరింది. ఇది తప్పు! గురువుల పని నౌకర్ల వల్ల కాదు, అది మీరు మాత్రమే చేయగలరు.

మీరు రోజూ నాలుగు గంటల సమయాన్ని మాకు కేటాయించినచో ఆ వజ్రాల వంటివారి కోవకు చెందెదరు.

**కోపం మనల్ని నష్టపరిస్తే తెలివి ఎదుటివారిని నష్టపరుస్తుంది**

అట్టి మిమ్ములను నా హృదిలో దాచుకుంటాను. సమయాన్ని ఇవ్వండి. ఏ పని కొరకంటారా? ప్రజల జాగృతి పరచుటకై! ఈ కాలానికిది అత్యవసరం. మిమ్మల్ని కాలం పిలుస్తోంది. ఈ పిలుపు నా చెవులను గట్టిగా తాకి హోరెత్తించుచున్నది. ఒంటరిగా నేను ఎంత మేర చేసినా అది స్వల్పమే అవుతుంది. అందువలన మీ యొక్క సహకారం మాకెంతో అవసరం. కావున రోజూ మీరు నాలుగు గంటల సమయం మాకివ్వండి. ఇంతకంటే తక్కువ సమయం మాకు సరిపోదు. అట్లు ఇవ్వజాలనిచో మీరు కూడా ఆ 24 లక్షలమందితో చేరిపోండి. వారిలా వసంతపంచమికి వచ్చి యజ్ఞం చేసి వెళ్ళిపోతారు. ఇంకా కావలిస్తే గాయత్రిజయంతి వగైరా వగైరాలకు వచ్చి యజ్ఞయాగాది క్రతువులలో పాల్గొంటారు. కాని మీతో మరో విధమైన పని ఉన్నది. జనులు పనికి ముందే గురుదక్షిణ అడుగుచున్నారు. స్వామీ దయానందులవారు గురుదక్షిణను విరజానంద నుండి కోరారు. ఛత్రపతి శివాజీ తన సింహాసనాన్ని, రాజ్యాన్ని తన గురువుకు గురుదక్షిణగా సమర్పించాడు. విశ్వామిత్రుడు– హరిశ్చంద్రుడి నుండి అతని సామ్రాజ్యాన్ని అంతటిని గురుదక్షిణగా పొందాడు. మీ యావత్ సామ్రాజ్యాన్ని మాకు ఇవ్వనక్కర లేదు. కేవలం మాకు మీ సమయంలో నాలుగు గంటలు గురుదక్షిణగా ఇస్తే చాలు దానితో మా పని జరుగుతూ ఉంటుంది.

ఇప్పుడు మేము ఒంటరిగా శక్తిపీఠాలను దర్శించాలనుకుంటున్నాం. రవీంద్రుని గీతం "ఒంటరిగా పయనించు; ఒంటరిగా పయనించు" అనేది మాకు చాలా ఇష్టం. మేము కూడా ఒంటరిగానే పయనించాం. నేను ఎవరు చెప్పినా వినలేదు. నా ఆత్మ మరియు పరమాత్మల వాణినే విన్నాను. మీరు కూడా ఇలా చేసినచో, మీ కొంత సమయాన్ని నియమిత రూపంలో కేటాయించి, నడయాడెడి శక్తిపీఠాలుగా మిమ్ముల మీరు తీర్చిదిద్దుకొనగలరు. ఇట్టి శక్తిపీఠాలు మాకు పదివేల వరకు కావాలి. '24 లక్షల మందిలో పదివేలమంది దొరకకపోరా?' అని నిజంగా మా మనస్సులో ఉన్నది. దొరుకుతారని భావిస్తున్నాను.

నా ఆలోచనల ప్రకారం పదివేలమంది సత్యవాక్పాలకులు, పలుకే బంగారమైనవారలు, కర్తవ్యపరాయణులు, లోక కళ్యాణానికై తమను తాము సమర్పించుకొనెడివారు కనీసం పదివేలమంది ప్రోగుపడాలి. మాకు ఒకే ఒక్క కోరిక మిగిలి ఉన్నది. అది వజ్రోత్సవజయంతి జరుపుకొనుట. ఈ వేడుక ద్వారా మిమ్ముల మేము ఆ పరలోకములో కూడా గుర్తుపెట్టుకొనగలగాలి.

మీరు స్వయంగా పనిచేయుట ప్రారంభించండి. కార్యకర్తల వంక చూడక, మమ్ముల చూస్తూ మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి. ఇప్పుడు నేను ఒంటరిని, మీరు ఒంటరివారే! ఇరువురు పిచ్చివాళ్ళు కలిసి కూర్చుంటే ఆనందం ఎక్కడ నుండి వస్తుంది, సుఖం ఎక్కడి నుండి వస్తుంది.

ఈ పనిచేయుటకు షరతులేమి లేవు. మీరు ఒంటరిగానే పనిచేస్తూ ఉండండి. మీరు నిలవకుండా ఒంటరిగానే పనిచేస్తూ పోండి, అప్పుడు మీరు వజ్రంలా రూపొందుతారు. అప్పుడు మిమ్ముల మా వజ్రాలహారంలో గుదిగ్రుచ్చి మా గుండెలపై నిడుకొని విహరిస్తాం. మీరు ధైర్యంగా ముందుకు సాగండి. మిమ్ముల మరచిపోం! మిమ్ముల తీర్చిదిద్దుతాం, పరిరక్షిస్తాం! రాత్రికి ఎవరైనా వచ్చి దొంగిలించుకొనిపోతే? నేను అన్ని జాగ్రత్తలు తీసికొని భద్రపరుస్తాను. మీలాంటి వజ్రాలు మావద్ద చాలా ఉన్నాయి. వజ్రపుటుంగరం కూడా ఉంటుంది. దీనిని ఆయా వ్యక్తులు భద్రపరచుకొనెదరు. అట్లే స్త్రీలు తమ వజ్రపు ముక్కుపుడకలను భద్రపరచుకొంటారు. అదేవిధంగా మీ దృష్టిలో ఎదురుగా వజ్రంలా నిలిచిన మిమ్ముల మరచి పోతామా? మిమ్ముల సంరక్షించకుండా ఉండగలమా? మీకు ఏదో కొంత ఇవ్వకుండా ఉంటామా? మీకై మేము ఎంతో కొంత చేస్తాం.

**మీ పాత్రతను పెంచుకోండి - అధికంగా పొందండి :** మా వద్ద మరికొంత విలువైన వస్తువులున్నాయి. వీనిని చాలా రోజులు అన్వేషించి పొందాను. అట్లే మా ఏకాంత సాధన ద్వారా కూడా పొందాను కొన్నింటిని. మొదటి నుండి కొన్నింటిని పొందుతూ వచ్చాం. కొన్నింటిని సాధకులకు ఇచ్చాం కూడా! ఏమిచ్చారని అడుగుచున్నారా? కొందరికి పిల్లలనిచ్చి, కొందరికి కోర్టు కేసులు గెలిపించాం. కొందరికి దగ్గు తగ్గించాం. దీనివలన ఏం జరిగింది? ఎవరికి ఏమి జరిగింది? రెండు సంవత్సరాలు ముందుగనే చనిపోతే ఏమిటి? ఉద్యోగంలో పదోన్నతి పొందారు. అట్లే జీతం నూరురూపాయిలు పెరిగితే ఏమిటి? నూరురూపాయిలు తక్కువ లభిస్తే బ్రతకలేరా?

**అందరిని ప్రేమించు - అందరికి సేవలందించు, నిరంతరం సహాయం చేస్తూ ఉండు - ఎవ్వరిని బాధించకు**

పేదవారు బ్రతుకుట లేదా? ఇదంతా హాస్యాస్పదంగానే ఉంది. మీకు ఇచ్చింది, మానుండి ఇప్పటివరకు మీరు పుచ్చుకొన్నది ఇదంతా ఒక వేడుక లేక హాస్యాస్పదంగా సాగింది. పిల్లలకు బెలూన్లు, మిఠాయిలు, చాక్‌లెట్లు ఇచ్చి వాళ్ళను మైమరపిస్తాం. అదేరీతిలో మీకు బహుమతుల నందించి మైమరపించాం.

చిన్న చిన్న బహుమతులనిచ్చి, నిమ్మరసాన్నిచ్చి మిమ్ముల సంతుష్టుల గావించాను. కాని ఇంకా మా వద్ద మరికొన్ని ఉన్నాయి. సరిపడా కూడా ఉన్నాయి. స్వామి రామకృష్ణ పరమహంస చనిపోయే ముందు తన పాదాన్ని వివేకానందుని శిరముపై నుంచి ఇలా పలికారు "నావద్ద ఏ శక్తి ఐతే ఉన్నదో దానిని నీకు ధారపోశాను.' మాకు కూడా అలాగే ఇవ్వాలని ఉన్నది, కాని తగిన పాత్రత కలిగినవారు కావాలి కదా!

మీకు బుజ్జగింపులు ఇష్టం. ప్రణామాలు చేయుట ఇష్టం. పూలమాలలు వేయుట ఇష్టం. మా చిత్తరువులకు హారతి ఇవ్వటానికి ఇష్టపడతారు. ఇలాంటివి చేయుట మీకెంతో ఇష్టం. వ్యర్థపుమాటలు మాట్లాడుటకు ఇష్టపడతారు. బ్రహ్మదండం, కమండలాన్ని ధరించుటకు ఇష్టపడతారు. చిన్నపిల్లల మాదిరి భగవంతుడిని బోల్తాకొట్టించండి, శంకరుడిని బోల్తాకొట్టించండి కాని మమ్ములను చేయవద్దు. మేము మీనుండి– మేమిచ్చెడి వానికి ప్రతిఫలంగా తగిన మూల్యాన్ని తీసికొంటాం. ఇచ్చిపుచ్చుకొనెడి వ్యవహారాన్ని మేము ఇష్టపడతాం. మా గురువర్యులకు కూడా ఇదే ఇష్టం. మేము వారికి అందించాం, వారు తిరిగి మాకు అందించారు. మా ఇరువురి మధ్య దీనిపై వాగ్యుద్ధం జరిగెడిది – "నీకేమైనా కావాలా?" అని నా గురుదేవు లడిగితే, "మీకేమైనా కావాలా?" అని వారిని తిరిగి ప్రశ్నించెడివాణ్ణి. 'నీకేమైనా కావాలా?' ఆయన తిరిగి అడిగేవారు. అప్పుడు నావద్ద ఉన్నదానిని తెచ్చి ఆయనకు సమర్పించెడివాడను. అప్పుడు వారన్నారు. మావద్ద నున్న 600 సంవత్సరాల తపస్సును నీకై అర్పిస్తున్నాను. ఆ రీతిగా అందుకొన్నదానిని, మిత్రులారా! లెక్కించి దాని సాయంతో కొన్ని పెద్ద పనులు నిర్వర్తించా! శరీరంలో, మాంసంలో ఏమి లేదు? మేము ఎంతటి గొప్ప పనుల చేయుటకు సంకల్పించామో, ఆ పనంతా భగవంతుని శక్తుల ప్రతిరూపమే.

మానుండి మీరు ఏమి కోరుచున్నారు? స్వాతిచినుకుల నుండి ముత్యాలు తయారగుట విన్నారా? స్వాతిచినుకు సముద్రంలోని ఆల్చిప్పలో పడగనే అది మేలిముత్యంలా రూపుదిద్దుకొంటుంది. వెదురులో పడిన చినుకు ముత్యముగా మారదు. పారస్‌రాతిని గురించి మీరు విన్నారా? పారస్‌రాయి వలె మీరు తిరిగి రండి. మీరు లోహమైనచో ఈ హృదయానికి హత్తుకుంటూ. వెల మాత్రం అడిగి తీసికొంటా! ప్రణామం చేసి ప్రపంచానికి సరిపడా వరదానాలడిగెదరు. మీరు అంతటి పిచ్చివారా! తరచి చూడగా రామకృష్ణపరమహంస దాని విలువను వసూలు చేశాడు. అట్లే చాణక్యుడు వసూలు చేసి ఇచ్చారు.

సమర్థగురురామదాసు కూడా కిమ్మత్తు వసూలు చేసికొన్నాడు. మిత్రులారా! ఇదే రీతిలో ఈ పరంపరను నిలువరింపక, కొనసాగిస్తాను. తగిన మూల్యం చెల్లించనివారికి, ఉచితంగా పొందాలనెడివారికి, లూటీచేసెడివారికి, జేబు కత్తిరించెడి వారికి మా సంపదనెట్లివ్వగలను? మాకై చెమటోడ్చెడివారికి ఇస్తాను, శ్రమించెడివారి కిస్తాం, మాకై తపించెడివారి కిస్తాం, మాకొరకై వారి జీవితాలను ధారపోసెడివారి కిస్తా. శ్రావణ పూర్ణిమ వేళ మాకు రక్షణ నిచ్చెడివారికి తిరిగి మేము రక్షణ కల్పిస్తాం. ఈ పండుగను నేను కూడా జరుపుకుంటా. పదివేల మందిని ఎంచుకొనగలననెడి పరిపూర్ణ విశ్వాసంతో.

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## మితవ్యయం - విశిష్టత

*"సరస్వతి" సంపాదకుడైన* ***పండిత మహావీరప్రసాద్ ద్వివేది****కి పాతికరూపాయల వేతనం లభించేది. అది పెరిగి 150 రూపాయలు అయ్యింది. దీనితో ఆయన సొంతానికి చాలా తక్కువ ఖర్చుచేసుకుంటూ, మిగిలినదానితో అవసరాలలో ఉన్నవారిని ఆదుకునేవారు. కనీసం ఒక్క పైసా కూడ వ్యర్థంగాగానీ, విలాసానికిగానీ ఖర్చుగాకుండా ఆయన జాగ్రత్త వహించేవాడు.*

***సంపాదన ఎంత ఎక్కువ ఉన్నదని ఆరాటపడటం కాక, ఆ సంపాదన ఎంతవరకు సద్వినియోగమవుతున్నదని సమాజములోని ప్రతి వ్యక్తీ ఆరాటపడగలిగిననాడు సమాజంలో ఇప్పుడున్న లోట్లుగాని, ఇబ్బందులు గాని, దారిద్ర్యంగాని, ఆకలిచావులుగాని మచ్చుకైనా కనిపించవు.***

**సద్గురువు యొక్క వేష భాషలు పట్టించుకోక ఆయనను విశ్వసించినవాడే కృతార్థుడవుతాడు**

# బ్రహ్మముహూర్త వేళ ప్రకృతి ధనాగారం గుబాళిస్తుంది

(ఇవాళ రేపు) నేడు విద్యార్థుల చదువు వేళలు మారిపోయి, రాత్రులందు బాగా ప్రొద్దుపోయేవరకు మేల్కొని ఉండుట సర్వసాధారణ విషయంగా మారింది. విద్యార్థులు అధికశాతం పాఠ్యాంశాలను రాత్రివేళలందు ప్రొద్దుపోయేవరకు చదివి, ఉదయం జాముపొద్దు పొడిచిన (సూర్యోదయం తదుపరి) తర్వాత నిద్రలేచుట పరిపాటిగా మారింది. ఈ అలవాటు కొన్ని ప్రాంత వాతావరణాలను బట్టి కొందరికి సౌలభ్యంగా కనిపించినప్పటికి, తదుపరి వారి జీవితాలలో (ఏ దృష్టితో చూచిన) నష్టాన్ని కల్గించుచున్నది.

రాత్రి సమయాన్ని మనం నిద్రించుటకిచ్చాడు భగవంతుడు. అట్లే పగలు పని చేయుటకిచ్చాడు. దీనికి భిన్నంగా మనము ప్రవర్తించుట జరిగినచో, ప్రకృతి ప్రతికూలతవలన మన శరీరంపై చెడు ప్రభావం కలిగి అనేకానేక శారీరక, మానసిక రోగాలు మనలో ఉత్పన్నం కాగలవు. అట్లే అధిక సమయం రాత్రివేళలందు మేల్కొని ఉండుట వలన మన పొట్టలో వాయువు, ఆమ్ల ఉత్పత్తి అధికమై పొట్ట సంబంధిత ఇతర వ్యాధుల రూపంలో మనకు సంక్రమిస్తూ ఉంటాయి. వీని ప్రభావం నేరుగా మనస్సు, మస్తిష్కాలపై పడి, సమస్త శరీరం వ్యాధిగ్రస్తం అవుతుంది. పొట్టలో ఉత్పత్తి అయిన వాయువులు సమస్త శరీర అంగాలపై తమ ప్రభావాన్ని చూపుతూ, తలనొప్పి, పొట్టనొప్పి తదుపరి అధిక రక్తపోటు తద్వారా హృద్రోగాలకు దారితీయుట పరిపాటి. మనస్సు కూడా కకావికలమైపోతుంది, అశాంతికి దారితీస్తుంది. దీనితో మనిషిలోని స్ఫూర్తి, ఉత్సాహాలు తరచు ఒడిదుడుకులకు లోనౌతూవుంటాయి. తద్వారా రోజువారీ పనులు కుంటుపడుతూ పలు బాధలకు దారితీస్తూ ఉంటాయి.

పైవాని నుండి మనం బయటపడాలన్నా, అవి మనకు సంక్రమించకుండా ఉండాలన్నా మనం తప్పక పెందలకడే నిద్రపోవలసి ఉన్నది. దీనివలన ఉదయాన్నే మనం బ్రహ్మ ముహూర్తకాలమందే నిద్ర నుండి మేల్కొని, తద్వారా ప్రకృతి నుండి అయాచితంగా లభించెడి అనేకానేక లాభాలను నిస్సందేహంగా పొందగలం. దీనివలన మనకు లభించెడి అత్యంత గొప్పలాభం రోజులోని మొత్తం 24 గంటలలో, కేవలం వేకుజామున లభించెడి ప్రాణవాయువు (ప్రాణశక్తి)ని అందిపుచ్చుకొనగలం. ఇది మనలను రోజంతా ఉత్సాహంతో, స్ఫూర్తిదాయకంగా ఉంచుతుంది. కావున దీనికి భిన్నంగా ప్రొద్దు ఎక్కిన తదుపరి అనగా బ్రహ్మముహూర్తానంతరం మేల్కొన్నచో, మనమీ శక్తిని అట్లు ఆలస్యంగా లేచిన ప్రతిరోజు కోల్పోయెదము.

ప్రాతఃకాలమందే మేల్కొనుటను అలవాటు చేసికొన్నవారికి అది చక్కని అలవాటుగా మారి పూర్తి సంతృప్తిని జీవితానికి అందిస్తుంది. దీనితోపాటు ప్రకృతి నుండి మనం బలాన్ని మరియు ఆరోగ్యం వంటి అమూల్య సంపదలను పొందెదము. దీనితో జీవితం ఆనందమయమవుతుంది. దీనినే ఒక కవి ఎంతో వీనులవిందుగా వర్ణించాడు. “బాలభాస్కరుని లేలేత కిరణాలు ప్రాణశక్తినందిస్తాయి. వేకువజామునే లేవండి – లాభాన్ని పొందండి, ప్రభాతవేళ అమృతాన్ని సేవించండి.”

ఈ అమృతఘడియలు పశ్చిమదేశాలలో కూడా ఉన్నాయి. అచ్చట కూడా ప్రవచించారు. “పెందలకడనే నిద్రపోవాలి! పెందలకడనే నిద్రలేవాలి! (Early to bed and early to rise) ఇట్టి వ్యక్తి ఆరోగ్య, భోగభాగ్యాలతో, కుశాగ్రబుద్ధితో విరాజిల్లుతాడు.

1. బ్రహ్మముహూర్తకాలము అనగా ప్రాతఃకాలము. ఈ సమయంలో వచ్చెడి వాయువుల్లో ప్రకృతిసిద్ధంగా అన్నింటికన్న ఎక్కువగా సంజీవనీశక్తితో నిండిన వాయువులు వీస్తుంటాయి. ఈ శక్తితో నిండిన వాయువు రాత్రివేళలందు చంద్రుని వెన్నెలతో మిళితమై అమృతకణాలు వర్షిస్తూ ఉంటాయి. దీనివలన శాస్త్రాలలో దీనిని శక్తిప్రదాత అని చెప్పుట జరిగింది. ఎవరైతే ప్రాతఃకాలంలో నిద్ర లేచి యోగా, ప్రాణాయామాలను చేస్తూ ఉన్నారో వారిలో అంతర్ ప్రసన్నత, స్వాధ్యాయం, సౌందర్యం, మేధస్సు, స్మరణశక్తి పెంపొందుతాయి. దీనివలన చదువుట, వ్రాయుటకు ఈ సమయం అత్యుత్తమమైనదిగా గుర్తించారు.

2. ప్రాతఃకాలములోని ప్రాణవాయువు (ఆక్సిజన్) శుద్ధతతో కూడి ఉండి, ఉచ్ఛ్వాస క్రియద్వారా ఊపిరితిత్తులలోనికి ప్రవేశించి 'సెరోటినిన్' అనెడి పదార్థ ఉత్పత్తిని అధికం గావించి, మన మస్తిష్కాన్ని తేజోవంతంగా, చురుకుదనంగా చేస్తూ శరీరాన్ని ఆరోగ్యవంతం గావిస్తుంది.

**ఇహపర శ్రేయస్సును చేకూర్చే జీవన విధానమే ధర్మం**

3. ప్రాతఃకాలమందు ప్రాణాయామం చేస్తూ దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసలు చేయుట ద్వారా, అధిక శాతం ప్రాణవాయువును లోపలికి తీసికొన్నప్పుడు శరీరానికి రోగనిరోధకశక్తి పెరిగి, రక్తంలోని తెల్లకణాల శాతం పెరుగుతుంది. రోగాల నుండి శరీరానికి విముక్తి కలుగుతుంది.

4. శుద్ధవాయువులు మన ఊపిరితిత్తులలోనికి ప్రవేశించి సక్రియ ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా ఊపిరితిత్తులను బలోపేతం గావిస్తాయి. తదుపరి ఊపిరితిత్తులలోని విజాతివాయువులను వెలికి పంపి, శరీరానికి ఆరోగ్యాన్ని చేకూర్చుతాయి.

5. మన శరీరానికి అవసరపడిన ప్రాణవాయువు (ఆక్సిజన్)లో 20% మన మెదడుకు కావలసివుంటుంది. ఇంకా అధిక ప్రాణవాయువును మన మస్తిష్కం తీసికొన్నచో జ్ఞాపకశక్తి పెరుగుదలకు దోహదకారి అవుతుంది.

6. మన శరీరంలో... కోశము (మేల్మ...) ఉన్నది. ఇది శరీరానికి ఆరోగ్యాన్ని మరియు దీర్ఘాయువును చేకూర్చుటలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. శుద్ధమైన వాయువు ప్రవేశించగనే శరీరంలో ఆరోగ్యంతో కూడిన దీర్ఘాయువు చేకూరెడి ప్రక్రియ ప్రారంభమవుతుంది. తద్వారా మనం ఆరోగ్యవంతులం కాగలం.

– అనువాదం: పార్థసారథి

## దుర్జన - సజ్జన సాంగత్య ఫలములు

*"కౌశలపుర"మనే రాజ్యానికి రాజపురోహితుడు ఆచార్య భార్గవుడు. ఆయన మహాశివుని పరమభక్తుడు. ఆయనకు పుత్రసంతానం కలిగింది. జ్యోతిష్యులు అతని జన్మకుండలిని పరిశీలించి "ఈ బిడ్డ బందిపోటు అయినా కావచ్చు లేదా గొప్ప సాధుపుంగవుడయినా కావచ్చు" అని తండ్రికి విన్నవించారు. రెండు అంశాలను దృష్టిలో ఉంచుకొని, భార్గవుడు తన కుమారునికి "నిష్కళంకుడు" అని నామకరణం చేశాడు. పిల్లవాడు మేధావి, మహాపరిశ్రమవంతుడు కూడా. అతడికి విద్యాబుద్ధులు చెప్పించే క్రమంలో భార్గవుడు అతడిని దూరంగా ఉన్న గురుకులంలో చేర్పించాడు. ఆ గురుకులానికి దగ్గరలోనే ఉన్న తమ సమీప బంధువు గృహంలో తన బిడ్డకు నివాసము, వసతిసౌకర్యాల నేర్పరిచాడు. ఆ బంధువుకు విపరీతంగా మద్యపానం చేసే అలవాటు ఉండేది. అతడి యొక్క ఈ అలవాటును తెలుసుకున్న నిష్కళంకుడు ఆ విషయాన్ని తన తండ్రితో చెప్తానని, బంధువుతో చెప్పగా, ఆ బంధువు గాబరాపడి వెంటనే "ఒక రహస్యమైన విద్యను నేర్చుకునే నిమిత్తమై నేను మద్యపానం చేస్తున్నాను తప్ప మరేమీ కాదు. నీవు కావాలనుకుంటే నీకు కూడా ఆ రహస్య విద్య నేర్పగలను" అన్నాడు.*

*క్రొత్త విద్యను, జ్ఞానాన్ని నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో నిష్కళంకుడు మద్యపానాన్ని ప్రారంభించాడు, దాని ఫలితంగా క్రొత్త జ్ఞానం లభించకపోగా నిరంతర మద్యపానంతో నిష్కళంకుడి వ్యక్తిత్వం కళంకితమైంది. ఆదర్శవంతమైన విద్యార్థి- ఒక బందిపోటుగా పతనం చెందాడు. ఒకరోజు సుప్రసిద్ధ సాధువు "జ్యోతిర్భిక్షువు" - ఆ మార్గం వెంటసాగిపోతూ నిష్కళంకుడిని చూశాడు. నిష్కళంకునితో మాట్లాడిన మొదటి నిముషంలోనే అంతర్జ్ఞానియైన జ్యోతిర్భిక్షువు నిష్కళంకునిలో ఒక ఉచ్చఆత్మను దర్శించాడు. కుసంస్కారవశాత్తు ఆ "ఉచ్చఆత్మ" పదభ్రష్టమైనదని తెలుసుకున్నాడు. అతడి జీవన లక్ష్యాన్ని గుర్తుచేసే ఉద్దేశ్యంతో ఆయన నిష్కళంకునితో "దోపిడి చెయ్యాలనుకుంటే అపారమైన, అనంత సంపదలు కలిగిన ఆయన ఇంటిలో చెయ్యరాదా?" అని అడిగాడు. "ఎవరాయన? ఆయన పేరు నాకు చెప్పండి" అన్నాడు నిష్కళంకుడు. జ్యోతిర్భిక్షువు చిఱునవ్వు నవ్వి "ఆయన పేరు మహాశివుడు. మీ తండ్రి పూజించే భగవంతుడు." ఈ సృష్టి యావత్తూ ఆయనదే. ఈ ఐశ్వర్యమంతా ఆయనదే. ఆయన వద్ద ఉన్నదాని కన్నా మించిన సంపద మీకు ఇంకెక్కడ లభ్యం కాగలదు?" అన్నాడు. భగవంతుడైన పరమశివుని యొక్క, తన తండ్రి యొక్క నామములను వింటూనే నిష్కళంకునిలోని జన్మజాతమైన సంస్కారములు జాగృతమైనాయి. తాను చేసిన తప్పులను గ్రహించిన అతడి హృదయం వేదనతో భారమైంది. అతడు తాపస మార్గాన్ని అవలంబించి, జ్యోతిర్భిక్షుని వెంట బయలుదేరాడు. కాలాంతరంలో అతడు తన జీవనలక్ష్యాన్ని సాధించగలిగాడు.*

*– అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**నిత్యజీవితంలో మనోనిగ్రహం సాధించిన వారికి మాత్రమే ఉపవాసం సత్ఫలితాలనిస్తుంది**

# చికిత్స యంత్రాలతో కాక ప్రాణశక్తితో జరుగుతుంది

ప్రపంచంలో వ్యాధి నివారణకు అనేక పద్ధతుల ననుసరించి చికిత్సా నిపుణులు తమతమ అనుభవాల ద్వారా రోగులకు చికిత్సచేస్తూ ప్రజలకు ఆరోగ్యమును అందించే ప్రయత్నాలు చేస్తున్నారు. చికిత్స విషయపరంగా నూతన పద్ధతిగా నేడు "అల్ట్రాఇంటిలిజెంట్" యంత్రాలను వినియోగిస్తున్నారు. ప్రసిద్ధ బ్రిటీష్ శాస్త్రజ్ఞుడైన ప్రొ. ఐ.జె.గుడ్ ఆరోగ్య సంరక్షణ సంబంధం తెలుపుటలో ఈ యంత్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్ణయించుట జరిగింది. ఈ యంత్రాలను కనుగొనుటలో మూల ఉద్దేశ్యం- కృత్రిమవిధానంలో భావ శీలతను, చింతనాశీలతను ఉత్పన్నం చేయుట. దానికొరకు చాలా చోట్ల "ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ లేబోరేటరీ" లను కూడా స్థాపించుట జరిగింది. ఐతే సమస్యలు మాత్రం యథావిధిగానే ఉన్నాయి. విజ్ఞానపు నూతన వికసిత ప్రణాళిక యైన 'మైక్రోప్రోసెసర్స్' యొక్క విజ్ఞాని, సుప్రసిద్ధ ఆలోచనాకర్త "క్రిస్టోఫర్ ఇవాన్స్" తన గ్రంథం - 'మైక్రోమిలేనియమ్' లో వ్రాసిన ప్రకారం మానవుని ఆలోచనా క్షమతలు అనంతమని, అపారమని తెలిపాడు. యంత్రాల తయారీ అతని ఆలోచనలకు నకలు మాత్రమేనని, అందులో ఆత్మలేనందున స్వయంగా ఆలోచించుట, ఆలోచనలను అర్థం చేసుకొను శక్తి వానికి ఉండదని, మానవునికి ఉండే తెలివితేటలతో దేనినైనా అర్థం చేసుకోగల శక్తి పరమాత్మ ఇచ్చాడని, ఈనాటివరకు ఏ వైజ్ఞానికుడు ఇటువంటి యంత్రాన్ని ఇప్పుడు కానీ, ఇక ముందుకానీ తయారుచేసే శక్తికలవానిగా ఆశించుట వ్యర్థమని నిష్కర్షగా చెప్పడం జరిగింది. ఆ పరమాత్మ తన ఇచ్ఛాశక్తితోనే ఇటువంటి భావనాపూర్వకమైన 'మానవ యంత్రాన్ని' తయారుచేయగల శక్తిమంతుడు. ఈ ప్రపంచంలో ఎంత గొప్ప-గొప్ప యంత్రాలు ఉన్నప్పటికి ఈ మానవయంత్రానికి ఎంతమాత్రం సరిపోజాలవు.

విశ్వవిఖ్యాత తత్త్వవేత్త 'బెట్రాండ్ రస్సల్' ప్రకారం వైజ్ఞానికుల ద్వారా నిర్మించబడే యంత్ర-ఉపకరణాల సంచాలనలలో 'బయోలాజికల్' పద్ధతి ఉంటుంది. కానీ మానవయంత్రపు క్రియాపద్ధతి ఒక ప్రత్యేకమైన 'నాన్ బయోలాజికల్ పేట్రన్' మీద ఆధారపడి ఉంటుంది. దీనిని అర్థం చేసుకొనుట కొరకు మస్తిష్కంలో పొంగిపొరలే భావప్రవాహపు సూక్ష్మ గందరగోళ రహస్యాలను గ్రహించి, వాటిని ప్రకాశింపసుకోల్సి ఉంటుంది.

వాసన, తృష్ణ, అహంకారం, లోభం, మోహం వంటి చెడు ఆలోచనలు మానవుడిని సంకీర్ణునిగా, స్వార్థపరునిగా తయారు చేస్తాయి. వీటి ఒత్తిడిలో పడిన మనిషి చెడ్డపనులు చేస్తూ, అపరాధ నడవడి పొందేందుకు ఉద్యుక్తుడవుతాడు. ఆలోచనలలో అటువంటి తుఫానులు చెలరేగినప్పుడు మానవుడు సగం పిచ్చివానిగా మారిపోతాడు. అట్టి దశలో మనోసంతులనం దెబ్బతినటంతో, దాని ప్రభావం ఆరోగ్యం మీద కూడా పడుతుంది. ఈవిధమైన అజ్ఞానపు చింతన ఆరోగ్యపరమైన విఘాతాలు అలవాట్లను తన జీవితచర్యలో ప్రవేశించనీయని యెడల ప్రతివ్యక్తి పేదవానిగా ఉన్నా కూడా ఆరోగ్యంగా, సమర్థునిగా తన జీవితాన్ని ఆనందమయంగా మార్చుకొనగలడు.

మనిషిని ఆరోగ్యంగా, సమున్నతంగా తయారుచేసేందుకు చికిత్సా రూపంలో ఈనాడు తయారుచేయబడే 'అల్ట్రా ఇంటిల్ జెంట్' యంత్ర నిర్మాణంలో ఎంత ఖర్చు చేయబడుతుందో దానినీ, ప్రతిభను, ఇంకా భావ-ప్రవాహాన్ని శక్తివంతంగా, సమర్థవంతంగా నిలుపుకోగల ప్రఖర వ్యక్తిత్వాల నిర్మాణం వైపు మరలించగలిగితే వారి ప్రచండ విద్యుత్‌శక్తి ప్రభావంతో నికృష్టచింతన, దుర్బల మనోస్థితి ఉన్న వ్యక్తుల ఆలోచనాశైలిలో గొప్ప పరివర్తన తీసుకొనిరావచ్చు. సదాలోచనల ప్రాప్తి కొరకు సువికసిత చేతనా సంపన్నత, భావశక్తిగల వారి సాన్నిధ్యం అత్యంత ఉపయోగకరంగా ఉంటుంది. వారిలో శ్రేష్ఠమైన ప్రఖర ప్రాణశక్తి, నిషేధాత్మక ఆలోచనా ధారను సహజంగానే నిర్మూలించగలదు. ప్రయోగశాలలోనైతే మామూలు విద్యుత్ షాక్‌లు మస్తిష్కపు పొరలలోకి చేరి కొంతమందిలో ఆలోచనా ప్రవాహాన్ని కొద్ది సమయం వరకు మార్చుటలో సంభవం కావచ్చు. కాని ప్రఖర, ప్రతిభాశీల వ్యక్తుల ప్రాణ ప్రవాహం- హేయస్థితిలో ఉండే ఆలోచనా సరళిని మార్చుటలో చిరస్థాయి చికిత్సా ప్రయోజనాన్ని చక్కగా పూర్తిచేయగలదు.

*- అఖండజ్యోతి, మార్చి 2010*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**ఉపవసించినపుడు రుచుల మీదకు మనస్సు పోయినచో అట్టి ఉపవాసం వ్యర్థమేగాక అనర్థం గూడా**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# మానవశరీరము యొక్క అసలైన సంపదలు - 3

*పరమపూజ్య గురుదేవులు తమ విశిష్టమైన ప్రవచనము ద్వారా 'మానవుడిని భగవంతుడు సర్వోన్నతమైన రాజకుమారునిగా ప్రకటిస్తూ అతనికి లభించిన సహజసంపదలను గురించి ఒకసారి అతనికి గుర్తుచేస్తున్నట్లుగా' గత సంచికలో మీరందరూ చదివియున్నారు. 'మానవుడు సమస్త సంపదలకు అధిపతి అయ్యుండికూడా ఆపదలచేత చుట్టివేయబడటానికి అతడు తన జీవితములో అనియంత్రణకు స్థానం కల్పించడమే కారణము' అనికూడా గురుదేవులు ప్రవచిస్తున్నారు. జీవితములో సంయమనము, నియంత్రణలను అమలుపరచగలగటమే ఆధ్యాత్మికతగా ప్రకటిస్తూ, నిజమైన ఆధ్యాత్మికత జీవితములో ప్రవేశించినపుడు మానవుడి ఆహారవిహారములు రెండూ సంస్కరించబడటమే కాక, అతడి వ్యక్తిత్వములోని ప్రతి కోణములోనూ ఔన్నత్యము ప్రతిబింబిస్తూంటుందని పూజ్యగురుదేవులు తెలియజేస్తున్నారు. ఆధ్యాత్మికత అనేది ఏదో ఒక గారడీకాదు. శ్రేష్ఠమైన, ఆదర్శవంతమైన, ఉన్నతమైన, సరియైన ఆలోచనలను జీవితములోకి దింపుకొనటమే ఆధ్యాత్మికతకు అసలైన అర్థము అని యుగఋషి అభివర్ణిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*



## దిగులు అనేది ఒక జబ్బు

మన అలవాట్లు, స్వభావములో చోటుచేసుకుంటున్న పలురకాలైన వికృతులు మనలను ఆలోచనలలో ముంచివేస్తున్నాయి. దిగులు చెందటం వలన సమస్యలు ఎంత మాత్రమూ తేలికపడవు. 'ఇంట్లో ఆడపిల్ల ఎదిగింది, 19 సంవత్సరముల వయస్సు వచ్చింది. వివాహము చెయ్యాలి' అని ఆలోచిస్తూ కూర్చుంటే వివాహము జరుగుతుందా? ఆలోచనతో కాలము గడిచిపోతూంటుంది. పిల్ల ఇంట్లోనే ఉంటుంది. లేచి వరుడిని అన్వేషించే పనిలో నిమగ్నము కావాలి. మనస్సు అందుకు ఎంతమాత్రమూ సహకరించదు. పెళ్ళివల్లకానీ, ఇంట్లో ఆడపిల్ల వల్లకానీ వచ్చిన కష్టమేమీ లేదు. వచ్చిన కష్టమల్లా 'ఆలోచన'తోనే. ఆలోచన అనేదేమన్నా రోగమా? అవును కచ్చితముగా రోగమే. నిరాశ, క్షోభ, భయము....ఇవన్నీ మానసికవ్యాధులు. నియంత్రణ మన శరీరమును శిథిలము చేసినట్లుగా ఈ మానసికవ్యాధుల వల్ల కలిగే మానసిక-అసంతులనము శరీరం కన్నా ఎన్నో రెట్లు విలువైన మన మెదడును తల్లక్రిందులుగా చేసివేస్తుంది.

## వెలకట్టలేనిది మన మస్తిష్కము

శరీరము విలువా లేదా శరీరారోగ్యము విలువా ఒక రూపాయి ఐతే మెదడు కనీసము 10 రూపాయలు, ఇంకా చెప్పాలంటే 100 రూపాయల విలువ కూడా చేస్తుంది. ఇంతటి విలువైన మన మన శరీరాలనే సాధనాలు ఎంత అధమంగా నశిస్తున్నాయో మీరు గమనించలేకపోతున్నారు. మన లోపలున్న బలహీనతలు, మెదడులోని వికృతులు, దృష్టికోణములోని అవాంఛనీయతలు మొదలైనవన్నీ కలిసి మన మస్తిష్కమును ఛిన్నాభిన్నము చేసివేస్తున్నాయి. ఫలితముగా మెదడులో అసంతులనము చోటుచేసుకుంటుంది. ఈ అసంతులనము మన నిద్రను, మన జీవితమును కబళించివేస్తుంది. నాలుగువైపులా భయానక వాతావరణమును ఏర్పరుస్తుంది. ప్రతి మిత్రుడినీ-శత్రువుగా చూపించి మనలను విసుగుకు గురిచేస్తుంది. భార్యాబిడ్డలకు దూరం కావిస్తుంది.

## సరియైన ఆలోచన వల్ల జరిగే అద్భుతము

దురదృష్టమేమిటంటే 99% సమస్యలు ఈ అసంతులనము వల్లనే ఉత్పన్నమౌతాయి. అసలు మనకు ఆలోచించే విధానమే తెలియదు. సమస్యలకు పరిష్కారము అన్వేషించటానికి

**అతిథి అంటే మానవుడే కాదు - భోజన సమయానికి వచ్చిన ఏ ప్రాణి అయినా అతిథితో సమానమే**

అవసరమైన దృష్టికోణము ఎలా ఉండాలో తెలియదు. క్షౌరం చేసే దుకాణము పైన Miracle of barber's hand అని వ్రాసి వ్రేలాడదీసుంటుంది. మీరు చూసే వుంటారు. అంటే 'క్షౌరం చేసేవాడి చేతిలో అద్భుతము' అని మీకు తెలుసు. అలాగే మేము ఇంకొక మాట Miracle of right thoughts అని చెప్తున్నాము. దీనిని మీరు సర్వదా అమలుపరచుకోగలిగితే మీ ముఖము పైన చిఱునవ్వు ప్రకాశిస్తూనేయుంటుంది. హీనపరిస్థితులలో కూడ సంతోషము, ఆనందము మిమ్మల్ని వదిలిపెట్టి వెళ్ళలేవు.

భయము, అసంతోషము, క్షోభ మొదలైన భూతాలన్నీ మన లోపలినుండే బయటకు వస్తాయి. మనలను వేధించి బాధపెడతాయి. పరిస్థితుల కారణముగా ఇవన్నీ ఏర్పడవు. మనయొక్క వికృతమైన, వ్యతిరేకధోరణిలో సాగే ఆలోచనలే మన జీవితములోని చిఱునవ్వులను లాగివేసి దుఃఖము, భయాందోళనలు, సందేహము మొదలైనవాటితో నిండిన సమస్యాత్మక పరిస్థితులలోకి మనలను నెట్టివేస్తుంటాయి.

### జీవితములో సకారాత్మకతకు స్థానమివ్వండి

మానవుడు నకారాత్మకమైన ఆలోచనలను చేసే బదులు-సకారాత్మక ధోరణిలో ఆలోచించగలిగితే అతడి మనస్సు ప్రసన్నమౌతుంది. హృదయము సంతోషతరంగితమై ఉల్లాసము కలిగి అది చిఱునవ్వు రూపములో ముఖముపై ప్రతిబింబిస్తుంది. ఇదియే ఆధ్యాత్మికత! మీరు పరిస్థితులను ఎదుర్కొనండి. మీ ఇల్లాలు కోపిష్టిది, గయ్యాళిగా కేకలేస్తూంటుంది అని మీరు బాధపడుతుంటారు. 'కోపిష్టి ఐతే ఏమైంది? ఎంతమంది వ్యక్తులు బ్రహ్మచారులుగా ఉన్నారు? ఎంతమంది స్వయంగా వండుకొని తింటున్నారు? ఎంతమందికి సమయానికి ఆహారము లేక ఇబ్బందిపడుతున్నారు?' అని మీరు ఒకసారి ఆలోచించగలిగితే పరిస్థితి మారిపోతుంది. 'నా భార్య కోపిష్టిదే ఐనా రుచిగా వండిపెడుతుంది, ఇంటిని చక్కగా తీర్చిదిద్దుతుంది. పిల్లల ఆలనా-పాలనా సమర్థవంతముగా నిర్వహిస్తుంది. అప్పుడప్పుడు కోపముతో కేకలేస్తే ఏమైందిలే?' అని కనుక ఆలోచించగలిగితే అశాంతి తక్షణమే మీనుండి దూరమౌతుంది.

### జీవితమంటేనే ఘర్షణ

సదాలోచనలను స్వీకరించడం, వాటిని హృదయంగమము చేసుకొని జీవితాన అమలుచెయ్యటము అలవరచుకొనగలిగితే ఈరోజు మనకు శత్రువులుగా, విరోధులుగా అనిపించిన వ్యక్తులే రేపు మనకు మిత్రులుగా అనిపిస్తారు. రోగపీడితులైన వారి పట్ల మన హృదయము ఎంత దయగా స్పందిస్తుందో అలాంటి కరుణే వీరిపట్ల కూడా మనలో కలుగుతుంది. జీవితములో పరిస్థితులు ఒక్కొక్కసారి మనకు అనుకూలముగా ఉంటాయి, మరొకసారి ప్రతికూలముగా ఉంటాయి. డబ్బుండటం, విజయమును సాధించటమనేవి జీవితములో అభివృద్ధిచెందటానికి ఉపయోగపడే సాధనములు. అలాగే తలపెట్టిన పనిలో సఫలీకృతులు కాలేకపోవడము, కష్టములు ఎదురవ్వడము కూడా అంతే అవసరము. తద్వారా మన తెలివితేటలు, ప్రతికూల పరిస్థితుల నెదుర్కొనగలిగే సామర్థ్యము, మన ధైర్యసాహసములు, గౌరవమూ అన్నీ వృద్ధిచెందుతాయి. జీవితాంతమూ విజయములే సాధిస్తూ కీర్తిప్రతిష్ఠల ననుభవిస్తూ విశ్రాంతిగా గడిపే వ్యక్తి 'మట్టిబొమ్మ'తో సమానము. పోరాడటము నేర్చుకొని, ధైర్యముతో పనిచేస్తూ, సాహసముతో ముందుకు సాగిపోయే వ్యక్తియే 'ఒక నెపోలియన్, ఒక సికిందర్'గా, ఒక 'ఫలానా వ్యక్తి'గా తయారుకాగలడు. వాళ్ళే వీరులు! విజయము తానే స్వయముగా వచ్చి వారి పాదాలను స్పృశిస్తుంది. 'మేము పోరాడగలిగినవారము!' అని తమను తాము నిరూపించుకున్నవారిపైననే భగవంతుడి అనుగ్రహము కలుగుతుంది. వాస్తవానికి మన సమస్యలన్నీ కేవలము అసంతులనము వల్ల ఏర్పడే సమస్యలు. అవి మన ఆలోచనా విధానములోని దోషము వల్ల ఏర్పడుతున్నవి. ఇవి అంతరంగపరమైనవే కానీ బయటనుండి వచ్చిపడినవి కావు.

### భగవంతుడు కూడా జీవితములో కష్టాలను అనుభవించాడు

రామచంద్రప్రభువు యొక్క జీవితమంతా సంఘర్షణలతోనే గడిచిపోయింది. ఆయన ఎన్నో బాధలను సహించాడు. శ్రీకృష్ణభగవానుడు కూడా పూతన, బకాసురుడు, తృణావర్తుడు మొదలైన రాక్షసులనూ, కాళీయుడనే భయానక విషసర్పమునూ సంహరించాడు. ధర్మరక్షణకై జీవితకాలము శ్రమించి, పాండవులకు సహాయము చేశాడు. జీవిత చరమాంకములో యాదవ వంశ మంతా క్షయమైన పిదప అడవిలో ఏకాంతముగా విశ్రాంతి తీసుకుంటూండగా ఒక బాణము వచ్చి ఆయన కాలులో గ్రుచ్చుకుంది. తర్వాత ఆయన దేహత్యాగము చెయ్యటము జరిగింది.

నాయనా! మీరు సుఖము కావాలని కోరుకుంటున్నారు. 'సుఖము' అనేదేదీ ప్రత్యేకముగా ఈ భూమండలములో లేదు.

**ధర్మ సూక్ష్మాలు అర్థం గానిచో ధర్మం గురించి తెలియనట్లే.**

సుఖమనేది కేవలము మీరు ఆలోచించే శైలి మాత్రమే! సరియైన ఆలోచన పేరే 'సుఖము!'

### అసలు సుఖమంటే ఏమిటి?

ఎలాంటి పనీ చెయ్యకుండా విశ్రాంతిగా కూర్చుని, ఎవరి చేతా మాట పడకుండా, ఎలాంటి కష్టమూ దరిచేరకుండా ఉండటమే 'సుఖము' అని మీరు భావిస్తున్నారు. ఐతే ఒక పని చెయ్యండి. 'నల్లమందు' మాత్ర ఒకటి తెచ్చి వేసుకోండి. ఇక ఎలాంటి సమస్యలూ, కష్టములూ ఉండవు. కానీ ఇది ఇంకా పెద్ద పెద్ద కష్టములను తెచ్చిపెడుతుంది. నాయనా! ఒక్క విషయము మాత్రము నిజము. మనిషి జీవించి ఉన్నంతవరకూ ఘర్షణపడి తీరవల్సినదే. పరిస్థితులతో యుద్ధము చేసి తీరవల్సినదే. పరిస్థితుల నెదుర్కొన్నప్పుడు కలిగే విజయము ద్వారా లభించే సంతోషమే సుఖము. అదితప్ప మరేదీ సుఖము కాదు.

### కర్తవ్యనిర్వహణకు మరొక పేరు సుఖము

విపత్కరపరిస్థితి వచ్చినప్పుడు మనము దానిని ఎదుర్కొంటాం. అలా ఎదుర్కొని మనము మన కర్తవ్యమును సమర్థవంతముగా నిర్వహించగలుగుతున్నామని తెలుసుకొనగలుగుతున్నప్పుడు కలిగే సంతోషమే 'సుఖం!' ఇంద్రియాలకు సుఖము చేకూర్చడము 'సుఖము' అనిపించుకోదు. మంచి బట్టలు, మంచి తిండి, విషయసుఖాల ననుభవించడము... ఇవన్నీ సుఖములు కావు.

అత్యంత శ్రేష్ఠమైన సిద్ధాంతములను మనిషి తన జీవితములో అమలుచెయ్యగలిగినప్పుడు దానిని 'సుఖము' అంటారు. దానినే శాంతి, సంతోషము అనికూడా అంటాము. ఇంద్రియములపైన విజయము సాధించినప్పుడు మానసిక-అసంతులనము పైన విజయమును సాధించగలిగినప్పుడు, విషయవాసన మరియు వాంఛలనే తృష్ణపైన విజయము సాధించగలిగినప్పుడు మనిషి అసలైన విజయమును సాధించినట్లుగా భావించాలి. ఆరోజు మీకు ఎంతటి సంతోషము కలుగుతుందో, అది మీకు ఎంతటి గౌరవమును తెచ్చిపెడుతుందో మీరు ఊహించలేరు. వస్తుసంపదల వల్ల మనకు సుఖ సంతోషములు లభిస్తాయనీ, మనకు గౌరవము పెరుగుతుందనే భావనలో గనుక మీరుంటే అది కేవలము అపోహమాత్రమే.

హెన్రీఫోర్డ్ యొక్క పేరు మీరు వినుంటారు. ఆయన కర్మాగారములో ప్రతీరోజు ఎన్నో మోటారుకార్స్ తయారవుతు వుంటాయి. ఆయన ప్రపంచములోనే అత్యంత సంపన్నుడైన వ్యక్తిగా ఖ్యాతిగాంచాడు. అటువంటి వ్యక్తి తన దినచర్య పుస్తకములో ఇలా వ్రాసుకున్నాడు. 'భగవంతుడా! నేను మరణించిన పిదప తిరిగి అమెరికాలో జన్మించేటట్లు అనుగ్రహించు. ఒకవేళ ఇదే కర్మాగారములో జన్మించేటట్లయితే హెన్రీఫోర్డ్‌గా కాకుండా ఒక కూలీగా జన్మ నివ్వు. కాయకష్టము చేసి, కాళ్ళు-చేతులతో శ్రమచేసి, అలసిపోయి పట్టెడన్నము తిని, మంచి నిద్రపోయేలాగ అనుగ్రహించు. జీవితమును శాంతితో గడిపే అవకాశమును ప్రసాదించు!'

అంతటి సంపన్నుడు ఇలాంటి ప్రార్థనను ఎందుకు చేసుకున్నాడు? దీనినిబట్టి తెలుసుకొనవల్సినది ఏమిటంటే వస్తుసంపదలను పొందటము ద్వారా సుఖము లభిస్తుందనే మన ఆలోచన తప్పు అని. దానిని మార్చుకోవాలి.

### సుఖమంటే సరియైన దృష్టికోణమును కల్గి ఉండటమే

సుఖమనేది ఒక మానసికస్థితి, ఒక దృష్టికోణము, ఒక ఆలోచనా శైలి! సుఖమనేది వస్తువులతో జోడింపబడేదికాదు. మేము బోధిస్తున్న ఆధ్యాత్మికతలో అన్ని సమస్యలకూ పరిష్కారము ఇమిడియున్నది. మన జీవితాలను ఆవరించి ఉన్న లక్షల, కోట్ల సమస్యలకు పరిష్కారము ఆధ్యాత్మిక వాదములోనే దాగి ఉన్నది. మీరు మీ ఆలోచనల కేంద్రమును కొంచెము మార్చిచూడండి. ఎంతటి ఆనందము మీకు లభ్యమవుతుందో గమనించండి.

బుద్ధుని వద్ద సంపదలేమైనా ఉన్నాయా? ఏమీ లేవు. మనము ఇక్కడ సంపదలు ప్రోగుచేసుకుంటున్నాము. సంపదలకూ-జీవితములో లభించే సుఖమునకు ఎక్కడా సంబంధము లేదు. సుఖమును అన్వేషించదలచుకుంటే లౌకిక వస్తువుల మీద ధ్యాసపెట్టవద్దు. మన దగ్గరున్న వస్తువులను సరిగ్గా ఉపయోగించుకుంటే చాలు. మందులు తయారు చెయ్యటము చేతనైనవాడికి; విషంలో నుండి కూడా అమృతమును తియ్యటము వస్తుంది. అలాగే సరిగ్గా ఆలోచించటము చేతనైనవాడికి వ్యతిరేకమైన పరిస్థితులలో కూడా తాను ఎదుర్కొంటున్న సమస్యకు సమాధానమును పట్టుకోవటము అర్థమౌతుంది. అందులో కూడా మార్గదర్శనము లభిస్తుంది. మీ జీవితానికి మేలుచేకూర్చగలిగే ప్రకాశమును కూడా పొందగలరు.

*- అఖండజ్యోతి, నవంబరు 2014*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**సద్గురువులందు పరిపూర్ణ విశ్వాసమున్నవారికే ఉత్తమ ఫలితాలు లభిస్తాయి**

నావారితో నా మాట

# మహామానవులను తయారుచేసే ముద్రణా స్థలం - దేవసంస్కృతి విశ్వవిద్యాలయం



### విశ్వనిర్మాణానికి ఇరుసు - దేవసంస్కృతి

ఈమధ్య సమాజంలో పెరుగుతున్న హింస, అరాచకాలు, సంవేదనారాహిత్యాన్ని చూసి అందరూ బాధపడుతున్నారు. విద్వాంసులు, నిపుణులు అందరూ మార్పు రావాలంటున్నారు. కాని అందుకు అవసరమైన ప్రక్రియ, ప్రణాళికలు మాత్రం ఏ ఒక్కరు అమలుపరచుట లేదు. మనందరి గురువుగారు– యుగఋషి, యుగద్రష్ట దశాబ్దాల క్రితమే ఈ రోగానికి మందును కనిపెట్టి దాన్ని పంచమని మనందరిని ఆదేశించారు.

మనిషి మారకుండా సమాజం మారదని స్పష్టంగా చెప్పారు. వ్యక్తిలో మార్పు వచ్చాకనే కుటుంబంలో, సమాజంలో మార్పు వస్తుంది. అప్పట్నుంచి నేటివరకు గాయత్రీపరివార్ సభ్యులందరు కలిసి వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం అనే యుగమంత్రాన్ని, సాధనను సంకల్పంగా స్వీకరించి ముందుకు సాగుతున్నారు. ఈ సంకల్పం సిద్ధించడం కోసం శాంతికుంజ్ కేంద్రం, పృథ్వి మొత్తం విస్తరించిన గాయత్రి పరివారం అంతా కలిసి సంవత్సరాలుగా కృషిచేస్తున్నాయి. కొన్ని సంవత్సరాల నుండి ఈ సాధనలో భాగంగా 'దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం' కూడా చేయి కలిపింది.

సరైన విద్యాప్రణాళిక ఉంటే వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సామాజికంగా కోల్పోయిన ఆనందం తిరిగి లభిస్తుందని పూజ్యగురువుగారు చెప్పారు. వ్యక్తిగతమైన, కుటుంబపరమైన, సామాజిక ఉపద్రవాలన్నిటికీ సమాధానం వెతకడం కోసమే శాంతికుంజ్ ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించింది. ఎవరి పద్ధతిలో వాళ్ళు ఎంత ప్రయత్నించినా యువకుల్లో, వారి వ్యక్తిత్వంలో, వారి కర్తృత్వంలో ఏదో తెలియని వెలితి కనిపిస్తూనే ఉంది. ఈ ప్రయత్నం చేత ఆ ఖాళీని నిశ్చయంగా పూరించడం జరుగుతుంది. ఇప్పుడున్న విద్యావిధానంలో శిక్షణ సంస్థలకు ఏ లోటు లేదు. ప్రభుత్వ, ప్రభుత్వేతర విశ్వవిద్యాలయాలు లెక్కలేనన్ని పుట్టుకొచ్చాయి. కాని అవన్నీ చాలామటుకు మార్కులు మరియు గణాంకాల ఇరకాటంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. పెరుగుతున్న మార్కులే విద్యకు గీటురాయిగా ధ్రువీకరిస్తున్నారు.

### తప్పుదోవ పట్టిన నేటి విద్యావ్యవస్థ

నిజమైన జీవిత పరమార్థం; వ్యక్తిగత, పారివారిక, సామాజిక కర్తవ్యాల పట్ల బాధ్యత; ఉపాధి కల్పనకు తగ్గ నైపుణ్యం– ఇవేవీ నేటి విద్యావ్యవస్థలో కనిపించటంలేదు. ఈమాత్రం విద్య కూడా పెట్టుబడి పెట్టే వాళ్ళకు మాత్రమే పరిమితమైంది. ఈమధ్య పెరుగుతున్న పెట్టుబడిదారీ సమాజంలో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత శిక్షితులై ఉండడం తప్పనిసరి. కర్మాగారాల్లోనూ, కూలీలుగా పని చేయాల్సిన మిగిలిన చోట్లలో కూడా ఎంతో కొంత వ్రాయడం, చదవడం తెలుసుండి తీరాలి. నిరక్షరాస్యులైన కార్మికులతో పని చేయించుకోవడం ఇప్పుడు కష్టమైపోయింది.

పెత్తందార్లకు కూడా వారి కర్మాగారాల్లో చవకగా దొరికే చదువుకున్న కూలీలు కావాలి. దాంతోపాటు ఐశ్వర్యవంతుల పిల్లలు డబ్బు సాయంతో పెద్ద పెద్ద డిగ్రీలు సంపాదించి వారి వారి వ్యాపారాలు, సంస్థలకు యజమానులైపోవాలి. ఒక పక్క ప్రభుత్వ పాఠశాలల్లో చవకగా చదువుకున్న కార్మికులు తయారవుతున్నారు, మరో పక్క డబ్బున్నవారి పిల్లలు పెద్ద డిగ్రీలు చేజిక్కించుకుని యజమానులయ్యే హక్కు బాగా చలాయిస్తున్నారు.

ఈ తాటాకుల అల్లికల్లో 'మానవులంతా సమానమే'! అన్న ఆదర్శం మాత్రమే కనుమరుగైంది. నిజానికి సర్వోచ్చ సమాజ ప్రణాళికను రూపొందించగలిగే నాగరికులను తయారు చేయడమే విద్యావిధానం యొక్క మూల ఉద్దేశ్యం. ఐనా బీదవాళ్ళు ఈ పెద్ద పెద్ద ఫీజులు కట్టలేక శిక్షననుభవిస్తున్నారు. వారికెప్పుడూ ఈ విద్య అందని కుసుమమే.

వ్యావహారికంగా మాత్రం ఈ విద్యలన్నీ మంచి ఉద్యోగాలు సంపాదించడం కోసమే అన్నట్టున్నాయి. చదువుకున్న విద్యార్థి

**సర్వాంగతుడైన భగవంతునిపై భక్తికి మత భేదం ఆటంకం**

ముందు ఒక మంచి మనిషిగా రూపొందాలి, తరువాత వైద్యుడు, ఇంజినీరో, వేరే అధికారో అవ్వాలి అన్న ఆశ, ఆశయం ఇప్పుడు ఎవరిలోనూ కనపడట్లేదు. మంచి మనిషిగా రూపొందాలనే లక్ష్యం ఎవరికీ మొదటి కోరికలా లేదు సరికదా, కనీసం చివరి కోరిక కూడా కావట్లేదు. అందరికన్నా ఎక్కువ మార్కులు సాధించడం, తరువాత వీలైనంత ఎక్కువ డబ్బు సంపాదించడం- ఇదే విద్య యొక్క మూల ఉద్దేశంగా మారిపోయింది.

లక్షల రూపాయలు ఫీజులు కట్టి చదువుకున్నాక, ఉద్యోగం సంపాదించి ఆ ఖర్చు పెట్టిందంతా వసూలు చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటారు విద్యార్థులు. అలాంటప్పుడు వాళ్ళు లంచాలు తీసుకోరని ఎలా నమ్మగలం. వైద్యులు డబ్బుల కోసం కాక ఊరికే ఎందుకు వైద్యం చేస్తారు.

అటు విద్యావ్యవస్థ, ఇటు విద్యార్థులు అందరూ వీలైనంత ఎక్కువ లాభాలు దండుకోవడమే ధ్యేయంగా పెట్టుకుంటే సామాజిక వ్యవహారాలన్నీ మరుగునపడతాయి. కాబట్టి ఈ విద్య ఎప్పటికీ సమాజ నిర్మాణానికి పనికిరాదు.

## శిక్షణాతత్త్వ ప్రయోగశాల - దేవసంస్కృతి విశ్వవిద్యాలయం

పరిస్థితుల్ని చక్కబెట్టాలంటే తిరగబడినదాన్ని మళ్ళీ తిరగేయాలి. గాయత్రీపరివార్ సభ్యుల పరిశ్రమ, సమయం మరియు ధనం ద్వారా సమర్థవంతంగా పోషించబడుతున్నదే ఈ దేవసంస్కృతివిశ్వవిద్యాలయం. నిజానికి పరమపూజ్య గురుదేవులు ఉద్బోధించిన శిక్షణాతత్త్వాన్ని అమలుపరిచే ప్రయోగశాలగా ఈ విశ్వవిద్యాలయాన్ని దర్శించవచ్చు. చాలా ప్రయోగశాలలు విశాలంగా ఉండవు, కాని వాటి ఫలితాలు మాత్రం విస్తృతంగా ఉపయోగపడుతుంటాయి. నలుదిక్కులా లెక్కలేనంతమంది ఈ ఫలితాలను ఉపయోగించుకుని మరెందరికో కూడా ఉపయోగపడేటట్టు కృషి చేసి కృతార్థులవుతారు. ఇప్పటివరకు ఈ విశ్వవిద్యాలయపు అనుభవాలు కూడా ఈవిధంగానే ఉన్నాయి. ఇక్కడ అవలంబించిన తత్త్వాలు, నీతులు, క్రియాకలాపాలు, ప్రక్రియలు, వాటివల్ల వచ్చిన ఫలితాలు, తథ్యాలను ఎందరో ఉపయోగించుకుని వాటి సకారాత్మక, సార్థక ఫలితాలను పొందారు.

శిక్షణ మరియు జీవితానికి సంబంధించిన ఎనిమిది మంత్రాలను ఇక్కడ ఇష్ట-మంత్రాలుగా స్వీకరించడం వల్ల విశ్వవిద్యాలయంలో ఈ లాభాలు పొందుతున్నారు. ఈ అష్ట మంత్రాల వ్యావహారిక సాధన వల్ల శిక్షణ ప్రక్రియ మరియు వ్యక్తిత్వం రెండూ తపించి పరిశుద్ధ రూపుదాలుస్తాయి. వీరి ప్రకాశవంతమైన, ప్రఖర, పవిత్ర జీవితాలు వారికే కాక ఇతరులకు కూడా లాభదాయకంగా, హితకరమైనవిగా ఉంటాయి. ఇక్కడ అధ్యయనం చేసే విద్యార్థినీ విద్యార్థులు పుష్పాల వలె పరిమళించి, చుట్టుప్రక్కల వాతావరణాన్ని కూడా పరిమళింప చేస్తారు. ఇవన్నీ ఇక్కడ నాటుకున్న అష్టమంత్రాల ద్వారా సాధ్యమవుతున్నాయి. ఆ ఎనిమిది మంత్రాలేమిటో ఇక్కడ చూద్దాం.

### దివ్య వాతావరణము: అద్భుత పాఠ్యక్రమం

**1. వాతావరణం:** మన జీవితాలను ప్రభావితం చేసే అతి సూక్ష్మతత్త్వం ఇది. మన పరిసరాలే స్థూలంగా వాతావరణాన్ని నిర్వచిస్తాయి. పరిసరాలకు, వాతావరణానికి సకారాత్మక సంబంధాలుంటే అక్కడుండేవారి భావనలు పవిత్రంగా, ఆలోచనలు శ్రేష్ఠమైనవిగా ఉంటాయి. ఈ విశ్వవిద్యాలయం సుసంపన్నమైన, సమృద్ధ వాతావరణం కలిగివున్నది. హిమాలయాల నీడ, గంగ ఒడి ఈ పర్యావరణాన్ని మరింత పవిత్రంగా, సమతుల్యంగా, విశ్రాంతిదాయకంగా మార్చేసింది. ఇక్కడ అధ్యయనం చేసే విద్యార్థినీ విద్యార్థుల జీవనశైలి, వస్త్రధారణ, ఆహార్యం, ఆలోచనల వల్ల అది మరింత సాత్వికంగా, పవిత్రంగా, ఉన్నతంగా రూపొందుతోంది. అందుకే ఇక్కడి విద్యార్థులు ఎల్లప్పుడు శ్రేష్ఠజీవితానికి ప్రేరితులవుతుంటారు.

**2. పాఠ్యక్రమం:** ఇక్కడి పాఠ్యక్రమాలన్నీ ప్రత్యేకంగా రూపొందించబడ్డవి. విద్యార్థులకు వారి పాఠ్యాంశాల ద్వారా నైపుణ్యం, సామర్థ్యం పెరగడంతోపాటు ప్రాథమికత, నైతికత కూడా జాగృతమయ్యేటట్టు రూపొందించారు. ఏదైనా క్రొత్తగా ఆలోచించడానికి, క్రొత్తగా చేయడానికి యోగ్యులుగా మారాలి. ఇందుకోసం శిక్షణ-ప్రశిక్షణ విధానం, ఎసెస్మెంట్ విధానం (మార్కులు ఇచ్చే ప్రక్రియ) ప్రత్యేకంగా రూపొందించారు. తద్వారా విద్యార్థులు కేవలం మార్కులు సాధించడం కోసమే

**దైవమొక్కడే అయితే మతం మార్చుకొనుట అనవసరం**

కాక సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది. దాంతోపాటే వారి జీవితాలు వట్టి పుస్తకాలలో కూరుకుపోకుండా, వారి పాఠ్యాంశాలకు సంబంధించిన విస్తృత ప్రపంచంతో సహజంగా ముడిపడివుండే జాగ్రత్త తీసుకోవడం జరిగింది.

**3. ఆచార్యులు మరియు విద్యార్థుల మధ్య సంబంధం:** విద్యార్థుల్లో సహజత్వం, పవిత్రత, భావనాత్మక సంతుష్టి పెంపొందే విధంగా ఈ సంబంధాలు అల్లబడ్డాయి. ఇక్కడి ఆచార్యుల్ని విద్యార్థులు వారి శ్రేయోభిలాషులుగా అనుభూతి చెందుతారు. తరగతిగదిలోనే కాక ఇతరత్రా అధ్యయనం మరియు వ్యక్తిగత సమస్యలను కూడా ఆచార్యులు పరిష్కరిస్తుంటారు. సంబంధాల్లోని ఈ మాధుర్యం ఒక అద్భుతమైన కుటుంబ వాతావరణాన్ని తలపింపజేస్తుంది.

**4. ప్రావీణ్యత:** ఇక్కడి శిక్షణ ప్రక్రియలో ప్రావీణ్యతకు విస్తృత నిర్వచనం ఇవ్వబడుతుంది. అధ్యయనం వరకే ప్రావీణ్యత కలిగి ఉండడం అసంపూర్ణమైన విద్య. అధ్యయనంతోపాటు వ్యవస్థాపక భావం కూడా ఉండాలి. వారి పాఠ్యాంశాల పరిధిని దాటి ఏదైనా చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలి. వారు సాధించిన నైపుణ్యాన్ని వారి అధ్యయన పరిధిలోనే కాక జీవితంలోని మిగిలిన క్షేత్రాలన్నిటిలోనూ ఉపయోగించుకోగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి.

**5. వైజ్ఞానిక ఆధ్యాత్మికత:** ఆలోచనల్లో వైజ్ఞానిక దృష్టికోణం మరియు హృదయంలో ఆధ్యాత్మిక సంవేదన జీవితాన్ని సార్థకం చేస్తాయి, పూర్ణత్వాన్నిస్తాయి. ఇక్కడి శిక్షణా క్రమంలో ఈ తత్త్వాల వికాసానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. పక్షపాత రహితమైన, ప్రయోగాత్మకమైన, సత్యనిష్ఠాపూరిత ఆలోచనలు మనిషిలో వైజ్ఞానిక దృష్టికోణానికి జన్మనిస్తాయి. ఎదుటివారి బాధలను అర్థం చేసుకోవడం, వాటి నివారణకు సంసిద్ధత కలిగియుండటము ఇవన్నీ మనిషి హృదయంలో ఆధ్యాత్మిక భావసంవేదనను పోషిస్తాయి. ఇటువంటి వ్యక్తిత్వాలు మాత్రమే కుటుంబానికి, సమాజానికి ఉపయోగకరంగా, యోగ్యమైనవిగా ఉంటాయి. ఈ దిశలోనే విశ్వవిద్యాలయ శిక్షణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

**6. రాష్ట్రీయత– సామాజికత:** విద్యార్థుల్లో రాష్ట్రీయత జాగృతమై వారంతా రాష్ట్రీయ కర్తవ్యాలను గుర్తించాలి. వారి వ్యక్తిత్వంలో సామాజికత వికసించాలి. విద్యార్థులు సామాజిక కర్తవ్యాలను పాటించేవిధంగా ఇక్కడ ఎన్నో ప్రయోగాలు, ప్రణాళికలు అవలంబిస్తారు. మరెక్కడా పెద్దగా కనిపించని, ఇక్కడ వికసించే సద్గుణం సామాజిక కర్తవ్యాలను నిర్వహించాలనే ప్రతిబద్ధత.

**7. మానవీయత – వసుధైకవాదం:** మనిషిలో వసుధైవ కుటుంబకం అనే బోధ కలిగించే భావనలు. ఇక్కడి విద్యార్థులలో సహజంగానే ఈ తత్త్వం వికసిస్తుంది. వ్యక్తిగత జీవితంలో వికసించిన కర్తవ్య పరిధి ప్రాపంచిక జీవితం వరకు విస్తరిస్తుంది. ఆగ్రహ–దురాగ్రహాలకు దూరంగా నిలచి మంచి మనుషులుగా ఉండాలనెడి తలంపులకు కట్టుబడి ఉంటేనే ఇది కుదురుతుంది. ఈ పంథాలో పయనించే రీతిలో వ్యవస్థ శిక్షణా ప్రణాళికలతో రూపొందించబడింది.

**8. ప్రామాణికత:** మొదటి నుండే విశ్వవిద్యాలయ ధ్యేయంగా ఇది స్వీకరించబడింది. ఇక్కడి విద్యార్థులు ఎక్కడున్నా, ఎక్కడ పని చేసినా వారి ప్రామాణికత మెచ్చుకోదగ్గదిగా ఉండాలి. మిగిలినవారితో పోలిస్తే విడిగా, స్పష్టంగా తెలియాలి. ఇన్నేళ్ళూ అదే జరిగింది, ఇక ముందూ అదే జరుగుతుంది. ఎందుకంటే శిక్షణ ప్రక్రియ మరియు ప్రణాళిక మొత్తం ఈ లక్ష్యంతోనే రూపకల్పన చేయబడినది.

### జీవనవిద్య యొక్క ఎనిమిది మంత్రాలు

శిక్షణ ప్రక్రియకు సంబంధించిన ఎనిమిది మంత్రాలతో పాటు ఇక్కడ జీవనవిద్యకు సంబంధించిన ఎనిమిది మంత్రాల సాధన కూడా చేయించబడుతుంది. దీనికోసం జీవన నిర్వహణకు తగ్గ సమర్థవంతమైన వ్యవస్థ రూపొందించబడింది. అధ్యయనం తోపాటు జీవన–సిద్ధాంతాల పట్ల సరైన, సమగ్రమైన జ్ఞానం ఉండి తీరాలి. మొదటి నుండి విద్యార్థులు దీనిపట్ల ఉత్సాహాన్ని కనబరిచారు, ఆ ఉత్సాహం వృద్ధిచెందుతూనే ఉంది. జీవితంలో ఉన్నత శిఖరాలు చేరే యాత్రలో ఎదురయ్యే సవాళ్ళు, ఒత్తిళ్ళను ఎదుర్కొనే పద్ధతుల్ని నేర్చుకుంటారు. అందుకోసం ఈ ఎనిమిది సూత్రముల సమర్థవంతమైన సాధన విద్యార్థుల చేత చక్కగా చేయించబడుతుంది. ఈ అభ్యాసం వారిని నిపుణులనేగాక విజయవంతులను చేస్తుంది.

**1. ప్రతిబద్ధత:** జీవన ప్రబంధన ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు నియమాలకు కట్టుబడి ఉండే ప్రశిక్షణనిస్తారు.

**ఆత్మజ్ఞానం (సిద్ధి) కోసం యత్నించేవారు వేలమందిలో ఏ ఒక్కరో ఉంటారు**

సమయానికి, మాటకి కట్టుబడి ఉండడం; వైఫల్యాలకి కృంగిపోకుండా విజయం వైపుకి నిరంతరం దూసుకెళ్ళడానికి ప్రయత్నిస్తూ ఉండాలి.

**2. ఆదర్శంగా రూపొందాలి:** దీని ఉద్దేశ్యం –మనం ఏదైనా సరే ఊరికే చెప్పడం కాదు, చేసి చూపిస్తాము అని. ఈ సూత్రాన్ని పాటించే విద్యార్థులు వారు స్వయంగా ఆదర్శవంతంగా మారి ఇతరులు తమని ఆదర్శంగా భావించేంతగా కృషిచేస్తారు.

**3. సంఘటిత కృషి (టీమ్ వర్క్):** సహయోగం, సహకారం, భాగస్వామ్యం వికసించకపోతే వ్యక్తిలో సామాజిక భావన కూడా వికసించదు. అందుకే ఇక్కడి విద్యార్థులు తమ పనుల్లో ఇతరులను కూడా కలుపుకుంటారు. భాగస్వామ్యానికి ప్రేరణను ఇస్తూ ఇతరుల పనుల్లో కూడా వీరు పాలుపంచుకుంటారు.

**4. మౌనం:** సఫల వ్యక్తిత్వం కలవారు ఎప్పుడూ స్థిరత్వాన్ని, శాంతిని పోషిస్తూంటారు. విద్యార్థులు ఈ సత్యాన్ని ఇక్కడ అనుభూతి చెంది, వారంతా స్వయముగా పాటించడానికి క్రియాశీలురై ఉంటారు.

**5. చింతన:** సాధారణంగా అందరూ పరీక్షల గురించో, ఇల్లు, కుటుంబం గురించో చింతిస్తూనే ఉంటారు. ఈ చింత మనిషి మానసిక సామర్థ్యాన్ని హరిస్తుంది. దీనికి వ్యతిరేకంగా చింతన అనేది మానసిక శక్తులను వికసింపజేస్తుంది. దీనికోసం రోజూ రాత్రి కొంతసేపు మౌనంగా ఉండి ఆరోజు చేసిన పనులన్నిటినీ నిష్పక్షపాతంగా సమీక్షించుకోవాలి. ఏవైనా లోటుపాట్లున్నా యేమో గమనించుకోవాలి.

**6. సంతులన:** పని, మంచి–చెడు, కుటుంబం, సంబంధాలు మున్నగు పలు విషయాల మధ్య సమన్వయం, సంతులన ఏర్పరచుకోవా లనేది నేర్చుకున్నవారు, నేర్పేవారు మాత్రమే విజయాన్ని సాధిస్తారు.

**7. సమయం:** డబ్బు, పరిశ్రమ మాత్రమే ఉంటే వికాసం సాధ్యం కాదు. వీటితోపాటు సరైన పనికి సరైన సమయాన్ని ఎన్నుకుని, ప్రతిక్షణాన్ని ఉపయోగించుకోవడం చాలా ముఖ్యం.

**8. గీత, ధ్యానం:** క్రమం తప్పకుండా కొనసాగే గీత మరియు ధ్యాన తరగతుల ద్వారా విద్యార్థులు కర్మకౌశలంతోపాటు స్థిరత్వం, ఏకాగ్రతలు కూడా నేర్చుకుంటారు. అందుకే వీరంతా 4 గంటలు పట్టే పనిని 2 గంటల్లోనే పూర్తిచేస్తారు.

శిక్షణ మరియు జీవితానికి సంబంధించిన ఈ ఎనిమిదేసి మంత్రాల ద్వారా ఇక్కడ వ్యక్తి నిర్మాణం ప్రక్రియ పూర్తవుతుంది. ఈ ప్రక్రియ గుండా ప్రయాణించిన వ్యక్తిత్వాలు స్వతహాగా కుటుంబ నిర్మాణం మరియు సమాజ నిర్మాణాల బాధ్యత స్వీకరించడానికి సంసిద్ధంగా ఉంటారు. విశ్వవిద్యాలయం యొక్క వ్యవస్థ, యంత్రాంగం గురించిన తథ్యాలు ఇక్కడ చెప్పబడ్డాయి. కాని భవిష్యత్తులో వికాస యాత్ర కొనసాగాలంటే మాత్రం పరిజనుల సహయోగ, సహకారాలు కావాలి. మన పరిజనులంతా కలిసి ఇంటింటికీ వెళ్ళి, విశ్వవిద్యాలయాలకీ, మహావిద్యాలయాలకీ వెళ్ళి విద్యార్థులను ఇక్కడ ప్రవేశం తీసుకునేందుకు ప్రేరితులను చేసేంతవరకు చెప్పుకోదగ్గ ఫలితాలు ఉండవు.

ఎన్నో సంవత్సరాల అనుభవంతో మనందరం ఒక విషయాన్ని తెలుసుకున్నాం. మనము ఎదగడానికి, ఇతరులను లేవనెత్తడానికి ఎంతో సాధన, కృషి నిరంతరం చేస్తూ ఉండాలి. అదే క్రిందకు పడేయడానికి ఒక్క తోపుతోస్తే చాలు. మనలో ప్రతి ఒక్కరి వ్యక్తిత్వాన్నీ సవరించడానికి యుగఋషి పూజ్య గురుదేవులు యుగయుగాలుగా తాము ఆర్జించిన తపస్సును మనకోసం ధారపోశారు. ఇప్పుడు మన వంతొచ్చింది.

రాబోయే తరాలను, మన పిల్లలను విశ్వవిద్యాలయంలో ప్రవేశం తీసుకునేట్టుగా ప్రేరితులను చేస్తే ఆ పని సులువుగా అవుతుంది. మంచి మనుషులు కావాలి అన్న పిలుపు నలుదిక్కులా వినిపిస్తోంది. కాని మంచి మానవుల్ని రూపుదిద్దేందుకు ఎవరూ ఏ ప్రయత్నమూ చేయటం లేదు. గాయత్రీపరివారం వారి సహయోగంతో దేవసంస్కృతివిశ్వవిద్యాలయ పరిసరాల్లో ఈ మేరకు తిరుగులేని ప్రయత్నం కొనసాగుతోంది. ఈ ప్రయత్నాలు ఫలించడానికి, పూర్తికావడానికి మీలో ప్రతి ఒక్కరి ప్రయత్నం తోడయి తీరాలి. ఈవిధంగా అందరం కలిసి 1) వ్యక్తినిర్మాణం 2) కుటుంబ నిర్మాణం 3) సమాజ నిర్మాణాల సంకల్ప సాధనను పూర్తిచేయగలుగుతాము.

*– అఖండజ్యోతి, జూన్ 2015*

*అనువాదం: యం.వి. ప్రసాద్*

**భగవదనుగ్రహం లేనిదే సద్గురువును ఆశ్రయింపజాలరు**

ఆయుర్వేద వైద్యం-3

# చేదు వేపతో అనేక లాభాలు



వృక్షాలలో అన్నింటికన్నా మిక్కిలి చేదుగా ఉండేది వేప. కాని దానిలోని విశిష్టగుణాల వలన రోగచికిత్స జగత్తులో దానికి ఒక ప్రత్యేక స్థానమివ్వబడింది.

1. వేపాకురసం తీసికొన్నచో రక్తాన్ని శుద్ధి పరుస్తుంది. తామర, గజ్జి, చర్మంపై తెల్లని మచ్చలు మరియు రక్తపోటు వేపాకుల రసమును సేవించిన నివారింపబడతాయి.
2. వేపాకు చీడపీడలను చంపివేస్తుంది. అందువలన దీని ఆకులను బట్టల మధ్య మరియు ధాన్యంలో పెట్టి ఉంచుట పరిపాటి.
3. నిత్యము పది వేపాకులను నమిలి తిన్నచో రక్తంలోని దోషాల్ని హరించివేస్తుంది.
4. వేపచెట్టులోని 5 భాగాలైన బెరడు, చిన్న కొమ్మలు, పూలు, ఆకులు మరియు విత్తనాలు ఉపయోగకరములు.
5. ఇన్ని లాభాలు కలిగి ఉన్న వేపను మన పురాణగ్రంథాల్లో అమృతంతో సమానంగా వర్ణించారు. అమృతమనగా ఏమి? చనిపోయెడివానిని పునర్జీవితుల గావిస్తుంది. గ్రుడ్డి వారికి చూపునిస్తుంది. నిర్బలులను, బలవంతుల గావిస్తుంది. వేప మనిషిని బలిష్ఠుని గావిస్తుంది. చెట్లకు, మొక్కలకు కూడా శక్తినిస్తుంది. వేపాకు కషాయాన్ని తయారుచేసి అందజేసినచో పై లాభాలు ఒనగూరుతాయి.
6. వేప–నేత్రాలను, చెవులను, ముక్కును, గొంతును, ముఖాన్ని పరిశుభ్రంగా, రోగరహితంగా, చైతన్యవంతంగా ఉంచుటలో తోడ్పడుతుంది.
7. వేపనూనె "ఫ్యాటీ" ఆమ్లములతో కూడి, జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. దీనిలోనున్న విటమిన్ 'ఇ' దీనికి తోడ్పడుతుంది. ఇది జీర్ణకోశాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుటలో తోడ్పడుతుంది. దానిలోని కణజాలాన్ని పునర్జీవింపజేస్తుంది.
8. పొట్టలో సూక్ష్మక్రిము లున్నచో వేప చిగురుటాకులరసంలో తగు మోతాదులో తేనెను కలిపి తీసుకొన్నచో క్రిములు నశిస్తాయి. నీటిలో వేపనూనె కొన్ని చుక్కలను వేసికొని తేనీరులా త్రాగవచ్చును. పిల్లలు 5 చుక్కలు, పెద్దలు 8 చుక్కలకు మించి సేవించరాదు.
9. వేపాకులను లేశపాటి ఇంగువతో కలిపి నూరి సేవించినచో పొట్టలోపలి క్రిములు నశిస్తాయి.
10. కంటిలోని శుక్లములు మరియు రేచీకటి నివారణకై వేప నూనె చుక్కలను కొద్దిగా కాటుకలా కంటిలో జాగ్రత్తగా వేయాలి. కుడికంటిలో ఎఱ్ఱగా అయినచో ఎడమకాలి వ్రేళ్ళపై వేపాకులను నూరి పట్టీగా వేయాలి. అదే ఎడమ కంటిలో అయినచో కుడికాలి వ్రేళ్ళపై పట్టీగా వేయాలి. అప్పుడు కంటిలోని ఎఱుపు నివారింపబడుతుంది. చెవిలో నొప్పి ఉన్నచో, చీము కారుచున్నచో వేపాకు లేక వేప విత్తులను నూరి గుజ్జుగా చేసి దీని రసాన్ని చెవిలో వేయాలి. చెవిలో పురుగు ప్రవేశించినచో వేపాకులరసాన్ని ఉప్పుతో కలిపి చుక్కలు చుక్కలుగా చెవిలో వేసినచో పురుగు వెంటనే చనిపోతుంది. అవసరాన్ని బట్టి రెండవరోజు కూడా దీనిని చేయవచ్చు. చెవిలో చీము వచ్చుచున్నచో వేపనూనెలో కొంచెము తేనె వేసి చెవిలో పోసి శుభ్రము చేసిన చీము నివారింపబడుతుంది.
12. జలుబు, దగ్గు పట్టినచో వేపాకులను తేనెలో కలిపి నూరి తినండి. తగ్గిపోతుంది. గొంతులోని గురగుర కూడా పోతుంది.
13. హృదయరోగులకు వేప రామబాణంలా పనిచేస్తుంది. వేపనూనెను సేవించండి. వేపాకును నూరి ఛాతి మీద లేపనంగా పూయండి. ఎక్కువ లాభకారిగా పనిచేస్తుంది.
14. దంతాలను వేపపుల్లతో తోముకోండి. కాల్చిన వక్కపొడి, కాల్చిన బాదంపప్పు పొట్టు తీసి 100 గ్రా॥, మెత్తని

**భగవంతుడిచ్చేది నశించదు - మానవులిచ్చేది నిలవదు**

మట్టి 20 గ్రా॥, కరక్కాయ, నల్లమిరియాలు కొంచెం, 5 గ్రా॥ లవంగాలు, 5 పెద్ద యాలుకలు, $^1/_2$ గ్రా॥ పిప్పరమెంట్ మెత్తగా నూరి జల్లించి వాడాలి. దీనిని ఉపయోగించినచో దంతాల అన్ని బాధలు, వాపు, పుచ్చుట, దుర్గంధం తొలగిపోతాయి.

15. పొట్టలో అజీర్తితో బాధపడుచున్నచో వేపవిత్తులను తిన్నచో నిల్వ ఉన్న మలము కూడా వెలికివస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది, ఆకలిని పెంచుతుంది. అపక్వ ఆహారాన్ని సేవించినప్పుడు పిత్తము ప్రకోపిస్తుంది. దీని నివారణకై వేపచెట్టు బెరడు, సొంఠి, మిరియాలు సమపాళ్ళలో కలిపి నూరి 8 నుండి 10 గ్రాములు ఉదయం-సాయంత్రం నీటితో సేవించిన నివారణ అవుతుంది. మూడు-నాల్గు రోజులలో పొట్ట పరిశుభ్రమవుతుంది.

16. ముతికినీటిలో దోమలు, క్రిములు చేరిన చోట రోగాలు శరవేగంగా వ్యాప్తిచెందుతాయి. దీనిని కూడా వేపతో నివారింపవీలున్నది. 5 లవంగాలు, 5 పెద్ద యాలుకలు, 5 పెద్ద వేపవిత్తులు కలిపి గుజ్జుగా చేసి 50 గ్రాముల నీటిలో కలిపి కొంచెంగా వేడి చేయాలి. ఒక్కసారిగా తీసికోండి. దీనిని రెండు గంటల కొక పర్యాయం తయారు చేసి ఇస్తూ ఉండాలి. దీనితోపాటు చేతులకు, పాదాలకు వేపనూనెతో మాలిష్ చేస్తుండాలి. భయం తొలగిపోతుంది. ఏ రోగియైనా తెలివిలోనికి రానిచో వేపాకులను నూరి పొట్టపై పట్టీగా వేయాలి. అప్పుడు తగ్గిపోతుంది.

*- అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## కీర్తికి మూలం - ఒకటి ధన సదుపయోగం

*ఒక నగరములో ధనికుడున్నాడు. అతడు చాలా ఉదారస్వభావుడు. ఆయన వద్ద ఆదాయ-వ్యయముల చూచెడి వ్యక్తి ప్రతి పైసాను లెక్కించెడి మనస్తత్వం కలిగినవాడు. ఒక పర్యాయం ఆ ధనికుడు లక్ష్మీసింహ అను పేరు గల పేదవానికి వెయ్యి రూపాయలను అప్పుగా ఇచ్చుటకు అంగీకరించి మాట ఇచ్చాడు. ఈవిధంగా ధనికుని వద్ద మాట తీసికొని, ధనికుని ఆదాయ వ్యయాల చూచెడివాని వద్దకు వెళ్ళి డబ్బును అడిగాడు. లెక్కలు వ్రాసెడి వ్యక్తి లక్ష్మీసింహతో ఇలా అన్నారు- "డబ్బును తీసికొని వెళ్ళు! కాని ఇప్పుడు తీసికొన్న అప్పును ఈలోకంలోనే చెల్లిస్తావా లేక పైలోకంలో చెల్లిస్తావా? అప్పుడు లక్ష్మీసింహకు ఇట్లు అనిపించింది. పైలోకాన్ని ఎవరు చూచారు. కావున పైలోకంలోనే అప్పును తీర్చుతాను అన్నాడు. ఈ మాట చెప్పి లక్ష్మీసింహ ఇంటికి తిరిగి వెళ్ళాడు. అతని అంతరాత్మ అతని మాటలను తప్పుబట్టసాగింది.*

*దీనితో అతని మనస్సు బరువెక్కింది. దీనిని తగ్గించుకొనే నిమిత్తం లక్ష్మీసింహ ఒక సంత్ మహాశయుని ఆశ్రయించి తన బాధను చెప్పుకొన్నాడు. తదుపరి లక్ష్మీసింహ సంత్‌ను ఇలా అడిగాడు. "మహరాజ్! పైలోకంలో నేను ఈ అప్పు నుండి విముక్తుడనెట్లు కాగలను?" సంత్ సమాధానమిస్తూ "కుమారా! ఈలోకం-పైలోకం అనగా శుభ-అశుభ లోకాలు చేసెడి కర్మల నుండి లభిస్తాయి. నీవు ఇలా చెయ్యి! ఈ డబ్బుతో ఒక చలివేంద్రం ప్రారంభించు! బాటసారులకు ఉచితంగా దాహార్తిని తీర్చు. నీ వద్దకు వచ్చి పోయేవారు హృదయపూర్వకంగా నీకు ధన్యవాదాలు చెపుతారు. అప్పుడు ఈ శుభకర్మ నీతోపాటు పైలోకానికి వస్తుంది!" లక్ష్మీసింహ ఇదే రీతిగా చేయసాగాడు. ఈ విషయాన్ని విన్న ధనికుడు లక్ష్మీసింహను కలిసి ఇలా అన్నాడు. "సోదరా! నీవు నా ధనాన్ని సదుపయోగం చేసి ఈలోకంలోనే ఋణవిముక్తుడవైనావు. ఇప్పుడు నేనిచ్చిన ధనాన్ని నీవు తిరిగి నాకు చెల్లించవలసిన అవసరం లేదు'.' లక్ష్మీసింహుని ఉదారత కారణంగా తదుపరి ఆ ప్రదేశంలో అచ్చటి ప్రజలు ఒక చెఱువును త్రవ్వించి ఆ సరస్సుకు లక్ష్మీసింహసరస్సు అని పేరు పెట్టారు.*

*ఇదే ధన సదుపయోగంతో ఒనగూరెడి అత్యంత విలువైన లాభం.*

*- అనువాదం: ఎ. శారద*

**లోకానికి వెరవకు - నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించు**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 14

## శ్రీ ఇ. రామకేశవులు, కర్నూలు



6 వ తేది ఏప్రిల్ 1951లో శ్రీ చెన్న నాయుడు - చెన్నమ్మ దంపతులకు ఉయ్యాలవాడగ్రామం, కోవెలకుంట్ల తాలూకా, కర్నూల్లో రామకేశవులు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలో పూర్తిచేసి కోవెలకుంట్లలో ఉన్నత విద్యాభ్యాసం బి.ఎ. పూర్తిచేశారు.

ఉద్యోగం పురుషలక్షణ మనెడిదానిని నమ్మి పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటులో (పి.డబ్ల్యు.డి) వర్కు ఇన్‌స్పెక్టర్‌గా చేరి ప్రభుత్వ కొలువులో ప్రవేశించారు. అటు పిమ్మట రాష్ట్ర సర్కారు రెవెన్యూ 2009లో పదవీవిరమణ చేశారు.

చిన్ననాటినుండి రామకేశవులు గారిలో దైవం పట్ల విశ్వాసము, ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉన్నాడు. దీనితో సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయకుడు ఘంటసాలగారి భగవద్గీత గానం పట్ల మిగుల ఆకర్షితుడై దానిని లోతుగా అభ్యసించాడు. ఘంటసాలగారి సుమధురగానాన్ని అనుకరించి శ్రోతల మెప్పు పొందవలయుననెడి తీవ్రకాంక్షతో తన గాత్రానికి అనేకానేక మెరుగులు దిద్దుకుంటూ ఎట్టకేలకు నేటికి శ్రోతల రంజింప జేయుటలో కొంతమేరకు కృతకృత్యులైనారు.

ఆనోట ఆనోట గాయత్రీపరివార్, గాయత్రీతీర్థ్, శాంతికుంజ్ విశిష్టతల విని కర్నూలు చుట్టుప్రక్కల గాయత్రీ యజ్ఞాలలో పాల్గొని మరింత ప్రభావితుడై, ప్రేరణనొంది మొదటిసారి అక్టోబరు 2014 లో శాంతికుంజ్- హరిద్వార్‌లో జరిగిన 5 రోజుల ప్రశిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. ఈ శిబిర ప్రభావంతో రామకేశవులుగారు గాయత్రీపరివార్ కార్యకలాపాల పట్ల మరింతగా ఆకర్షితులై తనలో నివురుగప్పి ఉన్న ఆధ్యాత్మిక జ్ఞానము వికసితంకాగా మరింత సమయాన్ని గాయత్రీపరివార్ లక్ష్యాల వ్యాప్తికి వెచ్చించాలని దృఢనిర్ణయం గైకొన్నారు. ఈ 5 రోజుల శిబిరం ఆఖరిరోజున "యుగశక్తి గాయత్రి" మాసపత్రికను కర్నూలు పట్టణము మరియు దాని చుట్టుప్రక్కల మరింత వ్యాప్తిచేయాలనెడి లక్ష్యంతో పట్టువదలని విక్రమార్కునిలా "యుగశక్తి గాయత్రి" మాసపత్రికను ఇంటింటికి చేర్చెడి ప్రయత్నంలో సంలీనమై తీవ్ర కృషి చేయు చున్నారు. దీనిలో భాగంగా 2014 డిసెంబరుమాసములో కడపజిల్లాలో ప్రారంభించిన 24 కుండముల గాయత్రీయజ్ఞ నిర్వహణలో ప్రముఖపాత్ర వహించి దాని విజయానికి అహర్నిశలు కృషిచేశారు.

పైనుదహరించిన రీతిలో శ్రీరామకేశవులుగారు "యుగశక్తి గాయత్రి" మాసపత్రికను ఇంటింటికి చేర్చెడి లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తూ అందరిని అబ్బురపరుస్తూ 6 మాసముల స్వల్పవ్యవధిలో పత్రికకు 580 మంది క్రొత్త చందాదారులను చేర్పించుట ఒక చక్కని స్ఫూర్తిదాయక సంఘటన. దీనికి గుర్తింపుగా 17.05.2015 న దక్షిణభారత శాంతికుంజ్ ప్రతినిధి శ్రీగౌడ్‌జీ మరియు దక్షిణభారత ప్రధాన సంచాలకులు శ్రీఅశ్విని సుబ్బారావుగారి చేతుల మీదుగా సత్కారాన్ని పొందారు. "సాధన చేయుము రా నరుడా సాధ్యము కానిది లేదురా" అనెడి తన సంగీత గురువు కీ॥శే॥ ఘంటసాల ఎలుగెత్తి పాడినదానిని తన మనంబున దాల్చి దానిని నిజం చేసి తన గురువుకు ఘనంగా గురుదక్షిణగా ఇచ్చిన ప్రియ రామకేశవులు సదా అభినందనీయుడు - ఆదర్శవాది - కార్యసాధకుడు.

ఇట్టి మన చిట్టి-పొట్టి రామకేశవులు "ఇంతింతై వటుడింతై" అన్నరీతిలో వామనునిలా ఎదుగుచూ ఆయురారోగ్యాలతో, పూర్తి సంతృప్తితో ఎదుగుచూ, తన లక్ష్యసాధనలో మరింతగా రాణించాలని కోరుకుంటూ అందుకు తగిన శక్తిని ఆ గాయత్రీమాత అందించుగాక!

## శ్రీ దామర్ల బాపయ్య, చీరాల



దామర్ల బాపయ్యగారు 22 జూన్ 1945 లో శ్రీ సుబ్బారావు- అక్కమ్మ దంపతులకు నేలపాడుగ్రామం, తెనాలి తాలుకా, గుంటూరుజిల్లాలో మధ్య తరగతి చేనేత కుటుంబాన జన్మించారు. విద్యాభ్యాసమంతా తెనాలి తాలుకాలోని తురుమెళ్ళగ్రామం హైస్కూలునందు

**కష్టానికి వెరచేవాడు సన్యాసి కానేరడు**

పూర్తిచేసి, గుంటూరుపట్టణంలోని వైద్యకళాశాలలో శానిటరీ ఇన్‌స్పెక్టరు శిక్షణను తీసికొని ప్రజారోగ్యశాఖలో కొలువుతీరారు. వృత్తిలో అంచెలంచెలుగా ఎదుగుచూ పదోన్నతిపై తెలంగాణా లోని వివిధ జిల్లాల్లో హెల్త్‌ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తూ తన వృత్తి నైపుణ్యాన్ని పెంచుకొనెడి దిశగా ప్రజా సంబంధాల విషయంలో పి.జి. డిప్లొమా పూర్తిచేశారు.

ఆధ్యాత్మిక దిశగా తన తండ్రి నుండి అందిపుచ్చుకున్న జ్ఞానాన్ని ఆధారంగా చేసికొని విశ్వహిందూపరిషత్ సంస్థతో కలిసి పనిచేసి అనేకానేక కార్యక్రమాల చేపట్టి హిందూ ధర్మ ప్రచారంలో చక్కని కృషిసల్పారు.

1966 లో కుమారి తులసీగారితో వివాహమైంది. 2003 జూన్‌లో పదవీవిరమణ చేసి చీరాల పట్టణంలో స్థిరపడ్డారు.

1996 లో సింగరేణికాలరీస్ పరిధిలో పంచకుండీ గాయత్రీయజ్ఞము ద్వారా శ్రీబాపయ్యగారు గాయత్రీ పరివార్‌లో ప్రవేశించుట జరిగింది. తరువాత 1997 లో చీరాలలో నిర్వహింపబడిన 'విరాట్ సంస్కార మహోత్సవాల్లో' పాల్గొన్నారు. అటుపిమ్మట శాంతికుంజ్‌లో ఒక నెల యుగశిల్పి సాధనాశిబిరంలో పాల్గొన్నారు. సర్కారుజిల్లాలలో అనేక ప్రాంతాల్లో గాయత్రీయజ్ఞాలు చేయించారు. తద్వారా గాయత్రీ జ్ఞాన వ్యాప్తికై బహుముఖ కృషిచేయుట జరిగింది.

తదుపరి సత్యన్నారాయణవ్రతకథల వ్యాప్తికి మరియు పూజ్యగురుదేవులందజేసిన 10 సంస్కారాల వ్యాప్తికై విశేషంగా కృషిచేయుచున్నారు. ఆనాటినుండి యజ్ఞము సంస్కారాలు నిర్వహించుటలో నిష్ణాతులై పరివార్‌లో తమకంటూ మంచి గుర్తింపును సంపాదించుకొన్నారు.

సాధుస్వభావం కలిగి, వివాదాలకు దూరంగా ఉంటూ పరివార్ సభ్యులకు తలలో నాలుకలా మసలుకొంటారు.

వీరికి, వీరి పరివారానికి చక్కని ఆయురారోగ్యములు ప్రసాదించి మరింతకాలం గాయత్రీపరివార్ కార్యక్రమాలను చేసెడి శక్తినందించవలసిందిగా యుగశక్తి గాయత్రీ- పూజ్య గురుయుగ్మాన్ని ప్రార్థించుచున్నది.

## బాల్యంలోని సంస్కారాలు వ్యక్తిని మహోన్నతంగా తీర్చిదిద్దుతాయి

*బాల్యంలో గాంధీజీకి ఆటలపట్ల మక్కువ లేదు. కానీ పాఠశాల నియమావళి పట్ల గౌరవంతో ఆయన నిర్దేశిత సమయానికి ఆటల మైదానానికి వెళ్తూ ఉండేవాడు. ఆరోజు శనివారం ఉదయం తరగతులు జరిగాయి. సాయంకాలం 4 గంటలకు ఆటలు ప్రారంభమయ్యాయి. బాలుడైన మోహన్ వద్ద గడియారం లేదు, పైపెచ్చు వర్షం పడుతూ ఉంది. దీనితో ఆయనకు సమయం తెలియక, ఆటలకు ఆలస్యంగా వెళ్ళాడు. ప్రధానోపాధ్యాయుడు ఆలస్యానికి కారణమడగగా, గాంధీ నిజం చెప్పినా, ప్రధానోపాధ్యాయుడు ఆయన మాటను విశ్వసించక ఒక అణా జరిమానా విధించాడు.*

*గాంధీ ఏడ్వసాగాడు. అప్పుడు ప్రధానోపాధ్యాయుడు ఇట్లన్నాడు "మీ నాన్నగారు చాలా గొప్పవాడు. ఆయన ఒక అణా జరిమానాను చెల్లించుట గొప్ప విషయమేమి కాదు". దీనికి జవాబిస్తూ గాంధీ "నేను జరిమానా చెల్లించుటకు దుఃఖించలేదు. కాని నాకు అబద్ధం తెలిసినందుకు ఏడుస్తున్నాను" అన్నాడు. అమాయకంగా ఉన్న, సున్నితమనస్కుడైన బాల గాంధీ సత్యనిష్ఠకు అచ్చెరువొంది ప్రధానోపాధ్యాయుడుగారు గాంధీకి విధించిన జుల్మానాను మాఫీచేశాడు.*

*బాల్యం నుండి చిన్న చిన్న సంఘటనలు వ్యక్తిని ఎచ్చటెచ్చటికో చేర్చుతాయి. సత్యాన్ని మాత్రమే చెప్పాలనెడి శిక్షణను మోహన్‌దాసు తన తల్లిదండ్రుల నుండి అందిపుచ్చుకున్నాడు. దీనిని సత్యహరిశ్చంద్ర నాటకాన్ని చూచుట ద్వారా తన జీవితంలో ధారణ చేసికొన్నాడు. వ్యక్తిని శ్రేష్ఠవంతుని గావించుటలో బాల్యం నుండి అబ్బిన సుసంస్కారాలు ప్రముఖ పాత్రను పోషిస్తాయి.*

*- యుగనిర్మాణ యోజన ఫిబ్రవరి 2015*

*అనువాదం: ఎ. శారద*

## ధనము శరీరము అశాశ్వతాలు

# 9 రోజుల సంజీవని సాధనాశిబిరము - ప్రవచనముల పాఠము-2

*గత సంచిక తరువాయి...*

### 14.05.2015 - డా॥ చిన్మయపండ్యాగారి ప్రవచనం "జీవించేకళ" (ఆర్ట్ ఆఫ్ లివింగ్)

పరమపూజ్య గురుదేవులు, పరమ వందనీయ మాతాజీల సూక్ష్మసంరక్షణలోనున్న మనమంతా సమానులమే. నాతో కలిసి గాయత్రీమంత్రాన్ని కృపతో ఉచ్చరించండి. ఇది సూర్యమంత్రం

"ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్"

మిత్రులారా! మనమంతా ఒకే తండ్రి బిడ్డలం. మిమ్ముల చూచినంతనే తిరుపతి బాలాజీ గుర్తుకు వస్తున్నాడు. వారి భక్తులైన మీ అందరికీ నమస్కారములు. 1971లో శాంతికుంజ్ స్థాపన జరిగింది. అనేకమంది భక్తజనులు తమ అంశ దానాలను భక్తి శ్రద్ధాపూర్వకంగా సమర్పిస్తున్నారు. వారిలో ఒక పేదరాలు ముందుకు వచ్చి తన వద్దనున్న రూ॥$2^1/_2$లను పూజ్యగురుదేవుల చేతిలో పెట్టి వినమ్రంగా నమస్కరించింది. దీనిని అత్యంత ప్రేమ శ్రద్ధలతో స్వీకరించిన గురుదేవులు ఆ చిన్న మొత్తాన్ని కలశం మధ్యలో పెట్టారు. అనేకమందికి శాంతికుంజ్ తమ రెండవ గృహం.

మిత్రులారా! చావు పుట్టుకలు మనిషి చేతిలో లేవు. కాని పుట్టుకకు, చావుకు మధ్య ఉన్న కాలాన్ని వినియోగించుకొనుట మనిషి చేతిలోనే ఉన్నది. రాముడు మరియు కృష్ణుడు జీవించారు. వీరికి భిన్నంగా రావణుడు మరియు శిశుపాలుడు జీవించారు. మొదటి ఇరువురు లోకకళ్యాణ సాధనను సంకల్పంగా తీసికొని జీవించగా, రెండవ ఇరువురు స్వార్థమే పరమార్థంగా చేసికొని, లోకకంటకులుగా జీవించారు. కావున లోకకళ్యాణకారకులుగా జీవించుదామా లేక లోకకంటకులుగా జీవించుదామా అనేడిది మనం నిర్ణయించుకొనాలి. తదనుగుణంగా జీవించాలి. దీనినే జీవించేకళగా మనం పిలుస్తాం. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. ప్రత్యేకులు ఎవ్వరూ లేరు. మన జీవన విధానాన్ని అనుసరించి భగవంతుని ప్రేమకు పాత్రులమవుతాం. వెలుగు మార్గాన్ని, జ్ఞానమార్గాన్ని మూస్తే మిగిలేది అంధకారము, అజ్ఞానం మాత్రమే, దీనికి తప్పెవరిది? మనదే!

ఒక సింహం తన పిల్లకు జన్మనిచ్చి చనిపోయింది. ఆ సింహంపిల్ల లేళ్ళ గుంపులో చేరిపోయి వానితోనే పెరిగింది. తన జాతి మూలాలు తెలియక లేడి గుణాలను అలవర్చుకుంది. కొన్నాళ్ళకు లేళ్ళ గుంపులోనున్న ఈ సింహపుపిల్ల అసలు జాతి సింహం కంటపడింది. ఈ సింహంపిల్లను పట్టుకుని తిరిగి తన జాతిలోనికి తెచ్చింది. అట్లే అతి సామాన్యులు సైతం మహాపురుషుల చెంతచేరినప్పుడు, వారి దృష్టిలో నున్నప్పుడు- వివేకానందునిలో జాగృతిని నింపినట్లు ఈ సామాన్యులలో కూడా జాగృతిని నింపుతారు. మనలో మంచి చెడు రెండూ ఉన్నాయి. మహాపురుషులు మనలోని చెడును తొలగించి మంచిని వెలికితీస్తారు. అదేవిధంగా నారదుడు - వాల్మీకిని తయారుచేశాడు. బుద్ధుడు వేశ్యయైన ఆమ్రపాలిని మహాసాధ్వినిగా మార్చాడు. 107 మంది బొటనవ్రేళ్ళను కత్తిరించిన అంగులీమాలుడిని బౌద్ధభిక్షువుగా మార్చివేశాడు బుద్ధుడు. దుర్యోధనుడు, యుధిష్ఠిరుడు ఒకే గురువు ద్రోణుని వద్ద విద్య నేర్చుకున్నారు, కానీ ఒకరు ధర్మానికి, సహనానికి ప్రతీకగా మారగా; రెండవవారు అధర్మానికి, అసహనానికి ప్రతినిధిగా మారారు. ప్రతివారిలోని అంతరాత్మ వారు దారి తప్పినప్పుడు వారిని హెచ్చరిస్తూ ఉంటుంది. అంతరాత్మ హెచ్చరికను ఖాతరు చేయనివాడు అపమార్గాన్ని అనుసరిస్తాడు. హెచ్చరికను పాటించినవాడు సవ్యమార్గాన్ని అనుసరిస్తాడు. సమూహాలలో ఉండికూడా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాం. అశాంతితో రగిలిపోతున్నాం. "ధనమూల మిదం జగత్!' ఇదే మూలమంత్రమని దీనినే అనుక్షణం జపిస్తున్నాము. అసురుల మధ్య అనుక్షణం మనిషిలా ఎదగలేకపోతున్నాం. మానవత్వం విలువల్ని మరచాం. పైవానిని అధిగమించుటకై గురువర్యులు ఈ క్రింది సూత్రాలను, మార్గదర్శకాలను అందించారు.

1) జీవన లక్ష్యాన్ని నిర్వచించుకొని గుర్తెఱుగుట

2) జీవితాన్ని జీవిస్తున్నామా? లేక గ్రుడ్డిగా కాలాన్ని వెళ్ళదీస్తున్నామా?

వీరభగత్‌సింగ్ దేశ ప్రజల సౌభాగ్యానికై ఉరికంబ మెక్కాడు. తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించాడు.

**అర్హుడైన వానికి మాత్రమే వేదం తన అర్థమంతటినీ తెలియనిస్తుంది**

కలకత్తాకు సమీపంలో హసన్‌పూర్ అనే ఒక గ్రామం ఉంది. అచ్చట ఒక స్త్రీ తన 27 వ యేటనే భర్తను కోల్పోయింది. భర్త సరియైన వైద్యం అందక చనిపోవుట ఆమె మనస్సులో బలంగా నాటుకొంది. ఇట్టి స్థితి మరొకరికి సంభవించకుండా చూడాలని ఆమె సంకల్పించుకొంది. కూరగాయలమ్మెడి వ్యాపారంతో తన బిడ్డలను పోషిస్తూ గుట్టుగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నది. ఆసుపత్రిని స్థాపించాలనెడి సంకల్పసిద్ధికై ఆమె అదనంగా పనిచేసి ధనాన్ని ప్రోగుచేసింది. ఒక కుమారుడు వైద్య విద్యనభ్యసించి తల్లి సంకల్పాన్ని నెరవేర్చెడి బాధ్యతను తన భుజానవేసుకున్నాడు. ఆమె తన 47 సంవత్సరాల వైధవ్య జీవితంలో 20 వేల రూపాయలు మిగిల్చింది. దీనితో వైద్యునిగా ఎదిగిన కుమారుని అండతో తన ఏకైక లక్ష్యమైన ఆసుపత్రిని ప్రారంభించింది. తన కలను సాకారం చేసుకొంది. ఉన్నత స్వార్థరహిత సమాజహిత లక్ష్యాలకు దైవీశక్తులు తోడ్పడుతాయి. పేదరికం, ధనలేమి అడ్డుగా నిలవవనెడి దానికి ఇది ఒక ఉత్కృష్ట ఉదాహరణ.

అలాగే మానవీయతకు మరో మచ్చుతునకగా నిలిచింది. జేమ్స్‌హారిసన్ జీవితం. ఈయన ఆస్ట్రేలియాలో రోజువారి కూలీ. తన 13 వ యేట జరిగిన ప్రమాదంలో ఒక కాలిని పోగొట్టుకున్నాడు. ఐనా కృంగిపోలేదు. జీవితంపై చెక్కుచెదరని విశ్వాసంతో మానవ సేవను తన జీవనలక్ష్యంగా చేసికొని, ఒంటికాలితో తన లక్ష్యసాధనగా అడుగులు వేశాడు. సైకిల్ యాత్రలు చేయసాగాడు. రక్తదానశిబిరాల్లో పాల్గొని 18 సంవత్సరాల పాటు రక్తదానం చేశాడు. కాలక్రమంలో అతనిలోని రక్తం కొన్ని ప్రత్యేక లక్షణాలను సంతరించుకొంది. ఇదే దైవీశక్తుల తోడ్పాటుకు నిలువెత్తుఉదాహరణ. చిన్నపిల్లలకు సంక్రమించెడి ఒక విలక్షణమైన రీసస్ అనే జబ్బును నయం చేసెడి లక్షణాలను కలిగి ఉంది ఇతని రక్తం. దీనితో ఈయన రక్తం ప్రపంచంలోని 34 దేశాలకు ఎగుమతి చేయబడి దాదాపు 2 లక్షలమంది పిల్లలకు ప్రాణదానం చేయుటలో తోడ్పడింది. దీనిని బట్టి మనకు విదితమయ్యేది– మానవ సఫల జీవనానికి కావలసింది డబ్బులు, చదువు కాదు. కేవలం ఉదాత్త లక్ష్యం, దీనికి ఆరాధన, సేవా దృక్పథం తోడుకావాలి.

మరో మహామానవుని జీవితానికి ఉదాహరణ టెర్రీఫాక్స్. ఇతని కాలికి క్యాన్సర్ వచ్చింది. ఆరుమాసాలకన్న బ్రతకడని వైద్యులు ప్రకటించారు. మృత్యుముఖంలో ఉన్నాననెడి భయంకర సత్యాన్ని మనస్సున దాల్చక తన ఈ కొద్దిపాటి శేష జీవితాన్ని మానవసేవకు అంకితం చేసి ఆ మార్గంలో నడుస్తూ చనిపోవాలనుకున్నాడు. ఈ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో చైతన్యాన్ని నింపాలనెడి సంకల్పాన్ని గైకొని జాగృతి ప్రసంగాలను ఏర్పాటు చేశాడు. పెద్ద ఎత్తున దీనికి కావలసిన ధన సేకరణకై 143 రోజుల పాటు నమ్మశక్యం కాని రీతిలో 5,346 కి.మీ. దూరాన్ని ఒంటరిగా ఏకబిగిన పెరుగెత్తాడు.

మార్గం ఎలా ఉన్నా తన లక్ష్యాన్ని వీడలేదు. సంకల్పాన్ని నెరవేర్చుకున్నాడు. 200 మిలియన్ డాలర్లు అనగా నేటి మారకం విలువలో 630 కోట్ల రూపాయలు సేకరించాడు విరాళాల రూపంలో.

ఇదే మానవత్వం పరిమళించుట అంటే! దేవమానవుడుగా రూపుదాల్చుట అంటే! దైవీశక్తుల తోడ్పాటునందించుట అంటే.

మరో ఉదాహరణ – "టాల్‌స్టాయ్" ఒక పేరెన్నికగన్న రష్యా దేశపు రచయిత. పేదరికంలో పుట్టాడు. చక్కని గ్రంథాలు రచించాడు. ప్రపంచ ప్రజల మన్ననలు పొందాడు. ఎందరిలో లేనిది, ఆయనలోని ప్రత్యేకత–యాచించిన ప్రతివానికి తన వద్దనున్నది ఇచ్చివేయుట. కలియుగ దానకర్ణుడు. భార్య ఇతని పనులను ఈసడించుకొనేది. ఐనా తనలోని దానగుణాన్ని తన భార్య కన్న మిన్నగా భావించాడు. తన వద్ద ఏమిలేని సమయంలో తన ఒంటిపైనున్న బట్టలను సైతం దానం చేశాడు. అదే సమయంలో మరొకరు వచ్చి ఆయనను దానమడుగగా "అయ్యో! దానమిచ్చుటకు తనవద్ద ఏమి లేకపోయినదే" అని దుఃఖించాడు. ఆ యాచకునికి తన అశక్తతను తెలుపుచూ కన్నీటిపర్యంతమైనాడు.

మిత్రులారా! మనిషి–మనీషిగా! మహామనీషిగా! దేవతగా! ఎదుగుటకు ధనం కాదు కావలిసింది. భావసంవేదనలు కావాలి. ఉన్నత సంకల్పం, ఉన్నత లక్ష్యం, ఉన్నత జీవన విధానం కావాలి. దీనిని పంచుటకు నెరవేర్చుకొనుటకు ప్రేమ, దయ, కరుణ, మానవత్వం కావాలి. వీటినన్నింటిని ఇచ్చటి నుండి తీసికొని వెళ్ళండి.

మీ జీవితాలు ధన్యం కావాలి. శాంతితో నిండాలి. వెలుగుతో నిండాలి. *(సశేషం)*

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

*(రాబోయే సంచికలో మూడవ ప్రవచనం...)*

**ముముక్షుడైన శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడై గురువును సమిధలు చేతపట్టుకొని ఆశ్రయించాలి**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## 11.05.2015 నుండి 19.05.2015 వరకు శాంతికుంజ్ హరిద్వార్‌లో జరిగిన కార్యక్రమంపై ఒక నివేదిక

ప్రతి సంవత్సరము తెలుగుభాషా మాధ్యమంగా మే మాసములో జరిగెడి తొమ్మిది రోజుల సంజీవనీ సాధనా శిబిరము గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో 11 మే 2015 న ప్రారంభమై 19 మే 2015 తో ముగిసింది.

ఈ శిబిరములో తెలంగాణా మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి సోదర సోదరీమణులు 150 మంది పాల్గొన్నారు. వీరంతా అత్యంత శ్రద్ధాసక్తులతో శిబిరకాలమంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

శాంతికుంజ్‌లోని అత్యంత ఉత్తమ జ్ఞానసంపన్నులు, పరమపూజ్య గురుదేవులు- పరమవందనీయ మాతాజీ సూక్ష్మ సంరక్షణలో, మార్గదర్శనంలో గాయత్రీ జ్ఞానసంపదలో ఉత్తీర్ణులైన మహానుభావులు తమ జ్ఞానాన్ని హిందీ భాషా మాధ్యమంగా అందజేశారు. దీనిని తెలుగులోనికి తర్జుమా చేస్తూ శ్రీ డి.వి.ఆర్. మూర్తి, చీరాల మరియు వేణుగోపాలరెడ్డి గార్లు శిబిరంలో పాల్గొన్న శ్రోతలకు అందించుట జరిగింది.

### కార్యక్రమ వివరాలు

**10.05.2015 ఆదివారము:** సాయంత్రము హాజరైనవారితో సంకల్పము చేయించుట జరిగింది. శిబిరంలో పాల్గొనెడివారు పాటించవలసిన విధివిధానాలను తెలుపుతూ సమయసారిణిని అందించుట జరిగింది.

**11.05.2015 సోమవారము:** శ్రీమహాజన్‌గారి ప్రవచనం -గాయత్రీయజ్ఞము, గాయత్రీమంత్ర విశిష్టత, గురుదేవుల జీవనలక్ష్యం - వారి కార్యాచరణ వగైరాలపై వివరణ.

మధ్యాహ్నం 2 గం॥లకు "ఉపాసనా - ధ్యానం- జపం" అనెడి విషయమై పరమ సాత్వికుడు, నిష్ఠాగరిష్టుడు శ్రీ నమో నారాయణపండ్యా గారి ప్రవచనం ఒక అద్భుత ప్రసంగం - జ్ఞానగంగ గలగలా పారి శ్రోతల మంత్రముగ్ధుల గావించింది. జ్ఞానగంగలో వారిని మునకలు వేయించింది. కదళీఫల పాకంతో శ్రోతలకు అనాయాసంగా ఆధ్యాత్మిక జ్ఞాన రుచులను తన జ్ఞానపటిమతో అందించారు.

సాయంత్రం 6.30 గం॥లకు శ్రీమతి సావిత్రి నర్సింగరావు గారు ప్రేరణాగీతాలపనతో కార్యక్రమం ప్రారంభమైంది. తదుపరి శ్రీఉమేష్‌శర్మగారు ప్రవచిస్తూ ఋషులు, మునులు, మహాపురుషులు, సంత్‌లు చేపట్టిన కార్యక్రమాల విశిష్టతల తెలుపుచూ వారి మార్గంలో నడచి వారి లక్ష్యాల సాధనకు మనం చేయవలసిన కృషిని వివరించారు.

**12.05.2015 మంగళవారము:** ఉ॥ 9.30 గం॥లకు శ్రీఉత్తమ్‌గైక్వాడ్ వారు ఆలపించిన ప్రేరణాగీతాలాపనతో కార్యక్రమం ప్రారంభము.

శ్రీ అశ్విని సుబ్బారావుగారు- డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌గారిని సభకు పరిచయం చేస్తూ వారిని "సంత్" మహాశయునిగా అభివర్ణించారు. ఆపూటకు తనకు కావలసినదానిని మాత్రమే వినియోగించుకొని, మరునాటికి దాచుకొనకుండా జీవించెడి వారని "సంత్" అని పిలచుట పరిపాటి అని తెలిపారు.

తదుపరి డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌గారు ప్రసంగిస్తూ ధర్మ మనగా ఏమి? మూర్తిపూజ స్థాయి ఏమిటి? - గురుదేవులే మన్నారు అన్నది చెపుతూ స్వాధ్యాయ ఆవశ్యకత చెప్పారు. దారితెన్నూ తెలియని స్థితిలో మానవాళి కొట్టుమిట్టాడుచున్నది. నరరాక్షసులు, నరపశువులు, నరమానవులు వర్గీకరణ వివరిస్తూ జనాభాపై నియంత్రణ ఆవశ్యకతను తెలిపారు. కర్తవ్యాన్ని బోధించారు.

మధ్యాహ్నం 2 గం॥లకు శ్రీ జితేంద్రమిశ్రాగారి ప్రవచనం - గురుదీక్ష అనగా మంత్రదీక్ష ప్రాశస్త్యాన్ని, దాని ఆవశ్యకతను సవివరంగా తెలియజెప్పి శిబిరంలో పాల్గొన్నవారిని మంత్రదీక్ష తీసికొనుటకై మానసికంగా సంసిద్ధుల గావించారు.

సా॥ గం॥ 6.45 ని॥లకు శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రవచిస్తూ మానవజీవన ప్రాశస్త్యాన్ని, దాని లక్ష్యాన్ని తెలియ

**వేదాన్ని కేవలం భగవదనుగ్రహం కొరకు చదవాలి కాని కానుకలు పొందుట కొరకు కాదు**

జేస్తూ, తన జీవితంలో తాను పొందిన అనుభవాలను, ఆనందాన్ని, సుఖసంతోషాలను సభికులతో పంచుకొన్నారు. వారి ప్రసంగం ఆసాంతం ప్రేరణాత్మకంగా సాగింది.

**13.05.2015 బుధవారము:** ఉ॥ 5.30 గం॥లకు 200 మంది మంత్రదీక్షను గాయత్రీపరివార్ శాంతికుంజ్ వరిష్ఠ ప్రతినిధి రెండు దశాబ్దాల అనుభవజ్ఞులు, చక్కని సాధకులైన శ్రీ పరమానందద్వివేదిగారు మంత్రదీక్షను అందజేశారు.

ఉదయం 9.30 గం॥లకు శ్రీ ప్రమోదభట్నాగర్‌గారి ప్రవచనం భారతీయ సంస్కృతి దాని విశిష్టత, అనుసరించ వలసిన మార్గం, గాయత్రీమంత్రజప విశిష్టత, దానివలన కలిగెడి లాభాలు, చారిత్రక సాక్ష్యాలు వివరిస్తూ శ్రోతల మనస్సుకు హత్తుకునేలా సాగింది వారి ప్రవచనం.

మధ్యాహ్నం 2.30 గం॥లకు డా॥ అశోక్‌దోకే – దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఆచార్యులు – పూజ్య గురుదేవుల విరచితమైన ప్రజ్ఞాపురాణం దాని విశిష్టత, ఆవశ్యకతల గురించి వివరణాత్మకంగా మనస్సుకు హత్తుకునేలా వివరించారు.

రాత్రి 7.00 గం॥లకు శాంతికుంజ్ హరిద్వార్, దక్షిణ దేశ విభాగంలో పనిచేయుచున్న సుదీర్ఘ అనుభవమున్న కార్యకర్త శ్రీశివాజీగారు శాంతికుంజ్–విశ్వవిద్యాలయం వివిధ విభాగాల గురించి శిబిర సభ్యులకు వివరించారు.

**14.05.2015 గురువారము:** ఉదయం 7.30 గం॥లకు డా॥ ప్రణవ్‌పండ్యా అఖిల విశ్వగాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు, దేవసంస్కృతివిశ్వవిద్యాలయ కులపతిగారి సందర్శన మరియు వారి ఆశీస్సులను పొందుట జరిగింది.

ఉదయం గం॥ 9.45 ని॥లకు ప్రేరణాగీతాలతో తరగతి ప్రారంభము. తదుపరి డా॥ చిన్మయపండ్యాగారి "జీవించే కళ" (ఆర్ట్ ఆఫ్ లివింగ్) అనెడి అంశముపై ప్రసంగించారు.

వారి ప్రవచనము ఆద్యంతము సభికులను ఆకట్టుకుంది. జీవించేకళకు కావల్సింది మొదట సంకల్పము. తదుపరి చక్కని కార్యాచరణ ప్రణాళిక – మొక్కవోని ధైర్యం – బలమైన ఆత్మవిశ్వాసం – మధ్యలో ఎదురయ్యెడి ఆటంకాల అధిరోహిస్తూ సడలని పట్టుదల కావాలి అని ఉద్బోధించారు. దీనికి చారిత్రక ఉదాహరణలను జోడించి తన ప్రవచనాన్ని ప్రాణశక్తితో నింపి, సభికులను మంత్రముగ్ధుల గావించారు.

మధ్యాహ్నం ప్రవచనాన్ని రద్దు చేసి, విశ్వవిద్యాలయ సందర్శనను, శాంతికుంజ్ ప్రాంగణ సందర్శనను ఏర్పాటు చేశారు. సాయంత్రము 6.30 గం॥లకు శ్రీ డి.వి.ఆర్. మూర్తిగారు గాయత్రీయజ్ఞము మరియు సంస్కారాల వివరిస్తూ, విశ్లేషిస్తూ సభికులకు వీటిపట్ల చక్కని అవగాహన కల్గేలా వివరించారు.

**15.05.2015 శుక్రవారము :** ఉదయం 9.00 గం॥లకు సామూహిక ఫోటోలు తీయించుకొనుట జరిగింది.

ఉదయం 11.00 గం॥లకు శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రజ్ఞాపురాణ కథను– పాటలతో కూర్చి చక్కగా అందించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రజ్ఞాపురాణం పై ప్రముఖులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఉటంకించుట జరిగింది. సందర్భానుసారం ప్రేరణాగీతాల జోడించి సాగిన ప్రజ్ఞాపురాణ ప్రవచనము ఆద్యంతం రక్తికట్టింది.

మధ్యాహ్నం 2 గం॥లకు శాంతికుంజ్ హరిద్వార్ వరిష్ఠ ప్రతినిధి శ్రీపరమానందద్వివేదిగారు "ఆత్మజ్ఞానము" అనెడి దానిపై ప్రవచించారు. ఉపాసన, సాధన, ఆరాధనల విశ్లేషిస్తూ ఉదారత, పవిత్రత, పురుషార్థాల విశిష్టతలను తెలియజెప్పారు. మూడు శరీరాల వివరిస్తూ స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను విశ్లేషించారు. ఆయా శరీరాలు చేసెడి పనుల వివరించారు. అట్లే మనిషిలోని త్రిగుణాలైన సత్వరజస్తమోగుణాల విశ్లేషణ గావిస్తూ వాని నియంత్రణను తెలియజేశారు.

సాయంత్రం 6.30 గం॥లకు ముద్రావిజ్ఞానం పైన, 16 ముద్రల గురించి విశ్లేషణ వాని లాభాలు తెలియజేయుట జరిగింది.

**16.05.2015 శనివారము:** హరిద్వార్, ఋషీకేశ్‌ల సందర్శన

**17.05.2015 ఆదివారము:** ఉదయం 8.30 గం॥లకు శ్రీమతి శ్యామారాథోడ్‌గారు "కుటుంబ నిర్మాణం దాని ప్రాధాన్యతల గురించి ప్రవచించారు. తన ప్రసంగంలో పరివార్ అనగానేమి? సుఖశాంతులు ఎలా వస్తాయి? దీనికి ఆధారమేమి? అనెడి వానిపై విశ్లేషణాత్మకంగా సాగింది ప్రవచనం. పరివార్‌లో స్త్రీ పాత్ర ఏమిటి? తల్లి పాత్ర ఏమిటి? అనెడి వానిపై లోతుగా విశ్లేషణ జరిపారు.

**సద్గ్రంథ పఠనం కూడా సద్గురుని అనుగ్రహం వల్లనే సార్థకమవుతుంది**

పరివారాన్ని కనటం తేలిక కాని వారిని తీర్చిదిద్దుట చాలా కష్టంతో కూడిన పని అని చెప్పారు. దీనికై 5 సూత్రాల ప్రణాళికనిచ్చారు పూజ్యగురుదేవులు 1) పరస్పర సమ్మానం 2) తప్పొప్పుల అంగీకరించుట అలవరచుకోవాలి 3) ఇతరుల ఆలోచనల గౌరవించాలి 4) భేదభావాలను పెంచుకొనరాదు 5) వివాదాల నిష్పాక్షికంగా పరిష్కరించుకోవాలి

ఉదయం 11.30 గం॥లకు పిండతర్పణ కార్యక్రమాన్ని శ్రీశివాజీగారు నిర్వర్తించారు. 45 మంది పాల్గొన్నారు..

సాయంత్రం 6.30 గం॥లకు శ్రీమతి డా॥ గాయత్రీదేవి శర్మగారు "గర్భోత్సవం" అనగా బిడ్డ తల్లిగర్భంలోనున్నప్పుడు వివిధ దశలలో శిశువు పొందెడి మార్పులు, అనుభవాలు, కదలికలు, నేర్చుకొనుట, పొందెడి అనుభూతులు, పరిసరాల ప్రభావానికి శిశువు స్పందించెడి తీరు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు శిశువుపై ప్రభావం చూపుట మున్నగువానిని విశ్లేషిస్తూ చక్కని ప్రవచనాన్ని అందించారు. దీనికి తోడుగా స్లైడ్స్ ప్రదర్శిస్తూ శాస్త్రబద్ధంగా ఋజువుల చూపించారు.

**18.05.2015 సోమవారము :** ఉదయం 9.30 గం॥లకు శాంతికుంజ్‌లోని యువా విభాగం నుండి శ్రీమనీష్‌కుమార్ వచ్చి, ఈ క్రింది అంశాలపై యువా విభాగం అందించుచున్న సేవల గురించి తెలియజేశారు. సప్త ఆందోళనలు గురించి వివరణ అందించారు.

మధ్యాహ్నం శ్రీమతి ఉషాజైశ్వాల్‌గారు మాట్లాడారు.

రాత్రి 7.00 గం॥లకు శిబిరంలో పాల్గొన్నవారు తమ తమ అనుభూతులను తెలియజేశారు. సమయదానమిచ్చుటకు కొందరు ముందుకు వచ్చారు. 2015 గోదావరీనది పుష్కరాలలో పాల్గొనుటకు అనేకమంది ముందుకు వచ్చారు. కొందరు వారు చెల్లించదలచిన అంశదానాల గురించి ప్రకటించారు.

చిట్టచివరకు గౌరీజీగారు వీడ్కోలు సందేశాన్ని అందించారు. ప్రతిరోజు నిద్రలేవగానే శాంతికుంజ్‌కు మానసికయాత్ర చేసి, పూజ్యగురుయుగ్మ ఆశీస్సులను అనునిత్యము పొందుచూ, ఆధ్యాత్మికంగా, మహామానవులుగా ఎదుగవలసిందిగా కోరారు.

గాయత్రీశక్తి మనిషిని దేవతగా మార్చుతుంది, శ్రద్ధతో ప్రజ్ఞ వికసిస్తుంది. ఆత్మపరిశీలన చేసికొని ఆత్మజ్ఞానాన్ని పొందండి అని ఉద్బోధించారు.

"సర్వేజన సుఖినోభవన్తు – సమస్తలోకా సుఖినోభవన్తు! ఓం శాంతిః శాంతిః శాంతిః!" అని వీడ్కోలు సందేశాన్ని ముగించారు.

---

## అందరికీ ఆహ్వానము

# 24 లక్షల సామూహిక గాయత్రీజప సాధనా శిబిరము

గాయత్రీపరివార్ ట్రస్టు విశాఖపట్నం వారి సారథ్యంలో మరియు శ్రీజగదీష్‌కుమార్ అసోపా, గాయత్రీపరివార్ విశాఖపట్నం వారి సహాయ సహకారాలతో 24 లక్షల సామూహిక గాయత్రీజప సాధనా శిబిరాన్ని 31.07.2015 నుండి 08.08.2015 వరకు ఉదయం 5 గం॥ల నుండి సాయంత్రము 6 గం॥ల వరకు ప్రతిరోజు ఈ క్రింది ప్రదేశములో జరుగును. 09.08.2015 న దీని పూర్ణాహుతి జరుగును.

**"శ్రీహరిహరక్షేత్రము - గొల్లపాలెం, శ్రీహరిపురం, కోరమండల్ ఫెర్టిలైజర్స్ గేటు ఎదురుగా, విశాఖపట్నం"**

జపములో పాల్గొనెడి సాధకులకు తగిన రీతిలో భోజన, వసతిసౌకర్యాలు కల్పించబడతాయి. ఈ క్రింది ఫోన్ల ద్వారా సాధకులు తమ పేర్లను నమోదుచేసికొనవచ్చును. ఫోన్: 9490132923 / 9394803836

ఇది విశ్వశాంతిని కాంక్షిస్తూ, విశ్వ సంరక్షణకై పూజ్యగురుదేవుల మార్గంలో చేపట్టబడిన కార్యక్రమము. సాధనకు ఇది ఒక చక్కని అవకాశము. దీనిని అందరూ వినియోగించుకొన ప్రార్థన.

**ఇట్లు - గాయత్రీపరివార్ ట్రస్టు, విశాఖపట్నం**

**అనుగ్రహానికి భక్తి సాధనం - యుక్తి కాదు**